veluturu telugu daily

వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ సోమవారం 5.10.2026

సంపుటి : 9 సంచిక : 113

www. veluturu.com

ఎస్ఎల్‌బీసీలో క్లిష్ట దశను దాటాం

- ఐదారు నెలల్లో సుమారు 700 మీటర్ల పురోగతి
- అదనపు యంత్రాలు, జర్మనీ నుంచి లోకోమోటివ్‌తో పనుల వేగం పెంపు
- 2028 జూన్ నాటికి నీటి సరఫరా లక్ష్యం.. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

- వివరాలు 2 లో..

గ్రామీణ ఆడబిడ్డల చేతి ఉత్పత్తులకు నగర మార్కెట్

అక్టోబర్ 7 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో సారస్ మేళా

సారస్‌ను సందర్శించి మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి : సీతక్క

12

హైదరాబాద్‌లో 70 ఏళ్ల పాలనా వ్యవస్థ రద్దు

- అక్టోబర్ 2 నుంచి క్యూర్-2026 అమలు చట్టం అమలులోకి..
- 70 ఏళ్ల జీహెచ్ఎంసీ చట్టానికి ముగింపు
- ఒక్క ఐడీ పన్ను, నీటి బిల్లులకు ఒకే బిల్లు ఉండేలా చర్యలు

12



తెలంగాణకు పిడుగుల ముప్పు

- పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్ష సూచన
- గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు
- రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన
- మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం

హైదరాబాద్, వెలుతురు:

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వాతావరణంలో అకస్మాత్తుగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాబోయే సమయంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంద ని తెలిపింది. ఈ నేపథ్యంలో సదరు జిల్లాల ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు

వర్ష సూచన ఉన్న జిల్లాల్లో గాలుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. వేగవంతమైన గాలుల వల్ల బలహీనమైన నిర్మాణాలు, చెట్ల కొమ్మలు, విద్యుత్ వైర్లు తెగిపడే ప్రమాదం ఉన్నందున వర్షం పడే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని, సురక్షితమైన ప్రదేశాల్లో ఆశ్రయం పొందాలని అధికారులు స్పష్టం చేశారు.

మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు

వర్ష ప్రభావం ఉన్న జిల్లాలు మినహా, తెలంగాణలోని మిగిలిన జిల్లాల్లో వాతావరణం సాధారణంగా పొడిగా ఉంటుందని వాతావరణ నివేదిక పేర్కొంది. అయితే, కొన్ని ప్రాంతాల్లో స్థానికంగా మబ్బులు క్రముకుని వచ్చి తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

బియ్యం ధరకు రెక్కలు..

తెలంగాణలో ఇటీవలి నెలల్లో బియ్యం ధర గణనీయంగా పెరిగింది. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ధరల సమాచారాన్ని ఉటంకిస్తూ వచ్చిన నివేదిక ప్రకారం, తెలంగాణలో బియ్యం సగటు రిటైల్ ధర జూలైలో కిలో రూ.54.40 ఉండగా, సెప్టెంబర్‌లో రూ.61.60కి చేరింది. అంటే కేవలం మూడు నెలల్లోనే కిలోకు రూ.7.20, దాదాపు 13.32 శాతం పెరుగుదల నమోదైంది. దేశంలో రాష్ట్రాల వారీగా నమోదైన అత్యధిక పెరుగుదలల్లో ఇది రెండోది. ఇక కేంద్ర ధరల పర్యవేక్షణ వ్యవస్థ ప్రకారం అక్టోబర్ 3న దేశవ్యాప్తంగా బియ్యం సగటు రిటైల్ ధర కిలో రూ.46.08గా ఉంది. ఆరు నెలల క్రితం హోల్‌సేల్ ధర క్వింటాల్‌కు రూ.3,776.79 ఉండగా, ప్రస్తుతం రూ.4,153.36కు చేరింది. అంటే హోల్‌సేల్ స్థాయిలోనూ సుమారు 10 శాతం పెరుగుదల కనిపిస్తోంది.

- మిగతా 2 లో..

దసరా, దీపావళి వేళ ధరల సెగ

సామాన్యుడి బడ్జెట్‌కు పెనుభారం

పండుగలు వచ్చాయంటే కొత్త బట్టలు, ఇంటి సరుకులు, పిల్లల అవసరాలు, బంధుమిత్రులకు కానుకలు.. ఇలా ఖర్చులు పెరగడం సహజం. కానీ ఈసారి దసరా, దీపావళికి ముందే నిత్యావసరాల ధరలు కుటుంబ బడ్జెట్‌ను గట్టిగా దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా బియ్యం, వంట నూనెలు, పెట్రోల్ ధరలు సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారాన్ని మోపుతున్నాయి.

- హైదరాబాద్, వెలుతురు

- బియ్యం, వంట నూనె, పెట్రోల్ ధరలతో పెరిగిన నెలవారీ భారం
- ఆరు నెలల్లో నిత్యావసరాల ధరల్లో గణనీయమైన మార్పులు
- హైదరాబాద్‌లో పెరిగిన జీవన వ్యయం.. కుదేలవుతున్న కుటుంబ బడ్జెట్లు
- దసరా-దీపావళి ఖర్చులకు పొదుపు సరిపోని పరిస్థితి.. అప్పులే దిక్కు
- పండుగ కొనుగోళ్లపై కోత.. మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక ఒత్తిడి

బియ్యం ఇయ్యకుంటే కష్టమ్

రైస్ మిల్లర్లకు సర్కార్ సీరియస్ వార్నింగ్

డిఫాల్టర్ రైస్ మిల్లర్ల నుంచి 'రెవెన్యూ రికవరీ'

కాలయాపన చేస్తున్న రైస్‌మిల్లర్లపై పౌరసరఫరాల శాఖ కఠిన నిర్ణయం

హైదరాబాద్, వెలుతురు:

తెలంగాణలో సివిల్ సప్లై కార్పొరేషన్‌కు ధాన్యం బకాయిలు ఉన్న డిఫాల్టర్ రైస్ మిల్లర్లపై ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ ధాన్యాన్ని తీసుకుని, బదులుగా ఇవ్వాల్సిన బియ్యాన్ని అప్పగించకుండా నిర్లక్ష్యం వహించిన మిల్లర్లపై రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) చట్టం అమలుకు నిర్ణయించింది. ప్రత్యేక డ్రైవ్ ద్వారా ధాన్యం బకాయిల వసూలుకు ప్రణాళిక సిద్ధం చేసింది. రైస్ మిల్లర్లు ధాన్యం తిరిగి ఇవ్వడం లేదా ఆస్తులు కోల్పోవడానికి సిద్ధంగా ఉండాలని పౌర సరఫరాల శాఖ హెచ్చరించింది.

తెలంగాణ రాష్ట్రంలో రైతుల వద్ద నుంచి కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిన ప్రభుత్వ ధాన్యానికి సంబంధించి, పౌర సరఫరాల శాఖకు అప్పగించాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్బకాయిల పట్ల ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ప్రజల సొమ్ముతో సేకరించిన ధాన్యాన్ని దారి మళ్లిస్తూ కాలయాపన చేస్తున్న డిఫాల్ట్ మిల్లర్ల ఆటకట్టించేందుకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వానికి రావలసిన బియ్యాన్ని తక్షణమే అప్పగించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం కింద ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో పాటు తీవ్ర పరిణామాలు - మిగతా 2 లో..

ఓటమి భయంతో రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై కాంగ్రెస్ విషప్రచారం

ప్రధాని మోదీని మూడోసారి ఆశీర్వదించడం జీర్ణించుకోలేకపోతోంది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

2

మా వాటా తీసుకుంటాం.. అవసరమైతే లాక్కుంటాం

బీసీల హక్కుల కోసం పోరాడుతాం : మహేష్‌కుమార్ గౌడ్

శంషాబాద్‌లో టీపీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ

దేశవ్యాప్తంగా ఓబీసీ కులగణన చేపట్టాలని డిమాండ్

కులగణన సామాజిక న్యాయానికి పునాది : పొన్నం ప్రభాకర్

11

సాబర్ డెయిరీతో తెలంగాణ పాడి రైతులకు మరింత ఊతం

తూప్రాన్‌లో రూ.400 కోట్లతో మెగా సమగ్ర డెయిరీ ప్లాంట్

ప్రారంభ దశలో రోజుకు 5 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ సామర్థ్యం

మెదక్, వెలుతురు:

మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఊర్జా పారిశ్రామిక పార్కులో సాబర్ (అమూల్) డెయిరీ మెగా సమగ్ర డెయిరీ ప్లాంట్‌కు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణలో డెయిరీ ప్రాసెసింగ్ రంగానికి ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు - మిగతా 2 లో..

తుది దశకు ఎస్ఐఆర్

- ఓటరు జాబితాపై ఉత్కంఠ
- 92.88 లక్షల మందికి నోటీసులు
- 59.35 లక్షల మంది తుది జాబితాకు అర్హులు
- అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు
- నవంబర్ 9న తుది ఓటరు జాబితా

2

'కేబీఆర్' ప్రాజెక్టు రద్దు

బదులుగా 6 లేన్లతో ఎలివేటెడ్ కారిడార్

- పార్కు చుట్టూ ఏడు కూడళ్లలో బ్రిడ్జిలు, అండర్ పాస్ల నిర్మాణ పనులు నో
- పంజాగుట్ట ఎన్ఎఫ్సీఎల్ కూడలి నుంచి జూబ్లీ చెక్‌పోస్టు మెట్రోస్టేషన్ కలుపుతూ ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్

హైదరాబాద్, వెలుతురు:

హైదరాబాద్కు నడిబొడ్డున ఉన్న కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు కూడళ్లలో స్టీలు బ్రిడ్జిలు, అండర్ పాస్ల నిర్మాణానికి రూ.1,090 కోట్ల అంచనా వ్యయంతో రెండు ప్యాకేజీలుగా చేపట్టిన పనులు రద్దయ్యాయి. నిర్మాణ పనుల వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు వస్తాయని అధికారులు భావించారు. దీంతో నెల రోజుల కిందట - మిగతా 2 లో..

ఎస్ఎల్‌బీసీలో క్లిష్ట దశను దాటాం

- ప్రమాదం జరిగిన ప్రాంతంలోని బలహీన శిలల మండలాన్ని దాటిన తవ్వకాలు
- ఐదారు నెలల్లో సుమారు 700 మీటర్ల పురోగతి
- అదనపు యంత్రాలు, జర్మనీ నుంచి లోకోమోటివ్‌తో పనుల వేగం పెంపు
- 2028 జూన్ నాటికి నీటి సరఫరా లక్ష్యం.. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 04: శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల్లో అత్యంత క్లిష్టమైన భూగర్భ పరిస్థితులను అధిగమించి కీలక ముందడుగు వేశామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో ప్రమాదం జరిగిన ప్రాంతంలోని బలహీన శిలల మండలాన్ని (షియర్ జోన్) జాగ్రత్తగా దాటడంతో పనుల వేగం పెంచేందుకు మార్గం సుగమమైందన్నారు. అదనపు యంత్రాలను రంగంలోకి దించి, తవ్విన రాళ్లు, మట్టిని బయటకు తరలించే వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో వేగంతోపాటు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కీలక నీటిపారుదల ప్రాజెక్టుల అమలుపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రి ఆదివారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, అదనపు యంత్రాల వినియోగంపై చర్చించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతంలోని మెట్ట ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా నీటిని అందించి, ఏళ్ల తరబడి వేధిస్తున్న నీటి కొరతను తీర్చాలన్నదే లక్ష్యమని తెలిపారు.

2028 జూన్ నాటికి నీటిని అందించేందుకు పక్కా కార్యాచరణ రూపొందించి, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ఐదారు నెలల్లో 700 మీటర్లు గడిచిన ఐదారు నెలల్లో సొరంగం తవ్వకాలు సుమారు 700 మీటర్లు ముందుకు సాగినట్లు ప్రాజెక్టు బృందం మంత్రికి వివరించింది. అవుట్‌లెట్ వైపు సుమారు 450 మీటర్లు, ఇన్‌లెట్ వైపు 250 మీటర్ల మేర పురోగతి నమోదైందని తెలిపింది. తీవ్రమైన భూగర్భ, సాంకేతిక సమస్యలతోపాటు యంత్రాలు, తవ్విన పదార్థాల రవాణాలో ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ ఈ పురోగతి సాధించినట్లు పేర్కొంది. మొత్తం 43.968 కిలోమీటర్ల ప్రధాన సొరంగం పనులు సుమారు 79 శాతం పూర్తయ్యాయని, మరో 9.1 కిలోమీటర్ల మేర తవ్వకాలు మిగిలి ఉన్నాయని వివరించింది. అత్యంత ప్రమాదకరమైన షియర్ జోన్‌ను దాటడం ప్రాజెక్టులో ముఖ్యమైన ముందడుగని ఉత్తమ్ పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసిన అధికారులు, కార్మికుల కృషిని అభినందించారు. ఈ పురోగతిని కొనసాగిస్తూ సొరంగంలో 20 కిలోమీటర్లకు పైగా లోపల పనిచేస్తున్న సిబ్బంది భద్రతను కాపాడేందుకు అధికారులు, గుత్తేదారు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జాగ్రత్తగా సాగిన తవ్వకాలు..

సొరంగం పనులకు నేతృత్వం వహిస్తున్న భారత సైన్యానికి చెందిన సొరంగ నిర్మాణ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఇన్‌లెట్ వద్ద ఎదురైన పరిస్థితులను వివరించారు. బలహీనమైన నేల, రాళ్లు ఒక్కసారిగా విరిగిపడే రాక్ బర్స్ట్ వంటి ప్రమాదకర పరిస్థితుల కారణంగా మరో ప్రమాదం జరగకుండా తొలి నెలల్లో తవ్వకాల వేగాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించినట్లు తెలిపారు. టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) చిక్కుకుపోయిన ప్రాంతాన్ని చుట్టి వెళ్లేలా చేపట్టిన మళ్లింపు తవ్వకాల్లో మరింత బలహీనమైన శిలల మండలం ఎదురైందని వివరించారు. ఈ ప్రాంతాన్ని సురక్షితంగా దాటేందుకు 140 మిల్లీమీటర్ల సీమ్‌లెస్ పైపులతో తవ్వకాలు జరిగే భాగానికి ముందుగా గొడుగు మాదిరి రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బలమైన రిబ్‌లను అమర్చడం, దశలవారీగా తవ్వడం, ముందున్న శిలల పరిస్థితిని తెలుసుకునేందుకు పరీక్షా డ్రిల్లింగ్ చేయడం, అదనపు రక్షణ ఏర్పాట్లతో ప్రమాదాలను నియంత్రిస్తూ ముందుకు సాగినట్లు చెప్పారు. ప్రస్తుతం శిలల పరిస్థితి మెరుగుపడుతుండటంతో సాధారణంగా పనులు సాగించే అవకాశం ఏర్పడుతోందని తెలిపారు.

యంత్రాలతో వేగం పెంపు

ప్రస్తుతం రెండు వైపులా కలిపి రోజుకు సుమారు ఎనిమిది మీటర్ల మేర పురోగతి నమోదవుతోందని ప్రాజెక్టు బృందం తెలిపింది. నిరంతరంగా సాధిస్తున్న పురోగతి రోజుకు ఏడు నుంచి ఏడున్నర మీటర్లుగా ఉందని, ఒకట్రెండు రోజుల్లో పది మీటర్లకు కూడా చేరిందని వివరించింది. అవుట్‌లెట్ వద్ద మూడు డ్రిల్లింగ్ భుజాలున్న బూమర్ యంత్రం ఇప్పటికే పనిచేస్తోందని, అక్కడ పనులు అవసరమైన వేగానికి చేరువలో ఉన్నాయని తెలిపింది.

2028 మే-జూన్‌లో ప్రధాన సొరంగం అనుసంధానం లక్ష్యం

టన్నెల్-1లో రెండు వైపుల నుంచి సాగుతున్న తవ్వకాలు 2028 మే-జూన్ నాటికి కలిసే దశకు చేరుకుంటాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. తవ్వకాలతోపాటే సొరంగం లోపలి గోడలను బలపరిచే స్ప్రే లైనింగ్ పనులు చేపడుతున్నారని, దీంతో సొరంగం అనుసంధానం పూర్తయ్యేలోపే లైనింగ్‌లో అధిక భాగాన్ని పూర్తి చేసే అవకాశం ఉందని సమీక్షలో వివరించారు. సమీక్షలో ఎంపీలు కె. రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, కె. జైవీర్‌రెడ్డి, వేముల వీరేశం, అనిల్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్; నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్; ఇంజినీర్ ఇన్ చీఫ్ ఓ.వి. రమేష్‌బాబు, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

బియ్యం ఇయ్యకుంటే కష్టమ్..

(మొదటి పేజీ తరువాయి)

ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

అక్టోబర్ 5 నుంచి అధికారులకు ప్రత్యేక శిక్షణ, జప్తు ప్రక్రియ:

చట్టపరమైన చిక్కులు తలెత్తకుండా మిల్లర్ల ఆస్తులను వేగంగా జప్తు చేయడం కోసం పౌర సరఫరాల శాఖ అధికారులకు హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థలో అక్టోబర్ 5వ తేదీ నుంచి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తనిఖీల ప్రక్రియను మరింత పటిష్టం చేసేందుకు వీలుగా ప్రభుత్వం నూతన నిబంధనలను సైతం అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో అకస్మాత్తుగా నిర్వహించే తనిఖీల్లో గోదాముల్లో ధాన్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు తేలితే సదరు మిల్లర్లకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు.

ఏడు రోజుల గడువు, కఠిన నిబంధనల అమలు

నోటీసులు అందుకున్న మిల్లర్లు కేవలం ఏడు రోజుల వ్యవధిలోనే పూర్తి వివరణ సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ నిర్ణీత గడువులోగా సరైన సమాధానం రాకపోతే ఎలాంటి మినహాయింపులు లేకుండా నేరుగా ఆస్తుల జప్తు, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అధికారులు మార్గం సుగమం చేశారు. ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగానికి పాల్పడే వారిపై ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపాలని పౌర సరఫరాల శాఖ నిశ్చయించుకుంది.

‘కేబీఆర్’ ప్రాజెక్టు రద్దు..

(మొదటి పేజీ తరువాయి)

వన్ వే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఈ వన్ వే విధానంతో ఒకట్రెండు రోజుల పాటు వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అయితే మూడో రోజు నుంచి సిగ్నళ్ల వద్ద నిరీక్షణ లేకుండా సాఫీగా సాగిపోవడం మొదలైంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడంతో కారిడార్ నిర్మాణానికి రూ.వందల కోట్లు ఖర్చు చేయడం వృథా అని ప్రభుత్వం భావించింది. దీనికి సంబంధించి ఇంజినీరింగ్ విభాగం రూపొందించిన తీర్మానాన్ని శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక అధికారి, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అధ్యక్షతన నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశంలో అధికారులు ఆమోదించారు.

కూడళ్లలో తలపెట్టిన పనులు రద్దు

కేబీఆర్ పార్కు గేట్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, జూబ్లీ చెక్‌పోస్టు, ముగ్గా జంక్షన్ తదితర కూడళ్లలో తలపెట్టిన పనులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులకు సంబంధించిన కాంట్రాక్టు సంస్థలు కేఎన్ఆర్, మేఘాతో చేసుకున్న ఒప్పందాల రద్దుకు కూడా స్థాయీ సంఘం ఆమోద ముద్ర వేసింది. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పాల్గొన్నారు.

ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం

పంజాగుట్ట నుంచి హైటెక్సిటీకి ట్రాఫిక్ సిగ్నళ్లు లేని రహదారుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా పంజాగుట్ట ఎన్ఎఫ్‌సీఎల్ కూడలి నుంచి జూబ్లీ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ రోడ్డును (జూబ్లీహిల్స్ రోడ్డు నెం.36) కలుపుతూ ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. ఈ పైవంతెన 4 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. బంజారాహిల్స్ రోడ్డు నెం.3లోని ముఫకంజా విద్యాసంస్థల వద్ద పైవంతెన ఎక్కితే నేరుగా చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ కింద దిగొచ్చు.

డిజైన్లు పూర్తయ్యాక అంచనా వ్యయం

చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ వద్ద వంతెన ఎక్కిన వాహనాలు ముఫకంజా కాలేజీ వద్ద దిగుతాయి. బంజారాహిల్స్ రోడ్డు నెం.1 వైపు వెళ్లే వాహనాల కోసం ప్రత్యేకంగా ఎలివేటెడ్ కారిడార్ నుంచి జలగం వెంగళరావు పార్కు వరకు ర్యాంపు నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్లు పూర్తయ్యాక అంచనా వ్యయం, ఇతరత్రా అంశాలపై స్పష్టత రానుంది. కేబీఆర్ పార్కు ప్రాజెక్టు రద్దయినందున ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును జీహెచ్ఎంసీ మేఘా సంస్థకు అప్పగించింది.

ఓటమి భయంతో రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై
కాంగ్రెస్ విషప్రచారం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 04: దేశవ్యాప్తంగా ఎదురవుతున్న వరుస ఎన్నికల పరాజయాలను తట్టుకోలేక, ప్రజాతీర్పును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అవమానిస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో వరుసగా మూడు పర్యాయాలు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించి, నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా ఆశీర్వదించడాన్ని ఆ పార్టీ నాయకత్వం జీర్ణించుకోలేకపోతోందని పేర్కొన్నారు. ప్రధాని పీఠం కేవలం నెహ్రూ-గాంధీ కుటుంబానికి మాత్రమే సొంతమనే రాచరికపు అహంకారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, ఒక సామాన్య ‘చాయ్‌వాలా’ దేశ ప్రధాని పదవిని చేపట్టి విజయవంతంగా పరిపాలన సాగించడాన్ని చూసి ఓర్వలేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

దేశంలో జరిగిన ఎన్నికలన్నీ బూటకమని, వాటిని రద్దు చేయాలంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడటం భారత ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును వినియోగించుకున్న కోట్ల మంది పౌరుల విచక్షణను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీతో పాటు ప్రకాష్ రాజ్ లాంటి శక్తులు ఏకమై భారత అత్యున్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు), రాష్ట్రపతి కార్యాలయం, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వంటి రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు. ఈ విధంగా వ్యవస్థలను బలహీనపరిచి దేశ సమగ్రతకు భంగం కలిగించేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని విమర్శించారు.

హైదరాబాద్ నగర పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ (SIR - ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఈ ప్రక్రియను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగమే నిర్వహిస్తోందని, ఏవైనా అభ్యంతరాలుంటే వాటిపై ఎన్నికల సంఘం క్షేత్రస్థాయి విచారణ జరిపిన తర్వాత మాత్రమే ఓట్ల తొలగింపుపై నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఫామ్-7 సమర్పించినంత మాత్రాన ఓట్లు నేరుగా తొలగించబడవని, దొంగ ఓట్లు, నకిలీ ఓట్ల ఏరివేత కోసమే నిబంధనల ప్రకారం ఫామ్-7 విధానం ఉందని గుర్తుచేశారు. పైగా బీజేపీకి చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏ-1, బీఎల్ఏ-2) ఎవరూ కూడా అటువంటి దరఖాస్తులు సమర్పించలేదని స్పష్టం చేశారు.

ఎక్కడైనా ఎన్నికల్లో గెలిస్తే వ్యవస్థలు సక్రమంగా ఉన్నాయని, ఓడిపోతే మాత్రం ఈవీఎంలు, ఎస్ఐఆర్ ప్రక్రియలపై నిందలు వేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. కేరళ వంటి రాష్ట్రాల్లో గెలిచినప్పుడు ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రశంసించిన ఆ పార్టీ నేతలు, ఓడిపోయే చోట మాత్రం బురదజల్లుతున్నారని ఆక్షేపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కించపరుస్తూ, నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ పన్నుతున్న కుట్రలను భారత ప్రజలు ఎక్కడికక్కడ తిప్పికొడతారని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని శ్రీ ఎన్. రాంచందర్ రావు హెచ్చరించారు.

ధరల సెగ..

(మొదటి పేజీ తరువాయి)

వంట నూనెల మంట

ఇంటి వంటగదిలో మరో పెద్ద భారం వంట నూనె. హైదరాబాద్‌లోనే గత కొన్ని నెలల్లో పలు రకాల ఎడిబుల్ ఆయిల్స్ ధరలు లీటరుకు రూ.20-30 వరకు పెరిగినట్లు స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. జూన్‌లోనే సన్‌ఫ్లవర్, పామ్, రైస్ బ్రాన్, గ్రౌండ్‌నట్ తదితర నూనెల ధరలు గణనీయంగా పెరిగినట్లు నివేదికలు వెల్లడించాయి. కేంద్ర ధరల పర్యవేక్షణ ప్రకారం ఏప్రిల్‌తో పోలిస్తే అక్టోబర్ 3 నాటికి ప్యాక్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ హోల్‌సేల్ ధర 5.24 శాతం, సోయా ఆయిల్ 6.63 శాతం, పామ్ ఆయిల్ 7.02 శాతం, మస్టర్డ్ ఆయిల్ 7.72 శాతం, గ్రౌండ్‌నట్ ఆయిల్ 4.35 శాతం పెరిగాయి. పండుగల సమయంలో పిండి వంటలు, స్వీట్లు, వేపుళ్లు పెరగడంతో నూనె వినియోగం కూడా ఎక్కువవుతుంది. అదే సమయంలో అంతర్జాతీయంగా వంట నూనెల ధరలు పెరగడం, దిగుమతి వ్యయాలు, రూపాయి విలువ, రవాణా ఖర్చులు ధరలపై ప్రభావం చూపుతున్నాయి. పండుగల ముందు నూనె ధరలు మరో 7-8 శాతం పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు సెప్టెంబర్‌లో హెచ్చరించాయి. కేంద్రం సెప్టెంబర్‌లో ముడి సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10శాతం నుంచి సున్నాకు, పామ్, సోయా ఆయిల్స్‌పై 10నుంచి 5శాతానికి తగ్గించింది. ధరల ఒత్తిడిని తగ్గించడమే ఈ నిర్ణయ ఉద్దేశం.

పెట్రోల్ ధర తగ్గకపోవడమూ మరో భారం

హైదరాబాద్‌లో అక్టోబర్ 4న పెట్రోల్ ధర లీటరుకు రూ.115.69గా ఉంది. ఆగస్టు 27 నుంచి దాదాపు ఇదే స్థాయిలో కొనసాగుతోంది. జూలైలో కూడా ధర రూ.115.73 వద్ద ఉండగా, ఆగస్టు చివరికి రూ.115.69కు చేరింది. అంటే గత కొన్ని నెలల్లో పెట్రోల్ ధరలో పెద్ద మార్పు లేకపోయినా,అధిక స్థాయిలో కొనసాగుతున్న ధర కుటుంబాల రవాణా ఖర్చును తగ్గించే అవకాశం ఇవ్వడం లేదు. పెట్రోల్ ధర నేరుగా వంటింటి సరుకులో కనిపించకపోయినా, కూరగాయలు, బియ్యం, నూనె వంటి సరుకుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపుతుంది. కార్యాలయాలకు, పిల్లల పాఠశాలలకు, ఇతర అవసరాలకు ద్విచక్ర వాహనాలు ఉపయోగించే కుటుంబాలకు నెలవారీ ఇంధన వ్యయం కూడా గణనీయమైన మొత్తమే.

పండుగ ఖర్చులకు అప్పే దిక్కా?

ఇప్పటికే నెల జీతంలో అద్దె, విద్యుత్, పిల్లల చదువు, వైద్యం, ప్రయాణం, ఇంటి సరుకులకే పెద్ద మొత్తంలో ఖర్చవుతున్న పరిస్థితిలో పండుగల అదనపు వ్యయం మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బంది పెడుతోంది. బియ్యం, నూనె వంటి ప్రాథమిక వస్తువుల ధరలు పెరగడంతో నెలవారీ కిరాణా బడ్జెట్‌ను పెంచాల్సి వస్తోంది. మరోవైపు పండుగ దుస్తులు, పిల్లల అవసరాలు, బంధువులకు కానుకలు, ప్రయాణాలు, పూజా సామగ్రి వంటి అదనపు ఖర్చులు ముందుకొస్తున్నాయి. దీంతో పొదుపు తగ్గించుకోవడం, అవసరమైన వస్తువుల కొనుగోలును వాయిదా వేయడం, పండుగ కొనుగోళ్లను తగ్గించడం వంటి మార్గాలను కుటుంబాలు ఎంచుకోవాల్సి వస్తోంది. ఆదాయం పెరగకుండానే ఖర్చులు పెరుగుతున్న కుటుంబాలకు చివరికి క్రెడిట్ కార్డు, వ్యక్తిగత రుణం, బంధువుల అప్పు లేదా ఇతర రుణాలపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతోంది. జాతీయ స్థాయిలో ఆగస్టు 2026లో ఆహార ద్రవ్యోల్బణం 5.95 శాతంగా నమోదవడం కూడా ఆహార ధరల ఒత్తిడి కొనసాగుతున్నదనే విషయాన్ని సూచిస్తోంది. పండుగలు ఆనందాన్ని పంచాల్సిన సమయంలో.. నిత్యావసరాల ధరల పెరుగుదల సామాన్యుడి ఇంటి బడ్జెట్‌లో మాత్రం కొత్త అప్పుల భయాన్ని పెంచుతోంది. దసరా-దీపావళి కొనుగోళ్లకు ముందు ధరలు మరింత పెరిగితే, పేద, మధ్యతరగతి కుటుంబాలకు పండుగ ఖర్చులు అదనపు ఆర్థిక భారంగా మారే అవకాశం ఉంది.

తుది దశకు ఎస్ఐఆర్

- ఓటరు జాబితాపై ఉత్కంఠ
- 92.88 లక్షల మందికి నోటీసులు
- 59.35 లక్షల మంది తుది జాబితాకు అర్హులు
- అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు
- నవంబర్ 9న తుది ఓటరు జాబితా

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 4: తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కీలక ముగింపు దశకు చేరుకుంది. ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు, దావాలు స్వీకరించడంతోపాటు నోటీసులు జారీ చేసిన ఓటర్ల వివరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకునే ప్రక్రియ కొనసాగుతోంది. అక్టోబర్ 3 నాటికి 92,88,181 మంది ఓటర్లకు నోటీసులు జారీ కాగా, వారిలో 90,26,993 మందికి నోటీసులు అందినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. మరో 2,61,191 నోటీసులు ఇంకా అందాల్సి ఉంది.

ఎస్ఐఆర్‌లో భాగంగా తార్కిక వ్యత్యాసాలు, పాత జాబితాతో వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో పలువురు ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారి నుంచి వివరణలు, అవసరమైన ఆధారాలను స్వీకరించి అర్హతను పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు 59,35,479 మంది ఓటర్లు తుది జాబితాలో చేర్చేందుకు అర్హులుగా గుర్తించినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మిగిలిన కేసుల పరిష్కారం ప్రస్తుతం అత్యంత కీలకంగా మారింది.

అభ్యంతరాలకు మరికొద్ది రోజులే

ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, అర్హత ఉన్న వారు తమ వివరాలను సరిచూసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత సవరించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు దావాలు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. నోటీసుల పరిశీలన, దావాలు--అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ నవంబర్ 5 వరకు కొనసాగనుంది. అనంతరం నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నారు.

పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలి

ఎస్ఐఆర్ ప్రక్రియలో తమ పేరు ముసాయిదా జాబితాలో ఉందో లేదో ప్రతి ఓటరూ పరిశీలించుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. పేరు లేకపోతే, అర్హత కలిగిన వారు నిర్ణీత విధానంలో దావా చేసుకునే అవకాశం ఉంది. గతంలోనూ ఎన్నికల అధికారులు ముసాయిదా జాబితాలో పేరు కనిపించని అర్హులైన ఓటర్లు ఫారం-6 ద్వారా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

తొలగింపులపై చర్చ.. పారదర్శకతపై దృష్టి

ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్లకు నోటీసులు జారీ కావడంతో రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కొన్ని పార్టీలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. మరోవైపు ఓటరు జాబితాను శుద్ధి చేయడం, మృతులు, వలస వెళ్లిన వారు, నకిలీ లేదా పునరావృత నమోదులను గుర్తించడం ప్రక్రియ లక్ష్యమని ఎన్నికల యంత్రాంగం చెబుతోంది.

తుది జాబితాపైనే అందరి దృష్టి

ఇక ఎస్ఐఆర్ చివరి దశలో అధికారులు ప్రతి దరఖాస్తు, అభ్యంతరం, నోటీసుకు వచ్చిన సమాధానాన్ని పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఒకవైపు అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు ఉండేలా చూడటం, మరోవైపు అనర్హమైన నమోదులను తొలగించడం మధ్య సమతుల్యత పాటించడం ఎన్నికల యంత్రాంగానికి కీలకంగా మారింది. నవంబర్ 9న వెలువడనున్న తుది ఓటరు జాబితాతో ఎస్ఐఆర్ ప్రక్రియకు తుది రూపు రానుంది

పాడి రైతులకు మరింత ఊతం..

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న ఈ ప్లాంట్‌లో ప్రారంభ దశలో రోజుకు 5 లక్షల లీటర్ల పాలను ప్రాసెస్ చేసే సామర్థ్యం ఉంటుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా సుమారు 350 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, పాల సేకరణతో పాటు డెయిరీ అనుబంధ విలువ గొలుసు ద్వారా దాదాపు 10 వేల మంది పాడి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మంత్రి వివరించారు. సాబర్ డెయిరీ 2015లో తెలంగాణలో పాల కార్యకలాపాలను ప్రారంభించిందని, ప్రస్తుతం రాష్ట్రంలోని పాడి రైతుల నుంచి రోజుకు లక్ష లీటర్లకు పైగా పాలను సేకరిస్తోందని తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా పాలు, పెరుగు, పనీర్, ఐస్‌క్రీమ్, లస్సీ, నెయ్యి, మజ్జిగతో పాటు బేకరీ ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు చెప్పారు.

దీంతో రైతులు ఉత్పత్తి చేసే పాలకు మరింత విలువ జోడించి, వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో పాడి రైతులు, పాల ఉత్పత్తి చేసే కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. రైతులు, వ్యవస్థీకృత పాల సేకరణ, ఆధునిక ప్రాసెసింగ్ వ్యవస్థ, వినియోగదారుల మధ్య అనుసంధానాన్ని ఈ ప్రాజెక్టు మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు.

‘ఇన్వెస్ట్ తెలంగాణ’, ‘తెలంగాణ రైజింగ్-2047’ లక్ష్యాల నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడిదారుల విశ్వాసం పెరుగుతోందనడానికి ఈ ప్రాజెక్టు నిదర్శనమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సహకార డెయిరీ విధానంలో వినియోగదారుడు చెల్లించే మొత్తంలో గణనీయమైన వాటా పాల ఉత్పత్తిదారుడికి చేరుతుందని తెలిపారు. అమూల్ రైతు కేంద్రిత విధానంలో వినియోగదారుడు ఖర్చు చేసే ప్రతి రూపాయిలో సుమారు 80 శాతం వరకు పాల ఉత్పత్తిదారులకు చేరుతుందని చెప్పారు. ఈ విధానం రైతుల ఆదాయాన్ని, మొత్తం డెయిరీ రంగాన్ని మరింత బలోపేతం చేయగలదని అన్నారు.

ముఖ్యంగా పనీర్ వంటి నాణ్యమైన డెయిరీ ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులోకి రావడం ప్రయోజనకరమని మంత్రి తెలిపారు. నాన్-డెయిరీ పనీర్‌కు సంబంధించి ఆందోళనలు ఉన్న నేపథ్యంలో, విశ్వసనీయమైన సహకార సంస్థ నుంచి నాణ్యమైన అసలైన డెయిరీ ఉత్పత్తులు అందుబాటులోకి రావడం వినియోగదారుల నమ్మకాన్ని పెంచుతుందని అన్నారు.

ఈ ప్రాజెక్టు కేవలం పాల ప్రాసెసింగ్ ప్లాంట్ మాత్రమే కాదని, పాలు సేకరణ నుంచి రవాణా, ప్రాసెసింగ్, శీతల సరఫరా వ్యవస్థ, ప్యాకేజింగ్, పంపిణీ, చిల్లర విక్రయాలు, అనుబంధ సేవల వరకు పూర్తి స్థాయి డెయిరీ వ్యవస్థను అభివృద్ధి చేసే అవకాశం ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు.

‘సహకార్ సే సమృద్ధి’, ‘వైట్ రివల్యూషన్ 2.0’లో భాగంగా డెయిరీ సహకార వ్యవస్థలను బలోపేతం చేయడం, రైతులకు మార్కెట్ అవకాశాలను విస్తరించడం, పాల ఉత్పత్తిదారులకు మరిన్ని అవకాశాలు కల్పించడం కీలకమని చెప్పారు. వ్యవసాయం, ఆహార శుద్ధి, గ్రామీణ ఉపాధి, రైతు ఆధారిత విలువ గొలుసులను బలోపేతం చేసే పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం నిరంతరం సహకరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

తెలంగాణను ఈ విస్తరణకు వేదికగా ఎంచుకున్న సాబర్ డెయిరీ, అమూల్ సంస్థలకు శ్రీధర్‌బాబు అభినందనలు తెలిపారు. పాడి రైతుల అభివృద్ధి, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తుల అందుబాటు, ఆహార శుద్ధి రంగ పెట్టుబడులకు తెలంగాణను మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్

జ్ఞానేశ్వర్‌ను వెంటనే తొలగించాలి

- అక్టోబర్ 6న జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ముందు ధర్నాలు
- అక్టోబర్ 8న 'చలో రాజ్‌భవన్'.. నవంబర్ 1న 'చలో ఢిల్లీ'

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 4: ఓటర్ల జాబితాలో అవకతవకలు, ఎన్నికల కమిషన్ వ్యవహార శైలిని నిరసిస్తూ రాష్ట్రంలోని తొమ్మిది కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్, టీడీపీ, ఎన్సీపీ, ఆర్‌జేడీ తదితర పార్టీలు సంయుక్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. శనివారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీడీపీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎన్‌సీపీ(శరద్ పవార్), ఎన్‌సీపీ(ఎంపీ), ఆర్‌జేడీ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఆర్‌ఎస్‌పీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జేడీ తదితర పార్టీల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాజ్యాంగ స్ఫూర్తికి అత్యంత కీలకమైన ఓటు హక్కును నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని నాయకులు ఆరోపించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ వ్యవహారశైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లను అన్యాయంగా తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం ఎస్ఐఆర్ ప్రక్రియలో ముందు 3 కోట్ల 28 లక్షల ఓట్లు ఉండగా, 73 లక్షల ఓట్లు తొలగించారని తెలిపారు. డ్రాఫ్ట్‌లో 2 కోట్ల 68 లక్షల ఓట్లు మాత్రమే ఉన్నాయని, అందులో 93 లక్షల ఓట్లను అనుమానాస్పదంగా భావిస్తూ నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 3 కోట్ల 28 లక్షల ఓట్లలో 1 కోటి 66 లక్షల ఓట్లు తొలగించడానికి ఎన్నికల కమిషన్ సిద్ధమైందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నిబంధనలను తుంగలో తొక్కి, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అన్యాయంగా తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చాలని కోరారు. ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరు నమోదు చేసుకోవడంతోపాటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితా కేంద్రాలకు ప్రత్యేక అధికారులను నియమించి, ప్రతి ఒక్కరి ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు సహకరించకుండా ఓటు హక్కును పరిరక్షించేందుకు పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఫారం-7 ద్వారా ఓట్ల తొలగింపును అడ్డుకోవడంతో పాటు ఓటర్లలో అవగాహన కల్పించాలని కోరారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను అక్టోబర్ 6న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, అక్టోబర్ 8న 'చలో రాజ్‌భవన్', నవంబర్ 1న 'చలో ఢిల్లీ' కార్యక్రమాలకు సంయుక్తంగా పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు జరుగుతున్న ఈ పోరాటంలో రాజకీయ పార్టీలు, కార్యకర్తలు, ప్రజలు, కార్మికులు, లోకతంత్ర శక్తులు, మహిళలు, మేధావులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

చార్మినార్ వద్ద "నషా ముక్త్ యువ" వాక్‌థాన్

- మై భారత్, తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్, వెలుతురు 04 అక్టోబర్ 2026: యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన మరియు మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్ తెలంగాణ, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సహకారంతో ఆదివారం రోజున నషా ముక్త్ యువ" వాక్‌థాన్ నిర్వహించింది. హైదరాబాద్‌లోని చారిత్రక చార్మినార్ వద్ద ప్రారంభమైన ఈ వాక్‌థాన్ ప్రభుత్వ సిటీ కాలేజ్, హైదరాబాద్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని గౌరవ రాజ్యసభ సభ్యులు కె. లక్ష్మణ్ జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభ ప్రసంగంలో మై భారత్ రాష్ట్ర డైరెక్టర్ అన్వేష్ చింతల యువత మాదకద్రవ్యాలకు మరియు అన్ని రకాల మత్తు పదార్థాల దుర్వినియోగానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని, సానుకూల అలవాట్లను అలవర్చుకుని, ఆరోగ్యకర మైన, బాధ్యతాయుతమైన మరియు నషా ముక్త్ భారత్ నిర్మాణంలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), హైదరాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ విశాల్ వి. ఆర్. మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని నిరోధించ డంలో యువతలో అవగాహన మరియు సమిష్టి చర్యల ప్రాధాన్యతను వివరించారు. యువత ఆరోగ్యకరమైన మరియు బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న యువతను ఉద్దేశించి రాజ్యసభ సభ్యులు కె. లక్ష్మణ్ నషా ముక్త్ భారత్ నిర్మాణం యొక్క ప్రాధాన్యతను వివరించారు. యువత మాదకద్రవ్యాలు మరియు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిస్తూ, ఆరోగ్యకరమైన మరియు మాదకద్రవ్య రహిత యువతే 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కీలకమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం వ్యక్తుల శారీరక మరియు మానసిక ఆరోగ్యంపై మాత్రమే కాకుండా, కుటుంబాలు, సమాజం మరియు దేశంపై కూడా విస్తృత ప్రభావాన్ని చూపుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ వాక్‌థాన్‌లో యువత ఉత్సాహంగా పాల్గొని, మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక బాధ్యత మరియు చైతన్యానికి బలమైన సందేశాన్ని అందించారు. వాక్‌థాన్ ప్రభుత్వ సిటీ కాలేజ్, హైదరాబాద్ వద్ద ముగిసింది. అనంతరం జాతీయ గీతం "జనగణమన ఆలపించడంతో కార్యక్రమం ముగిసింది. ఆరోగ్యకరమైన, బలమైన మరియు నషా ముక్త్ భారత్ నిర్మాణానికి తమ సమిష్టి నిబద్ధతను పాల్గొన్న యువత పునరుద్ఘాటించారు. యువతను చైతన్యపరచడం, సమాజ ఆధారిత కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన మరియు మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి మై భారత్, తెలంగాణ తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఈ కార్యక్రమంలో మై భారత్ అసిస్టెంట్ డైరెక్టర్ జి. రాజేష్, ఎన్ఎస్ఎస్ నరసింహ; ఈూా శ్రీనివాస్, ఆర్. శశాంక్, ఘూా ఈ. యాదగిరి; మరియు ఎం. సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు పిఎల్ఆర్ బోనస్ రూ.1,10,250పై ఒప్పందం

- సుదీర్ఘంగా చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం
- దీపావళి పండుగ సందర్భంగా బోనస్

కోల్కత్తా, వెలుతురు, అక్టోబర్ 04 : కోల్కత్తాలో జరిగిన కోల్ ఇండియా అపెక్స్ జాయింట్ కన్సల్టివ్ కమిటీ సమావేశంలో కోల్ ఇండియా యాజమాన్యం, సింగరేణి యాజమాన్య ప్రతినిధులు, కేంద్ర కార్మిక సంఘాల జాతీయ నాయకులు పాల్గొని పిఎల్ ఆర్ (పెర్ఫార్మన్స్ లింక్డ్ రివార్డ్) బోనస్ పై సుదీర్ఘంగా చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో భారతీయ మజ్దూర్ సంఘ్ (బి ఎం ఎస్) జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి కార్మికుల తరఫున చర్చల్లో పాల్గొని, కార్మికులకు న్యాయమైన బోనస్ అందించాల్సిన అవసరాన్ని బలంగా ప్రస్తావించారు. చర్చల అనంతరం 2026 సంవత్సరానికి కోల్ ఇండియా, సింగరేణి కార్మికులకు రూ. 1,10,250/- పి ఎల్ ఆర్ బోనస్ చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. ఈ బోనస్‌ను దసరా పండుగ సందర్భంగా కోల్ ఇండియా కార్మికులకు చెల్లించాలని నిర్ణయించారు. దీంతో దసరా పండుగ సందర్భంగా కోల్ ఇండియా కార్మికులకు బోనస్ అందనుందని తెలిపినారు. సింగరేణిలో బోనస్‌ను దీపావళి పండుగ సందర్భంగా చెల్లించే సంప్రదాయం కొనసాగుతోందని తెలిపారు.

జంతర్ మంతర్ కన్నా పెద్ద నిరసన చేస్తాం

- ఫారమ్-7 దుర్వినియోగం చేస్తున్నారని ఓవైసీ ఆరోపణ
- బీజేపీ, సంఘ్ పరివార్‌పై అసదుద్దీన్ ఓవైసీ వ్యాఖ్యలు
- ఎన్నికల సంఘం వెంటనే చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 04 : ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడానికి ఫారమ్-7 దరఖాస్తుల్ని దుర్వినియోగం చేస్తున్నారని ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. బీజేపీ, సంఘ్ పరివార్‌కు చెందిన వారు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. దీనిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్రింట్ చేసిన ఫారమ్-7 దరఖాస్తుల్లో తొలగించాల్సిన పేర్లు, ఓటర్ల వివరాలు ఉంటున్నాయని అన్నారు. ఇది నిజంగా జరుగుతున్నట్లైతే పూర్తిగా తప్పని, ఈ విషయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారులకు సైతం ఈ అంశం పై సమాచారం ఇస్తున్నామని ఓవైసీ తెలిపారు. తప్పుడు ఫారమ్-7 దరఖా స్తుల్ని అప్లై చేస్తున్నట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ వ్యవహారం ఇలాగే కొనసాగితే ఢిల్లీలో జంతర్ మంతర్‌లో జరిగిన నిరసన కన్నా పెద్ద ఎత్తున హైదరాబాద్ రోడ్లు, వీధుల్లో ఆందోళన జరుగుతాయని, మీకు చాలా ఇబ్బంది కలిగే పరిస్థితి వస్తుందని, మజ్లిస్ మౌనంగా ఉండదని ఓవైసీ హెచ్చరించారు. యూపీ అసెంబ్లీ ఎన్నికల గురించి మాట్లాడుతూ.. తాము ఇతర పార్టీలతో చేతులు కలిపేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. యూపీలో బీజేపీ మూడోసారి అధికారంలోక రావడం తమకు ఇష్టం లేదని, దీనిని నివారించేందుకు తాము పొత్తుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. గతంలో బీహార్‌లో మా నలుగురు ఎమ్మెల్యేలను ఆర్జేడీ కలుపుకుందని, మేము ఇటీవల ఎన్నికల్లో ఆరు సీట్లు మాత్రమే అడిగామని చెప్పారు. మళ్లీ పోటీ చేస్తే ప్రజలకు మమ్మల్ని 5 సీట్లలో గెలిపించారని ఓవైసీ చెప్పారు. శివసేన చీలిపోయినప్పుడు దానిని ప్రజాస్వామ్య హత్యగా చెప్పినవారు, మా ఎమ్మెల్యేలను తీసుకున్నప్పుడు ఎందుకు మాట్లాడ లేదని ప్రశ్నించారు.

నేడు నిర్మల్ జిల్లాలో

మంత్రుల పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. కలెక్టరేట్‌లో సమీక్ష
- ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుంది నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, వెలుతురు, అక్టోబర్ 04: నిర్మల్ జిల్లాలో నేడు రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అధికారులు హాజరుకానున్నట్లు వివరించారు. మంత్రుల పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మంత్రుల పర్యటన ఉన్నప్పటికీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని ప్రత్యేక విభాగంలో ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

సింగీతం శ్రీనివాసరావు మృతి పట్ల మంత్రి పొన్నం సంతాపం

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 04: ప్రముఖ సినీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భారతీయ సినీ రంగానికి సింగీతం శ్రీనివాసరావు అందించిన సేవలు చిరస్మరణీయమని మంత్రి పేర్కొన్నారు. తనదైన సృజనాత్మకత, విభిన్నమైన కథాంశాలు, అద్భుతమైన దర్శకత్వ ప్రతిభతో తెలుగు సినిమాతో పాటు భారతీయ సినీ పరిశ్రమకు ఆయన విశేష సేవలు అందించారని కొనియాడారు. సింగీతం శ్రీనివాసరావు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆయన దర్శకత్వ ప్రతిభ, సినీ రంగానికి అందించిన విశిష్ట సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. సింగీతం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

ఓబీసీ కులగణన చేయకపోతే...

లక్షలాది మందితో దేశ రాజధాని ఢిల్లీని దిగ్బంధిస్తాం

- దేశవ్యాప్తంగా ఓబీసీ సంఘాలను ఐక్యం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 04 : జనగణనలో ఓబీసీ కులగణనను చేపట్టకపోతే దేశ రాజధాని ఢిల్లీని దిగ్బంధించే స్థాయిలో దేశవ్యాప్తంగా భారీ ఉద్యమాన్ని చేపడతామని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలోని కస్తూర్బా ఆడిటోరియంలో జాతి జనగణన సంఘర్ష్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ జాతీయ సదస్సుకు మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ గారు, ఇండియన్ నేషనల్ లీగ్ అధ్యక్షులు ప్రొఫెసర్ మహమ్మద్ సులేమాన్, మాజీ ఎంపీ ప్రొఫెసర్ డా. రామ్ బక్ష్ సింగ్ వర్మ, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సూరజ్ యాదవ్ మండల్, డాక్టర్ ఈశ్వర్ ధ్యాన్, ఉమేష్ కోర్రం మరియు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జనగణనలో ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ ను కేటాయించి ఓబీసీ కులగణన నిర్వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీ సంఘాలు, నాయకులను ఐక్యం చేసి ఒకే తాటిపైకి తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకునిరావాలని అన్నారు. ప్రతి రాష్ట్రంలో పర్యటిస్తూ ఓబీసీ సంఘాలను సంఘటితం చేసి దశలవారీగా ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించాలని, చివరకు లక్షలాది మందితో దేశ రాజధాని ఢిల్లీని దిగ్బంధించే స్థాయిలో ఉద్యమాన్ని చేపట్టాలని సదస్సులో తీర్మానం చేయడం జరిగింది. ఇప్పుడు సాధించుకోకపోతే మళ్లీ అవకాశం రాదు. ఓబీసీ కులగణనను కచ్చితంగా సాధించుకుని తీరాలి అని అన్నారు. జనగణనలో ఓబీసీల జనాభాకు సంబంధించిన కచ్చితమైన గణాంకాలు లేకపోవడం వల్ల బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలు కోర్టుల్లో నిలబడటం లేదని అన్నారు. దేశంలో సుమారు 80 కోట్ల జనాభా ఉన్న ఓబీసీలకు విద్య, ఉద్యోగాలు, ఉద్యోగాల్లో ప్రమోషన్లు, చట్టసభల్లో తగిన రిజర్వేషన్లు కల్పించినప్పుడే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని అన్నారు. ఓబీసీల రిజర్వేషన్ల సాధనకు మద్దతు ఇచ్చే రాజకీయ పార్టీలకు బీసీల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా అన్ని ఓబీసీ సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, ఓబీసీ కులగణన, రిజర్వేషన్లు ఇవ్వాలని లక్షలాది మందితో ఢిల్లీని దిగ్బందిస్తామని మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌కు 2,000కుపైగా ఎంట్రీలు

హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 04: తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ -- సీజన్ 2కు విశేష స్పందన లభించింది. ఎంట్రీల సమర్పణకు విధించిన గడువు అక్టోబర్ 2తో ముగియగా.. ఫిలిం మేకర్స్, ఇన్‌ఫ్లుయె న్సర్లు, కంటెంట్ క్రియేటర్ల నుంచి 2,000కుపైగా ఎంట్రీలు వచ్చాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో ఎంట్రీలు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు నేతృత్వంలోని యంగ్ ఫిలిం మేకర్స్ బృందాన్ని దిల్ రాజు అభినందించారు. తెలంగాణలోని యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకు బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. యువ ఫిలిం మేకర్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావడం ఈ కార్యక్రమానికి లభించిన ఆదరణకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం అందిన ఎంట్రీలను తదుపరి దశలో పరిశీలించి, నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్టింగ్, జ్యూరీ ప్రక్రియను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పది లక్షల విశ్వకర్మలకు

రాజకీయ ప్రాతినిధ్యం కరువు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 04 : రాష్ట్రంలో పది లక్షలకు పైగా జనాభా కలిగిన విశ్వకర్మ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం అన్యాయమని విశ్వకర్మ జేఏసీ చైర్మన్ దేవరకొండ కాళిదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సంప్రదాయ వృత్తుల ఆధారంగా విశ్వకర్మలను విభజించి చూపడం వల్ల వారి వాస్తవ జనాభా తక్కువగా కనిపిస్తోందని అన్నారు. బీసీ కోటాలో గవర్నర్ కోటా కింద విశ్వకర్మలకు ఎమ్మెల్సీ పదవి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విశ్వకర్మ జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విశ్వకర్మలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ రాజకీయంగా తగిన గుర్తింపు లభించడం లేదని కాళిదాసు పేర్కొన్నారు. కులవృత్తుల ఆధారంగా విశ్వకర్మలను వేర్వేరు వర్గాలుగా పరిగణించడం వల్ల సమష్టి జనాభా, సామాజిక బలం తెరమరుగవుతున్నాయని అన్నారు. విశ్వకర్మలందరినీ ఒకే సామాజిక సమూహంగా గుర్తించి వారి జనాభా, సమస్యలు, హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పది లక్షలకు పైగా జనాభా ఉన్న సామాజిక వర్గానికి చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆలోచించాల్సిన అంశమని పేర్కొన్నారు. జనాభా ఉన్నప్పటికీ రాజకీయ నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించకపోతే ఆ వర్గ సమస్యలు ప్రభుత్వాల దృష్టికి ఎలా వస్తాయని ప్రశ్నించారు. బీసీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల్లో విశ్వకర్మలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ముఖ్యంగా గవర్నర్ కోటా కింద బీసీ సామాజిక వర్గానికి కేటాయించే ఎమ్మెల్సీ పదవుల్లో విశ్వకర్మలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశ్వకర్మల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం జేఏసీ ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని కాళిదాస్ పిలుపునిచ్చారు. వృత్తుల ఆధారంగా విడిపోయిన వారంతా సంఘటితమై తమ హక్కుల సాధనకు ముందుకు రావాలని సూచించారు. అందులో భాగంగా నవంబర్ 14న జేఏసీ ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించారు. ఎన్నికల్లో విశ్వకర్మ కులానికి చెందిన ఐటీ, డాక్టర్స్, జర్నలిస్ట్, వివిధ రంగాల పెద్దలు, అధికారులను భాగస్వామ్యం చేస్తామని ఆయన పేర్కొన్నారు. విశ్వకర్మలకు రాజకీయ ప్రాతినిధ్యం, బీసీ కోటాలో సముచిత వాటా సంప్రదాయ వృత్తుల పరిరక్షణ తదితర అంశాలపై తమ అభిప్రాయాలను పలువురు వెల్లడించారు. విశ్వకర్మల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఐక్యంగా కృషి చేయాలని సమావేశం పిలుపునిచ్చింది.

దేశానికే ఆదర్శంగా నిలిచేలా కులగణన

బహిరంగ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 04 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచేలా కులగణన నిర్వహించింది. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వామ్యం చేసి సమగ్రంగా కులగణన నిర్వహించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. బీహార్‌తో పాటు తెలంగాణ కూడా కులగణన నిర్వహించిన రాష్ట్రంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. కులగణన కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం కాదు.. దేశంలోని బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల హక్కులకు సంబంధించిన అంశం. దేశవ్యాప్తంగా కులగణన జరగాలి.. ఇదే మా ప్రధాన డిమాండ్. గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు కులగణన కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి. సమావేశాలు, ప్రజా సభలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్రెస్ కాన్ఫరెన్సుల ద్వారా కులగణన ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అన్ని బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలు ఐక్యంగా నిలబడి సామాజిక న్యాయం కోసం పోరాడాలి. తెలంగాణ ఉద్యమం, స్వాతంత్ర్య పోరాటం, నిజాం వ్యతిరేక పోరాటాల్లో ప్రజల ఐక్యతే విజయానికి కారణమైంది. అదే స్ఫూర్తితో ఇప్పుడు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఐక్యంగా పోరాడాలి. అనేక వెనుకబడిన వర్గాలకు ఇప్పటికీ తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కడం లేదు. గ్రామపంచాయతీ స్థాయి నుంచి శాసనసభ, పార్లమెంట్ వరకు అన్ని స్థాయిల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి. తెలంగాణలో కులగణన ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభ తీర్మానం చేసింది. కేబినెట్ నిర్ణయం తీసుకుని ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా ఉన్న 50 శాతం రిజర్వేషన్ పరిమితి వంటి అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్ల విషయంలో ప్రామాణికమైన గణాంకాలు అత్యంత కీలకం. ప్రామాణికమైన గణాంకాల కోసం దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించాలి. ప్రతి సామాజిక వర్గం జనాభా, సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు రావాలి. కులగణన ఆధారంగా సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం నిర్ణయించే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన అధికారాలను వినియోగించి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలి. తెలంగాణ శాసనసభలో చేసిన తీర్మానాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలి. గ్రామసభల్లో కులగణనకు అనుకూలంగా తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఒత్తిడి తీసుకురావాలి. కులగణన కోసం రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో జరుగుతున్న పోరాటానికి తెలంగాణ సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కులగణన సామాజిక న్యాయానికి పునాది. అన్ని వర్గాలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు, సముచిత ప్రాతినిధ్యం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.

అలుపెరుగని కమ్యూనిస్టు పోరాట యోధుడు

మృత్యుం జయుడు

అక్టోబర్ 5 మృత్యుంజయుని జయంతి

యజుర్వేద శాఖీయులు అయిన పేరేప వంశజులు శ్రీకాకుళానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోని పేరేప గ్రామ పరిసరాలలో పురోహితులుగా కాక, దేవాలయ ప్రతిష్ఠలు, కళ్యాణాలు చేయించే వేద పండితులుగా పేరెన్నికగన్నారు. అలాంటి సనాతన వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, పక్కా కమ్యూనిస్టుగా పేరొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పేరేప మృత్యుంజయుడు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ త్యాగమూర్తి జయంతి సందర్భంగా, లభ్యం అవుతున్న సమాచారం ఆధారంగా గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం.

పేరేప మృత్యుంజయుడు (అక్టోబర్ 5, 1914 – మే 16, 1950) భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో పేరేప వెంకట సుబ్బయ్య, మహా లక్ష్మిలకు 1914, అక్టోబర్ 5 న జన్మించారు. ఆచంటలో మాధ్యమిక పాఠశాల చదువయ్యాక ధవళేశ్వరం వెళ్లి మేనమామ మొక్కపాటి శేషయ్య ఇంట్లో ఉంటూ రాజమండ్రి ప్రభుత్వ మోడల్ సెకండరీ స్కూలులో చదివి, చదువయ్యాక (1933- 34లో) పి.డబ్ల్యు.డిలో రోజు కూలికి మేస్త్రీగా పని చేశారు. 1925 ప్రాంతంలో భానుమతి (1917)ని వివాహ మాడారు. 1936 లో నెక్కంటి నరసింహారావు, మీరా లతో పాటు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. బస్సు డ్రైవరుగా పనిచేస్తున్న మీరాతో పాటు బస్సు కార్మికులను సంఘటిత పరచే కార్యక్రమం చేపట్టారు. 1941-42 ప్రాంతంలో యంవియన్ కపర్దిని కూడా మోటారు కార్మిక సంఘ నిర్మాణంలో పాల్గొనేందుకు ప్రోత్సహించారు. 1937-39 కాలంలో కాళీపట్నం రైతుల పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి సత్య నారాయణ రాజు, ఉద్దరాజు రామం లతో కలిశారు. 1940-42 కాలంలో చినమల్లం గ్రామం వద్ద 60- 70 మంది పార్టీ కార్యకర్తలకు మృత్యుం జయుడు ప్రిన్సిపాలుగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో సైద్ధాంతిక శిక్షణతో బాటు, ఇందుకూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో కొంత మిలటరీ శిక్షణ కూడా యిచ్చారు. మృత్యుం జయుడు...వ్యవసాయ కూలీలతో ఆచంట నుంచి నరసాపురం తహశీల్దారు కార్యాలయానికి 1940లో ఆకలి యాత్ర నిర్వహించారు. 1940-42 మధ్య కొంత కాలం ఆయన జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఏలూరులో జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచి వారు ఆయనను అరెస్టు చేసి, స్థానిక జిల్లా సబ్ జైలులో 15 రోజులు రిమాండులో వుంచారు. 1944 – 45లో జైలు నుంచి విడుదల అయినాక పాలకొల్లులో కాపురం పెట్టారు. నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా వుంటూ, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా ఉన్నారు. అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామ మూర్తి, చలం మొదలగు కళాకారులను ప్రజానాట్య మండలిలోకి తెచ్చింది మృత్యుంజయుడే. నెక్కల పూడి సుబ్బాయమ్మ గారితో కలిసి అన్నా చెల్లెలు పాట (బెంగాలులో కరువు) వేదికల మీద పాడే వారు. చావుకు వెరవకురా అన్న పాట తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ తదితరులు చెపుతుండే వారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య లతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పోరాటానికి సహాయం కూడ గట్టడానికి పి.సి.జోషి, పుచ్చలపల్లి సుందరయ్యలు వచ్చి ఆయనతో చర్చలు జరిపారు. మృత్యుంజయుడు నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా వున్నారు. రెండవ ప్రపంచ యుద్ధపు చివరి రోజుల్లో బెంగాల్ లో భీకరమైన కరువు, తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల కటకట, దొంగ నిల్వలు, దొంగ రవాణా నివారణకు కృషి చేస్తూ, ఆకలి యాత్రలు నిర్వహించారు. బెంగాలు కరువు, తెలంగాణ పోరాటం గురించి అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, చలం మొదలగు కళాకారులతో కలిసి, ప్రజానాట్య మండలి ప్రదర్శనలు ఇచ్చేవారు.

రామ కిష్టయ్య సంగన భట్ల;
సీనియర్ జర్నలిస్ట్... 9440595494

దళిత సంక్షేమానికి ద్రోహం కాకూడదు..!

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ఎన్ని రోజులు అధికారంలో ఉందన్నది చరిత్రలో ఒక సంఖ్య మాత్రమే. ఆ ప్రభుత్వం ఇచ్చిన మాటలను ఎంతవరకు నిలబెట్టుకుంది? అట్టడుగు వర్గాల జీవితాల్లో ఎంతటి మార్పు తీసుకొచ్చింది? పేద కుటుంబానికి ఆర్థిక భరోసా, విద్యార్థికి చదువు, యువతకు ఉపాధి, నిరుపేదకు ఇల్లు, భూమిలేనివారికి భూమి, అన్యాయానికి గురైనవారికి న్యాయం ఎంతవరకు అందింది? అన్నదే పాలనకు అసలు కొలమానం. ముఖ్యంగా దళిత సమాజం విషయంలో ప్రభుత్వాల చిత్తశుద్ధి మాటల్లో కాదు.. అమలులో కనిపించాలి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో దళిత, గిరిజన, బలహీన వర్గాల్లో ఎన్నో ఆశలు చిగురించాయి. ఎన్నికల ముందు ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ ద్వారా విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత, భూమి, గృహం, సంక్షేమం వంటి అంశాల్లో స్పష్టమైన హామీలు ఇచ్చారు. ఆ హామీలు అప్పట్లో కేవలం ఎన్నికల ప్రకటనలు కావు, సామాజికంగా వెనుకబడిన కుటుంబాలకు అవి భవిష్యత్తుపై పెట్టుకున్న ఆశలు. అందుకే అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటిని అమలు చేయాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేదు.

-మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

ప్రభుత్వాలు మారడం సహజం. కానీ పేదల అవసరాలు, వారి ఆశలు, వారి హక్కులు ప్రభుత్వాలతో పాటు మారకూడదు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకంలో లోపాలుంటే వాటిని సరిదిద్దాలి. అవకతవకలుంటే విచారణ జరపాలి. లబ్ధిదారుల ఎంపికలో తప్పులుంటే పునఃపరిశీలించాలి. కానీ ఒక పథకాన్ని నిలిపివేసి, దానికి సమర్థవంతమైన ప్రత్యామ్నాయం చూపకపోతే రాజకీయంగా నష్టపోయేది ఏ పార్టీ కాదు.. నష్టపోయేది పేద కుటుంబమే. దళితబంధు విషయంలో ఇదే ప్రశ్న ముందుకొస్తోంది. పథకం అమలులో లోపాలుంటే వాటిపై సమీక్ష అవసరమే. కానీ అర్హులైన కుటుంబాలకు అందాల్సిన ఆర్థిక సహాయం నిలిచిపోవడం మాత్రం సమర్థనీయం కాదు. తొలి విడతలో ఎంపికైన కుటుంబాలకు నిధుల విడుదలలో జాప్యం జరిగిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వాస్తవ పరిస్థితిని ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలి. ఎన్నికల సమయంలో దళితబంధు సాయాన్ని పెంచి కొత్త పథకం ద్వారా మరింత ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీల అమలు స్థితి ఏమిటో కూడా ప్రభుత్వం చెప్పాలి. పాత పథకం నిలిచిపోవడం, కొత్త పథకం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడం మధ్య చిక్కుకుపోయేది దళిత కుటుంబమే. దళిత సాధికారతకు విద్య అత్యంత శక్తివంతమైన మార్గం. ఒక దళిత విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం అంటే కేవలం ఒక బిల్లు చెల్లించడం కాదు, అతని విద్యాభవిష్యత్తుకు ప్రభుత్వం అండగా నిలవడం. విదేశీ విద్యకు ఎంపికైన విద్యార్థికి స్కాలర్‌షిప్ సమయానికి అందకపోతే, ప్రతిభ ఉన్నప్పటికీ అవకాశం కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యా పథకాలకు సంబంధించిన బకాయిలపై ప్రభుత్వం పారదర్శకంగా అధికారిక వివరాలు వెల్లడించాలి. బడ్జెట్‌లో నిధులు కేటాయించడం ఒక దశ మాత్రమే. ఆ నిధులు విడుదల కావాలి. సంబంధిత శాఖలకు చేరాలి. విద్యార్థి లేదా లబ్ధిదారుని ఖాతాలోకి వెళ్లాలి. అప్పుడే అది సంక్షేమం అవుతుంది. లేకపోతే బడ్జెట్ పుస్తకాల్లో కనిపించే కోట్ల రూపాయలు పేదల జీవితాల్లో మాత్రం కనిపించని సంఖ్యలుగానే మిగిలిపోతాయి. ఎస్సీ సబ్‌ప్లాన్ విషయంలోనూ ఇదే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కేటాయింపులు ఎంత చేశామన్న ప్రచారం కంటే ఎంత ఖర్చు చేశాం, ఎక్కడ ఖర్చు చేశాం, ఎవరికి ప్రయోజనం కలిగింది అన్నది ముఖ్యం. పాఠశాలలు, హాస్టళ్లు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి, భూమి, గృహ నిర్మాణం వంటి రంగాల్లో సబ్‌ప్లాన్ నిధుల ప్రభావం స్పష్టంగా కనిపించాలి. కేటాయింపు--విడుదల--వ్యయం అనే మూడు దశలపై పూర్తి పారదర్శకత ఉండాలి. శాఖల వారీగా వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది. ఆర్థిక సాధికారత విషయంలోనూ కేవలం యూనిట్ల సంఖ్యను ప్రకటించడం సరిపోదు. ఒక కుటుంబానికి వ్యాపార యూనిట్ మంజూరు చేసిన తర్వాత శిక్షణ, బ్యాంకు రుణం, సబ్సిడీ, మౌలిక సదుపాయాలు, మార్కెట్ అనుసంధానం కల్పించాలి. అప్పుడే స్వయం ఉపాధి నిలదొక్కుకుంటుంది. లక్ష్యాలు ప్రకటించి, వాటి అమలు మధ్యలో నిలిపివేస్తే పథకం గణాంకంగా మిగిలిపోతుంది, కుటుంబానికి మాత్రం ఉపాధి అందదు. ఇల్లు, భూమి విషయంలోనూ హామీలను కార్యాచరణగా మార్చాలి. ఇంటి స్థలం లేని కుటుంబానికి కేవలం నిర్మాణ సాయం ప్రకటించడం వల్ల సమస్య పరిష్కారం కాదు. భూమి గుర్తింపు, పట్టా, నిర్మాణ సాయం, నిధుల విడుదల, నిర్మాణ పర్యవేక్షణ--ఇవన్నీ సమగ్రంగా సాగాలి. పేద కుటుంబానికి ఇల్లు అంటే నాలుగు గోడలు మాత్రమే కాదు, అది భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై నమ్మకం. సామాజిక న్యాయం అంటే కేవలం సంక్షేమ పథకాలు కాదు. దళితులపై దాడులు, అత్యాచారాలు జరిగినప్పుడు సత్వర న్యాయం అందించడం కూడా ప్రభుత్వ బాధ్యత. కేసు నమోదు చేసి ఫైల్ మూసివేయడం న్యాయం కాదు. దర్యాప్తు, ఛార్జ్‌షీట్, విచారణ, న్యాయ సహాయం, బాధితుల రక్షణ, పరిహారం---ప్రతి దశలో జాప్యం లేకుండా వ్యవస్థ పనిచేయాలి. అట్రాసిటీ బాధితుడికి పరిహారం అందించడం ప్రభుత్వ దయ కాదు, చట్టబద్ధమైన బాధ్యత. స్థానిక ఒత్తిళ్లు, రాజకీయ పలుకుబడి, రాజీ పేరుతో బాధితుడి హక్కులను పక్కనపెట్టకూడదు. పథకాలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో పరిశీలించే వ్యవస్థ కూడా బలంగా ఉండాలి. సంక్షేమ శాఖలో కీలక పోస్టులు ఖాళీగా ఉంటే, గురుకులాల్లో అవసరమైన సిబ్బంది లేకపోతే, ఇన్‌ఛార్జ్ అధికారులతోనే వ్యవస్థను నడిపిస్తే దాని ప్రభావం చివరకు విద్యార్థులు, లబ్ధిదారులపైనే పడుతుంది. దళితుల భద్రత, సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారతకు సంబంధించి మౌలిక సంస్థలను బలహీనపరిచే విధానాలు అమలవుతున్నాయన్న ఆరోపణలపై ప్రభుత్వ బాధ్యతను తగ్గించవు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ విమర్శలకు ప్రతిస్పందించడం కంటే ప్రజలకు లెక్క చెప్పే సంస్కృతిని అలవర్చుకోవాలి. చేవెళ్ల డిక్లరేషన్‌లోని ప్రతి హామీపై అమలు నివేదిక విడుదల చేయాలి. పథకం వారీగా కేటాయింపులు, విడుదలలు, వ్యయాలు, బకాయిలు, లబ్ధిదారుల సంఖ్యను ప్రజల ముందుంచాలి. పెండింగ్‌లో ఉన్న విద్యా సాయం, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సహాయం, అట్రాసిటీ పరిహారాలపై కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలి. దళిత సంక్షేమాన్ని ఓటు బ్యాంకు రాజకీయాల నుంచి బయటకు తీసుకురావాల్సిన సమయం ఇది. దళితుడు ఎన్నికల సమయంలో ఓటరు మాత్రమే కాదు, రాజ్యాంగం హామీ ఇచ్చిన సమాన హక్కుల పౌరుడు. అతని విద్య, ఉపాధి, భూమి, గృహం, ఆర్థిక అవకాశాలు, భద్రత, ఆత్మగౌరవం ఇవన్నీ దానం కాదు, సామాజిక న్యాయంలో భాగం. ఏయే రోజుల పాలనను ప్రభుత్వం విజయంగా చెప్పుకోవచ్చు. ప్రతిపక్షం వైఫల్యాలను ఎత్తిచూపవచ్చు. కానీ దళిత విద్యార్థికి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రసంగాలతో రాదు. విదేశీ విద్యార్థికి స్కాలర్‌షిప్ ప్రకటనతో అందదు. ఉపాధి కోసం ఎదురు చూస్తున్న యువకుడికి హామీ కాదు, అవకాశమే కావాలి. అట్రాసిటీ బాధితుడికి సానుభూతి కాదు, సత్వర న్యాయం కావాలి. నిరుపేద కుటుంబానికి గృహ హామీ కాదు, ఇల్లు కావాలి. అందుకే దళిత సంక్షేమంపై ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటకు అమలే తుది పరీక్ష. హామీలు కాగితాలపై మిగలకూడదు. కేటాయింపులు ఫైళ్లలో నిలవకూడదు. నిధులు మధ్యలో ఆగకూడదు. పథకాలు గణాంకాలుగా మిగలకూడదు. అవి దళిత కుటుంబాల జీవితాల్లో స్పష్టమైన మార్పుగా కనిపించాలి. ప్రభుత్వం ఎవరిది అన్నది కాదు.. ప్రజాస్వామ్యంలో ఎవరి కోసం పనిచేస్తోంది అన్నదే ప్రజాస్వామ్యపు అసలు ప్రశ్న. దళిత సంక్షేమం రాజకీయ లక్ష్యాలకు, పార్టీల ప్రతిష్ఠకు బలికాకూడదు. ప్రజల ఆశలను హామీలతో మోసం చేయకూడదు. సామాజిక న్యాయం ఎన్నికల నినాదం కాదు, అది రాజ్యాంగబద్ధమైన బాధ్యత. ఆ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించినప్పుడే తెలంగాణలో అభివృద్ధి సమగ్ర అభివృద్ధిగా, ప్రజాస్వామ్యం అర్థవంతమైన ప్రజాపాలనగా నిలుస్తుంది.

తొలి గురువు ఎవరు ?

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రపంచం ఉపాధ్యాయులను గౌరవిస్తుంది. అయితే ఆ వేడుక వెనుక తరగతి గదులకంటే, పాఠశాలలకంటే ఎంతో పాత ప్రశ్న ఉంది. మొదటి గురువు ఎవరు? దానికి సమాధానం ఒక పురాణ పురుషుడి పేరులోనో, ప్రాచీన విద్యాసంస్థలోనో ఉండకపోవచ్చు. ఒక మనిషి తన అనుభవంతో నేర్చుకున్న విషయాన్ని మరొకరితో పంచుకోవచ్చని తొలిసారి గ్రహించిన క్షణంలోనే దాని సమాధానం దాగి ఉండవచ్చు. పాఠశాలలు ఏర్పడకముందే మనిషి నేర్చుకోవడం ప్రారంభించాడు. అగ్ని, ఋతువులు, జంతువులు, మొక్కలు, నక్షత్రాలు, తన చర్యల ఫలితాలను గమనించాడు. అవసరం, ఆసక్తి, ప్రయత్నం, వైఫల్యం ద్వారా నేర్చుకున్నాడు. అయితే ఒకదశలో తన అనుభవంతో సంపాదించిన అవగాహనను మరొకరికి అందించాలనే ప్రయత్నం మొదలైంది.



అనుభవం బోధించగల జ్ఞానంగా మారిన ఆ క్షణమే బోధనకు తొలి రూపం. ఆ చిన్న మార్పు మానవ నాగరికతలో గొప్ప మలుపు. ఒక వ్యక్తి తెలుసుకున్న విషయం అతనితోనే అంతరించిపోకుండా, మరొకరికి చేరింది. అక్కడి నుంచి జ్ఞానం జ్ఞాపకంగా నిలిచింది, తరతరాలకు అందింది, ప్రశ్నించబడింది, మెరుగుపడింది. మానవ సమాజం కేవలం కొత్త విషయాలను కనుగొనడం వల్లనే ఎదగలేదు; కనుగొన్నదాన్ని తరువాతి తరానికి అందించే సామర్థ్యం వల్ల కూడా ఎదిగింది. అందుకే గురువు అంటే కేవలం సమాచారాన్ని అందించే వ్యక్తి కాదు. ఒక విద్యార్థికి సమాధానం చెప్పడం సులభం. కానీ ఆ సమాధానం వెనుక ఉన్న కారణాన్ని అర్థం చేసుకునేలా చేయడమే అసలైన బోధన. జ్ఞానశక్తిని పెంచడం కంటే ఆలోచించే శక్తిని పెంచడం విద్య యొక్క ఉన్నత లక్ష్యం. ఈ తాత్విక అర్థంలో గురువు అజ్ఞానాన్ని సమాచారంతో నింపేవాడు కాదు; అయోమయాన్ని అవగాహనగా మార్చేవాడు. భారతీయ జ్ఞాన సంప్రదాయంలో గురు-శిష్య సంబంధానికి అందుకే ప్రత్యేకమైన స్థానం ఉంది. గురువు జ్ఞానానికి తుది యజమాని కాదు; శిష్యుడిని స్వతంత్ర వైపు నడిపించే మార్గదర్శి. ఇందులో ఒక ముఖ్యమైన వైరుధ్యం ఉంది. నిజమైన గురువు శిష్యుడిని తనపై శాశ్వతంగా ఆధారపడేలా చేయడు. చివరికి స్వయంగా ఆలోచించే, ప్రశ్నించే, నిర్ణయం చుకునే స్థాయికి తీసుకెళ్తాడు. ఉపాధ్యాయుడు సమాధానం వైపు చూపించగలడు కానీ ఆ సమాధానాన్ని విద్యార్థి తరఫున అర్థం చేసుకోలేడు. ఒక వ్యక్తిని నేర్చుకోగలిగేలా చేయవచ్చు. కానీ అతని తరఫున నేర్చుకోలేం. ఆలోచన ప్రయాణాన్ని విద్యార్థి తనవైపు పూర్తి చేయాలి. ఒక ప్రశ్నను లేవనెత్తగలడు కానీ దాని సమాధానాన్ని వెతకాల్సింది విద్యార్థే. అందుకే ఉన్నతమైన బోధన విధేయతను కోరదు; ఆలోచనా స్వేచ్ఛను పెంచుతుంది. ఈ గురువు నేటి సమాచార యుగంలో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఒక విద్యార్థి నిమిషాల్లో విస్తారమైన సమాచారాన్ని పొందగలుగుతున్నారు. కృత్రిమ మేధస్సు సమాధానాలు ఇవ్వగలుగుతోంది. డిజిటల్ వేదికలు పాఠాలను వివరించగలుగుతున్నాయి. అయినప్పటికీ సమాచారం పెరగడం వల్ల అజ్ఞానం తగ్గిపోలేదు. అసలు సవాలు ఇప్పుడు సమాచారాన్ని పొందడంలో కాదు; సమాచారంలో నిజాన్ని గుర్తించడం, జ్ఞానాన్ని అవగాహనగా మార్చడం, సరైన నిర్ణయం తీసుకోవడంలో ఉంది. అందుకే సాంకేతికత పెరుగుతున్న కొద్దీ ఉపాధ్యాయుడి పాత్ర తగ్గిపోవాల్సిన అవసరం లేదు. మారాల్సింది పాత్ర. సమాచారాన్ని చెప్పడంలో యంత్రాలు ముందుకు వెళ్లవచ్చు. కానీ ఏ ప్రశ్న అడగాలి, ఏ సమాచారాన్ని నమ్మాలి, ఆధారాలను ఎలా పరిశీలించాలి, తప్పును ఎలా గుర్తించాలి, భిన్నమైన ఆలోచనలను ఎలా అనుసంధానించాలి అనే సామర్థ్యాలను పెంపొందించడం ఉపాధ్యాయుడి కీలక బాధ్యతగా మిగులుతుంది. నాగరికత చరిత్రను కూడా ఒక తరం నుంచి మరో తరానికి జ్ఞానం బదిలీ అయిన చరిత్రగా చూడవచ్చు. ఒక తరం కనుగొంటుంది. తరువాతి తరం నేర్చుకుంటుంది. మరో తరం ప్రశ్నిస్తుంది. ఇంకో తరం దాన్ని మెరుగుపరుస్తుంది. విజ్ఞానం ముందుకు సాగడానికి పరిశోధన ఎంత అవసరమో, కనుగొన్నదాన్ని బోధించడం కూడా అంతే అవసరం. భాషలు నిలవడానికి మాట్లాడేవారు ఎంత అవసరమో, వాటిని తరువాతి తరానికి నేర్పేవారు కూడా అంతే అవసరం. కళలు, నైపుణ్యాలు, విలువలు--ఇవన్నీ బోధన ద్వారానే తరతరాలకు చేరుతాయి. అయితే బోధన ఒకవైపు జరిగే ప్రక్రియ కాదు. నేర్పుతున్న వ్యక్తికి బాధ్యత ఉంది. సమాధానాలను సేకరించడం విద్య కాదు. ప్రశ్నించడం, పరిశీలించడం, సందేహించడం, తప్పు అని తేలితే తన అభిప్రాయాన్ని మార్చుకోవడం కూడా విద్యలో భాగమే. ఉపాధ్యాయుడు దిశను చూపించగలడు; ఆ మార్గంలో నడవాల్సింది విద్యార్థే. అందుకే అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం కేవలం తరగతి గదిలో బోధించే వారిని సన్మానించే రోజు కాదు. జ్ఞానాన్ని ఒక తరం నుంచి మరో తరానికి అందించే సామాజిక బాధ్యతను గుర్తుచేసే రోజు. గతం నుంచి వచ్చిన జ్ఞానాన్ని యథాతథంగా కాపాడటం మాత్రమే కాదు; దాన్ని ప్రశ్నిస్తూ, పరిశీలిస్తూ, అవసరమైన చోట సరిదిద్దుతూ భవిష్యత్తుకు అందించడం కూడా ఉపాధ్యాయుడి బాధ్యత. కాబట్టి 'మొదటి గురువు ఎవరు?' అనే ప్రశ్నకు ఒక వ్యక్తి పేరు వెతకడం కంటే, ఆ తొలి బోధనా క్షణం మనకు నేర్పిన విషయాన్ని గుర్తించడం ముఖ్యం. ఒక మనిషి నేర్చుకున్నది అతనితోనే అంతరించిపోకూడదని భావించిన క్షణంలో జ్ఞానం వ్యక్తిగత అనుభవం నుంచి సామూహిక సంపదగా మారింది. అనుభవం జ్ఞానమైంది; జ్ఞానం అవగాహనగా మారింది; ఆ అవగాహన తరువాతి తరానికి చేరింది. అక్కడే నాగరికతకు ఒక ముఖ్యమైన పునాది పడింది. నేటి సంపన్నరాల తరువాత తరగతి గదులు మారాయి. బోధనా పద్ధతులు మారాయి. సాంకేతికత విద్యను మార్చుతోంది. అయినప్పటికీ ఉపాధ్యాయుడి ప్రాథమిక బాధ్యత మారలేదు. గతం నుంచి వచ్చిన జ్ఞానాన్ని వర్తమానానికి అందించడం మాత్రమే కాదు; వర్తమానం నుంచి భవిష్యత్తును అర్థం చేసుకునే తరాన్ని తయారు చేయడం ఉపాధ్యాయుడి అసలు బాధ్యత. అందుకే అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఒక వృత్తికి అర్పించే గౌరవం మాత్రమే కాదు. మనిషి అనుభవాన్ని అవగాహనగా మార్చి, ఆ అవగాహనను తరువాతి తరానికి అందించే ఆ శాశ్వత ప్రక్రియకు గౌరవం. ఒక గురువు జ్ఞానాన్ని మాత్రమే అందించడు; తన తరం దాటి ఆ తరం మరింత దూరం చూడగలిగేలా చేస్తాడు.

-డి జయరాం

కాకలు తీరిన

రాజకీయ నేత కాకా

అక్టోబర్ 5...గడ్డం వెంకట స్వామి జయంతి

రాజకీయాల్లో కాకలు తీరిన నేతగా... 'కాకా'గా చెరగని ముద్ర వేసిన కేంద్ర మాజీ మంత్రి, సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి గడ్డం వెంకట స్వామి(92). భారత రాజ్యాంగ రూపకర్త బాబా సాహెబ్ అంబేద్కర్‌తో కలిసి పనిచేసిన వారిలో కాకా ఒకరు. కార్మిక నేతగా ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. గాంధీ దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవికి అతి సమీపానికి వెళ్ళి, కొందరి స్వార్థం, కుట్రల మూలంగా, ఆ పదవి పొందలేక పోయానని కాకా పదే పదే చెప్తుండే వారు. హైదరాబాద్ లో ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేయించి గుడిసెల వెంకట స్వామిగా గుర్తింపు పొందారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు మొదటిసారి ప్రతిపాదన చేసిన వ్యక్తి వెంకటస్వామి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా, ఏఐసీసీ బాధ్యునిగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, ఆయన అందించిన బహుముఖ సేవలు నిత్య జ్ఞాపకాలుగా మిగిలాయి. గడ్డం వెంకటస్వామి 5 అక్టోబర్ 1929న హైదరాబాద్ లో జన్మించారు. చిన్న వయసులోనే నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. మొదట ఆర్య సమాజ్‌లో, ఆ తర్వాత రామానందతీర్థ శిష్యుడిగా కాంగ్రెస్‌లో పనిచేశారు. సాయుధ పోరాట సమయంలో జైలుకెళ్లిన కాకా... హైదరాబాద్ విలీనం అనంతరం రాజకీయాలు వదిలేసి కుటుంబ పోషణ కోసం కూలీ పని చేశారు. అప్పుడే కార్మిక నాయకుడిగా ఎదిగారు. హైదరాబాద్‌లో నిలువనీడ లేకుండా ఉన్న పేదల కోసం ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసి వారి కోసం పోరాడారు. ఆర్థికంగా బలపడ్డాక మళ్లీ రాజకీయాల్లోకి వచ్చిన కాకా అనేక పదవులు అలంకరించారు. 1957- 62 మరియు 1978-84 ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ్యులుగా రెండు పర్యాయాలు ఉన్నారు. 1967లో 4 వ లోకసభకు ఎన్నికైయ్యారు. 1969-71 వరకు ప్రజా పద్దుల కమిటీ సభ్యులు. అవిభక్త కరీంనగర్ జిల్లా పెద్దపల్లి లోకసభ నియోజకవర్గం నుండి పార్లమెంట్ కు ప్రాతినిధ్యం వహించారు. 1971లో 5వ లోకసభకు (2వ పర్యాయం), 1977లో 6వ లోకసభకు (3వ పర్యాయం), 1989లో 9వ లోక్ సభ (4వ పర్యాయం), 1991లో 10వ లోకసభకు (5వ పర్యాయం), 1996లో 11వ లోకసభకు (6వ పర్యాయం), 2002-2004 అధ్యక్షుడి గా, ఏ.ఐ.సి.సి. (ఎస్ సి & ఎస్ టి), 2004లో 14వ లోకసభకు (7వ పర్యాయం), ఎన్నికైయ్యారు. 1978 - 1982 లేబర్ మరియు సివిల్ సప్లైస్, ఆంధ్ర ప్రదేశ్ క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. ఫిబ్రవరి 1973 - నవంబర్ 1973 వరకు లేబర్ మరియు పునరావాస కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. నవంబర్ 1973- మార్చి 1977 వరకు సప్లై అండ్ రీహాబిలిటేషన్ కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. 21 జూన్ 1991 నుండి 17 జనవరి 1993 గ్రామీణాభివృద్ధి కేంద్ర మంత్రిగా, పని చేశారు.

-వెంకట గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషకులు
9848559863

పల్లె ఆరోగ్యానికి ప్రాణవాయువు గ్రామీణ వైద్యులే..!

వేధింపులు ఆపి తక్షణమే శిక్షణ, గుర్తింపు ఇవ్వాలి!

ఆధునిక వైద్య సాంకేతికత ఎంత ఎత్తుకు ఎదిగినా, పట్టణాలలో రూపుదిద్దుకున్న అత్యాధునిక కార్పొరేట్ ఆసుపత్రులు ఎంతగా మెరిసిపోతున్నా.. నేటికీ మన దేశపు ఆత్మ అయిన గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ప్రజల ప్రాణాలకు నిజమైన రక్షణ కవచంగా నిలుస్తున్నది ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులే. భారతదేశంలో గ్రామీణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఏ స్థాయిలో ఉందో అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అరకొర వసతులతో మూలుగుతుండటం, ప్రభుత్వ వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తుండటం, అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం నిత్యకృత్యంగా మారింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో పల్లె ప్రజలకు ఏ చిన్న లేదా పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా మొదటి దిక్కు, కొండంత అండ ఆర్ఎంపీ వైద్యులే. అయితే, అహర్నిశలు క్షేమిస్తూ పల్లె ప్రజల ప్రాణాలు కాపాడుతున్న ఈ గ్రామీణ వైద్యుల సేవలను అభినందించాల్సింది పోయి, ప్రభుత్వం, ఐఎంఏ వంటి సంస్థలు, అధికారులు, ఐఎంఏ వర్గాలు కక్షగట్టినట్టు ప్రవర్తిస్తూ, వారిని నేరస్తులుగా చిత్రీకరిస్తూ దాడులు చేయడం, కేసులు నమోదు చేయడం తీవ్రంగా ఖండించదగిన తీవ్రమైన అంశం.

పదేళ్ల ఆచరణాత్మక అనుభవానికి విలువ లేదా?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేవలం రెండేళ్ల ఏఎన్ఎమ్ కోర్సు పూర్తి చేసిన నర్సులు గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించడానికి పూర్తి అర్హత లభిస్తుంది. మరి అలాంటప్పుడు 5 నుండి 10 సంవత్సరాల పాటు పట్టణాల్లోని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో అనుభవజ్ఞులైన వైద్యుల వద్ద రాత్రింబవళ్లు పనిచేసి, అనుభవజ్ఞుల పర్యవేక్షణలో సకల వైద్య విధానాలపై పరిపూర్ణమైన ఆచరణాత్మక అనుభవాన్ని గడించి గ్రామీణ ప్రాంతాలకు వచ్చి వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలను మాత్రం 'వ్యాజ వైద్యులు'గా ముద్ర వేయడం ఎంతవరకు సమంజసమో అధికారులు ఆలోచించాలి. ఏళ్ల తరబడి క్షేత్రస్థాయిలో సంపాదించిన ఆచరణాత్మక అనుభవం కన్నా కాగితం ముక్కపై ఉన్న డిగ్రీయే గొప్పదా? గ్రామీణ ప్రాంత ప్రజారోగ్య వ్యవస్థలో అనుభవానికి ఉన్న ప్రాధాన్యతను పాలకులతో పాటు ఆరోగ్య శాఖ అధికారులు పూర్తిగా విస్మరించడం వారి సంకుచిత వైఖరికి అద్దం పడుతోంది.

నగర కార్పొరేట్ వైద్యులు అర్ధరాత్రి పల్లెకు రాగలరా?

పట్టణాల్లోని పెద్ద పెద్ద ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులలో లక్షలకు లక్షలు అప్పులు చేసి కుమ్మరించి, డిస్చార్జ్ అయి ఊరికి వచ్చిన రోగులకు చివరికి వైద్య సేవలు కొనసాగించాల్సింది గ్రామీణ వైద్యులే. కార్పొరేట్ డాక్టర్లు రాసి ఇచ్చిన అత్యవసర ఫాలోఅప్ ఇంజెక్షన్లు ఇవ్వాలన్నా, ఎన్ఎస్, డిఎన్ఎస్ గ్లూకోజ్ బాటిళ్లు ఎక్కించాలన్నా, సర్జరీ తదనంతర డ్రెస్సింగ్‌లు చేయాలన్నా పట్టణాలలో ఆర్ఎంపీలు మాత్రమే గ్రామాలలో అందుబాటులో ఉంటారు. కార్పొరేట్ వైద్యులు రాసిన మందులు ఆర్ఎంపీలు రోగులకు అందిస్తే రాని నష్టం, అదే ఆర్ఎంపీలు అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స చేస్తే ఏ రకంగా ప్రమాదకరంగా మారుతుందో సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అర్ధరాత్రి వేళ పల్లెటూర్లలో ఎవరికైనా ఆరోగ్యం క్షీణించి ప్రాణాపాయ స్థితి ఏర్పడితే పీసీ గదుల్లో పడుకునే కార్పొరేట్ డాక్టర్లుగానీ, ప్రైవేట్ హాస్పిటల్స్ డాక్టర్లుగానీ పరిగెత్తుకుంటూ రాగలరా? ఆ క్లిష్ట సమయంలో పిలవగానే వచ్చి, అతి తక్కువ ఖర్చుతో ప్రాథమిక చికిత్స అందించి రోగి ప్రాణాలను నిలబెట్టేది ఈ గ్రామీణ వైద్యులే కదా!

50 శాతాల కమీషన్ల కోసం కార్పొరేట్ ఆసుపత్రుల కక్కుర్తి!

పట్టణాల్లో వెలిసిన పెద్ద పెద్ద ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు తమ వ్యాపారాన్ని పెంచుకోవడానికి పల్లెల్లో ఉండే ఆర్ఎంపీల చుట్టూ రోజూ తిరుగుతున్నారనేది నిత్య సత్యం. తమ ఆసుపత్రులకు రోగులను పంపిస్తే ఏకంగా 50 శాతం కమీషన్లు ఇస్తామని ఆశచూపుతూ, ప్రత్యేక ఏజెంట్లను రంగంలోకి దింపి ఆర్ఎంపీల క్లినిక్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల చుట్టూ ఆర్ఎంపీలు తిరగడం లేదు, ఆ కార్పొరేట్ వ్యాపారులే తమ కమీషన్ల కక్కుర్తి కోసం ఆర్ఎంపీల చుట్టూ తిరుగుతున్నారు. ఈ వ్యాపార కమీషన్ల దందాను వ్యతిరేకిస్తూ, పేద గ్రామీణ ప్రజల జేబులు ఖాళీ కాకుండా కాపాడుతున్న ఆర్ఎంపీలను టెక్నాలజీపరంగానే పెద్ద వైద్యుల సంఘాలు (ఐఎంఏ), ఆరోగ్య శాఖలోని కొందరు అధికారులు కలిసి కుట్రలు పన్నుతున్నారు.

జీవోలు కాగితాలకే పరిమితం చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యమే!

గ్రామీణ వైద్యుల సేవలను గుర్తించి, వారికి తగిన శిక్షణనిచ్చి అధికారికంగా ప్రాథమిక వైద్యానికి గుర్తింపు కల్పిస్తామని గతంలోనే ప్రభుత్వం స్పష్టమైన జీవో (జీఓ.నం 1273/429) జారీ చేసింది. కానీ ఆ జీవోను కార్యరూపంలోకి తేకుండా ఏళ్ల తరబడి నాన్చడం పాలకుల అలసత్వానికి, నిర్లక్ష్యానికి నిదర్శనం. సమస్యను శాశ్వతంగా పరిష్కరించి దిశగా చర్యలు తీసుకోవాల్సింది పోయి, తనిఖీల పేరుతో దాడులు చేయించడం, కేసులు నమోదు చేయించి వేధింపులకు గురిచేయడం ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రం తగదు. నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న ఆరోగ్య శాఖ ఇప్పటికైనా తన తీరును మార్చుకోవాలి.

- వెంకట గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

మెగా గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ భూమి

నాగోల్ వెలుతురు అక్టోబర్ 04:
నాగోల్ ఫతుల్లాగూడలోని గోల్డెన్ లీవ్స్ విల్లాస్ సమీపంలో మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ (వీ×దీ) ఆధ్వర్యంలో నిర్మించనున్న మెగా గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ రూపొందించిన ప్రాజెక్టు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన, ఆధునిక సౌకర్యాలతో కూడిన నివాసాలను అందించాలనే లక్ష్యంతో మెగా గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. "విజన్ టు రియాలిటీ" అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న మహాదేవ్

ఇన్‌ఫ్రా డెవలపర్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు ప్రీమియం జీవన వసతులను అందించేలా ప్రాజెక్టు విజయవంతంగా పూర్తవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహాదేవ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ చైర్మన్ డ ఎండీ బి. రవి కుమార్, దీ=ూ నాయకులు నవీన్ గౌడ్ మహేష్ గౌడ్ ,గుడి మధు సుధాన్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు, సిబ్బంది, ఆహ్వానితులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ఆరుట్ల గ్రామంలో మాజీ హోంశాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి 72వ జయంతి

- స్వర్గీయ మాజీ హోంశాఖ మంత్రి ఇంద్రారెడ్డి సేవలు మరువలేనిది
- మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, ముచ్చర్ల వెంకటేష్ యాదవ్

మంచాల వెలుతురు అక్టోబర్ 04:
మంచాల మండలం స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమాజీ హోంశాఖ మంత్రిపట్లోళ్ల ఇంద్రారె డ్డి జయంతి సందర్భంగా ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంద్రారెడ్డి విగ్రహానికిపూలమాలలు వేసి నివాళులర్పించారు ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంచాల వ్యవసాయ స హకార సంఘం చైర్మన్ వెదిరె

హన్మంత్ రెడ్డి హాజరైన కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంనాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి జిల్లా నాయకుడు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వర్గీయ మాజీ హోంశాఖ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి విద్యార్థి స్థాయి నుండే ఎన్నో ఉద్యమాలు చేస్తూ ప్రజలకు అండగా ఉంటూ ప్రజాల సమస్యలపై పోరా టంచేస్తూ రాజకీయంగా హోంశాఖ మంత్రి స్థాయి ఎదిగి ప్రజలకు ఎన్నోసేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్పనాయకుడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి అని అన్నారు ఇంద్రారెడ్డి గారు చేసిన సేవలు మరువలేనివి అని అన్నారు ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ ఇందిరమ్మకమిటీ సభ్యులు చెరుకు నరసింహాగౌడ్ బుట్టి కృష్ణ ముది రాజ్ కంబాలపల్లి బుగ్గ రాములు మార లక్ష్మణ్ మాజీసర్పంచ్ అనంగళ్ళ యాదయ్య కాంగ్రెస్ పార్టీ మండలం నాయకుడు రావుల భాష కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్యముది రాజ్ కావలి శ్రీనివాస్ ముది రాజ్ నూకం సత్తయ్య ముదిరాజ్ అంతటి రాజుగౌడ్ మెగావత్ ల క్ష్మణ్ నాయక్ దాసరమోని ర మేష్ ముదిరాజ్ కావలి ర మేష్ ముదిరాజ్ మర సురేష్ ఉదరీ న రసింహ మహమ్మద్ యూసు ఫ్ మద్దెల గోపాల్ గౌడ్ మంకు శ్రీనివాస్ మహమ్మద్ ఇబ్రహీం సుం కరి దానయ్యగౌడ్ దాసరమోని అశోక్ ముదిరాజ్ మహమ్మద్ అశ్రఫ్ రావుల నాగరాజు రైనాము దిరాజ్ దూసరి రాజుగౌడ్ గొరిగే కృష్ణదండె వెంకన్న తదితరులు పాల్గొన్నారు

చైతన్యపురి మారుతి నగర్‌లో కల్కి డిజిటల్ ప్రింటింగ్ ఘన ప్రారంభం

చైతన్యపురి, వెలుతురు సెప్టెంబర్ 4:
చైతన్యపురి మారుతి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కల్కి డిజిటల్ ప్రింటింగ్ ప్రెస్ ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద గుప్తా, అమరావతి లక్ష్మీనారాయణ, జక్కిడి శివశరణ్ రెడ్డి, కాలవ సుజాత, తోట మహేష్ యాదవ్ తదితరులు హాజరై ప్రింటింగ్ ప్రెస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వంశీకృష్ణ సరాబు మాట్లాడుతూ, తమ ఆహ్వానాన్ని మన్నించి ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత కంప్యూటర్ యుగానికి అనుగుణంగా నూతన డిజైన్లతో అత్యాధునిక డిజిటల్ ప్రింటింగ్ సేవలను అందించడమే తమ ప్రధాన ఉద్దేశమని

పేర్కొన్నారు. కల్కి డిజిటల్ ప్రింటింగ్‌లో రాజకీయ ఫ్లెక్సీలు, వివాహ మహోత్సవ ఫ్లెక్సీలు, పుట్టినరోజు ఫ్లెక్సీలు, షాపింగ్ మాల్స్, ఎగ్జిబిషన్లు, వ్యాపార ప్రకటనలకు సంబంధించిన ఫ్లెక్సీలను అతి తక్కువ సమయంలో నాణ్యమైన ప్రింటింగ్‌తో అందిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక డిజైన్లతో మెరుగైన సేవలు అందిస్తామని వెల్లడించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సరాబు లక్ష్మణ్ గుప్తా, ఉదయ్ భాస్కర్ గుప్తా పాల్గొన్నారు.

హయత్‌నగర్ నారాయణ స్కూల్ పదవ తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం

హయత్ నగర్ వెలుతురు అక్టోబర్ 04:
10వ తరగతి విద్యార్థుల విద్యా జీవితంలో అత్యంత కీలకమైన దశ. ఈ దశలో విద్యార్థులకు చదువు పట్ల స్పష్టమైన అవగాహన, పరీక్షా విధానం, సమయపాలన, లక్ష్య నిర్దేశం వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఓరియంటేషన్ ప్రోగ్రాం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రధాన అంశాలు:
10వ తరగతి ప్రాముఖ్యత -- భవిష్యత్ విద్యా అవకాశాలకు ఈ సంవత్సరం ఎలా పునాది అవుతుందో వివరించడం.
పరీక్షా విధానం -- సిలబస్, ప్రశ్నాపత్రం విధానం, మార్కుల ప్రాధాన్యత, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో తెలియజేయడం.
స్టడీ ప్లాన్ -- రోజువారీ చదువు, రివిజన్, ప్రాక్టీస్‌కు సమయాన్ని కేటాయించుకోవడం.
విద్యార్థుల మానసిక ధైర్యం -- పరీక్షలపై భయం, ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసాన్ని పెంచడం.
తల్లిదండ్రుల పాత్ర -- విద్యార్థులపై ఒత్తిడి కాకుండా వారికి అవసరమైన సహకారం, ప్రోత్సాహం అందించడం.
లక్ష్య నిర్దేశం -- ప్రతి విద్యార్థి తన సామర్థ్యానికి అనుగుణంగా స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం.
ముగింపు
"10వ తరగతి విజయం ఒక్క పరీక్ష ఫలితం కాదు; క్రమశిక్షణ,

నిరంతర సాధన, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సహకారం కలిసిన ఫలితం."
అందువల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసేలా ఓరియంటేషన్ ప్రోగ్రాంను నిర్వహిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.
ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా +వీ గోపాల్ రెడ్డి , వనస్థలిపురం జోన AGవీ రవీంద్రబాబు , కాలేజీ కోర్ డీన్ రాధ కృష్ణ , =డణ శివరంజని , రోహిణి , జూ సృజన్ రాథోడ్ , ప్రిన్సిపాల్ లావణ్యరెడ్డి ,ూూ అనంత చంద్ర శేఖర్,ూణ మంజుల , ఇంచార్జీలు రాఘవ, యుగంధర్ , ూా టీమ్, పదవ తరగతి ఉపాధ్యాయులు , అడ్మిన్ సిబ్బంది , విద్యార్థులు మరియు వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు

మండల పరిషత్ సమావేశంలో ప్రోటోకాల్ పాటించని అధికారులు

మంచాల మండలం బిఅర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చీరల రమేష్

మంచాల వెలుతురు అక్టోబర్ 04:
మంచాల మండలం కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ మాట్లాడుతూఅధికారం ఉందనే అహంకారంతో ప్రోటోకాల్ పాటించని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అని విమర్శించారు మంచాల మండలం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజాప్ర తి నిధులు అధికారుల సమీక్ష సమావేశంలో గ్రామప్రజలు ఎన్నుకున్న సర్పంచ్ లను వెనుకకు నె ట్టేసి కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించినట్టు ఉందని వారు విమర్శించారు కనీసం ప్ర జాప్రతినిధులు అయినటువంటి వ్యక్తులని గౌరవించకుండా భార్యలు సర్పంచ్ లుగా ఉంటే భర్త లు సమావేశానికి హాజరై సందర్భాన్ని మంచాల మండలంలో చూడాల్సి వస్తుందని ఎప్పుడూఅనుకోలేదని అన్నారు మంచాల మండలంలో రాజకీయ చరిత్ర ఉన్నట్టువంటి మండలంలో కనీసం సర్పంచ్ లను గౌరవించ కుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ మండలాల నుంచి వచ్చి సమీక్ష సమావేశంలో ముందు సీట్లలో కూర్చోబెట్టుకొని సమావేశం నిర్వహించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు మండల అభివృద్ధి అధికారి ప్రోటోకాల్ ని పక్కకు పెట్టి కాంగ్రెస్ పార్టీ చెప్పు చేతల్లో నడిచే విధంగా ప్రవర్తించడం ఎంపీడీవో గారు కనీసం ప్రోటోకాల్ ని పాటించ కుండా ఆ సీటుకునటువంటి గౌరవాన్ని అఘోర పరిచారని అనిఅన్నారు సర్పంచ్ లు వివిధ గ్రామాల సమస్యలను చెప్పుకుందామని సమీక్ష సమావేశానికి వస్తే కనీసం వారి స మస్యలను చెప్పుకోనివ్వకుండా

కాంగ్రెస్ పార్టీ నాయకులను మొదటి వరసలో కూర్చోబెట్టుకొని స మావేశా న్ని ఏవిధంగా నిర్వహించారు ఏ విధంగా ప్రోటోకాల్ ఉందని వారిని అనుమతించారుఅనే విష యాన్ని ఎంపీడీవో గారు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది డిమాండ్ చేశారు ఈ విషయంపై వివిధ రాజకీయ పార్టీ నాయకులు నవ్వుకుంటున్నారని అనేకమంది ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు సమీక్ష సమావేశానికి వచ్చారుగాని పార్టీ కార్యకర్తలను తీసుకొచ్చి సమీక్ష సమావేశంలో కూర్చోబెట్టుకొని సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి అనుకుంటారని విమర్శిం చారు కనీసం ప్రజాప్రతినిధులకు విలువ లేదా అని విమర్శించారు ఈవిషయంపై పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం అని అన్నారు ఈ కార్యక్ర మంలో. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎరుపుల చంద్రయ్య మా జీ సింగిల్ విండో మాజీ చైర్మన్ మొద్దు సికిందర్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి బహుదూర్ బి ఎన్ జ్ఞానేశ్వర్ మాజీ సింగల్ విండో చైర్మన్ బస్సు పుల్లారెడ్డి నర్సింగ్ వెంకటేష్ గౌడ్ దండేటికారి రవి నారి యాదయ్య నూతన గంటి శేఖర్ వనపర్తి బద్రీనాథ్ కసర మోని ప్రవీణ్ యాదవ్ మ హేందర్ యాదవ్ రావుల శంకర్. చిందం జంగయ్య కాటి కృష్ణ నూకం కేశవ్ తదితరులు పాల్గొన్నారు

ఇంజాపూర్‌లో రూ 54 లక్షలతో అదనపు తరగతి గదులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

- విద్యార్థుల భవితకు పెట్టే పెట్టుబడి సమాజాభివృద్ధికి పునాది
- ఆరుట్ల టీపీఎస్ తరహాలో నియోజకవర్గంలో మరిన్ని బడులు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 04:
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇంజాపూర్ లో అదనపు తరగతి గదుల కోసం రూ 54 లక్షలతో శంకుస్థాపన చేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం చేసే పెట్టుబడి సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుం పేర్కొన్నా రు. విద్యార్థులకు మెరుగైన విద్యావసతులు కల్పించే లక్ష్యంతో ఆదివారం ఇంజాపూర్ ప్రభుత్వ పాఠశాలలోరూ 54లక్షలతో అదనపు తరగతి గదులకు ఆయన శంకుస్థాపన చేశారు సర్కార్ బడులను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారువిద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్ర త్యేక దృష్టి సారిస్తున్నామని

తెలిపారు ఇందులో భాగంగానే రాష్ట్రంలోనే తొలి టీపీఎస్ ను ఆరుట్లలో ఏర్పాటు చేశామ నిఅక్కడ నో అడ్మిషన్ బోర్డు పెట్టినట్లు చెప్పారు ఈ తరహా విద్యాకేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు ప్రభుత్వ ప్రోత్సాహాన్నిప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాఠశాల ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు

అరుణోదయ నగర్ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నికలు విజయవంతం

రంగారెడ్డి జిల్లా, వెలుతురు అక్టోబర్ 4 :
అరుణోదయ నగర్ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతి ద్వారా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా గుమ్మీ మధుసూదన్ రెడ్డి, 54 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించగా, కార్యదర్శిగా మర్రి జంగారెడ్డి వైస్ ప్రెసిడెంట్ కె సుదర్శన్ రెడ్డి, ఎన్నికయ్యారు. కాలనీ అభివృద్ధి, పరిశుభ్రత, భద్రత వంటి అంశాలపై తమ ప్రణాళికలను వివరించి వారు పోటీ చేశారు. సాధారణంగా కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు కాలనీలో ఐక్యతను, పారదర్శకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని స్థానికులు తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల ద్వారా కాలనీవాసులందరి అభిప్రాయాలకు ప్రాధాన్యత లభిస్తుందని, కాలనీ సమస్యలను పరిష్కరించడంలో నూతన కమిటీ కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు.

రూ.72 లక్షల సీఎంసీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 04:
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహదేవపురంలోని ప్లాట్ నంబర్లు 139-160, 160-171, 195-200, 194-182తో పాటు =ఖ టౌన్‌షిప్ ప్రాంతాల్లో గత పదేళ్లుగా రోడ్ల నిర్మాణం లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం జవీజ నిధుల ద్వారా రూ. 72 లక్షలు కేటాయించింది. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి జజ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన హన్మంతన్నకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు

సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, విజయ్ రెడ్డి, వెంకట్రావు, బండారి లేఔట్ అధ్యక్షులు వరగాని వాసు, అల్లాడి మహేష్, తిరుమల, =ఖ టౌన్‌షిప్ అసోసియేషన్ మరియు కాలనీ సభ్యులు వినయ్ కుమార్, సంతోష్ అల్లెంకి, దేశాయి రెడ్డి, సతీష్ వాటికుట్టి, సురేష్ వాలంకొండ, రాజా చౌదరి, వెంకట్ ఆలపాటి, నాగరాజ్ సామల్లేటి, డాక్టర్ వెంకన్న, నాగరాజు రావూరి, కోటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించని ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలి

- సిపిఎం పార్టీ సర్పంచ్ ల సమస్యలు పట్టించుకోని
- ఎమ్మెల్యే నియంత పోకడలు మానుకోవాలి

సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రావుల జంగయ్య

మంచాల వెలుతురు అక్టోబర్ 04:
మంచాల మండలం కేంద్రం లో జరిగిన సమావేశంలో సిపిఎం పార్టీ గ్రామ సర్పంచ్ ల తో కలిసి సిపిఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో సిపి ఎం పార్టీ సర్పంచ్ లు చెప్పిన సమస్యలు సిపిఎం పార్టీపై నిందలు వేస్తూ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సర్పంచ్ లకు ప్రోటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ కా ర్యకర్తలను అనుచరులను సమావేశానికి హాజరుపరిచి ప్రజాప్రతినిధులను అవమానించిన ఎ మ్మెల్యే ఆయన ప్రవర్తన మార్చుకోవాలని అన్నారు ఆయన ప్రవర్తన మార్చుకోకపోతే తగిన రీ తిలో బుద్ధి చెప్పవలసి వస్తుందని తెలిపారు సర్పంచ్ లను గౌరవించకుంటే రాబోయే కాలంలో ప్రజలే చూసుకుంటారని తెలిపారు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు స ర్పంచ్ ల భర్తలు సమావేశానికి హాజరవుతున్నారని ఇదెక్కడి న్యాయమని అన్నారు ప్రోటకల్ పాటించాలని విజ్ఞప్తి చేశారు అలాగే సిపిఎం పార్టీపై నిందలు వేయడం మానుకోవాలని అన్నా రు ఈకార్యక్రమంలో రంగాపూర్ గ్రామసర్పంచ్ నేనావత్ బాలకృష్ణ నాయక్ చెన్నారెడ్డి గూడా గ్రామసర్పంచ్ పగడాల విజయ ఎల్లమ్మతండా సర్పంచ్ సపవట్ జవహర్ లాల్ బండాలేమూర్ గ్రామసర్పంచ్ పాతులోత్ శ్రీనివాస్ నాయక్ సిపిఎం పార్టీ మంచాల మండలం కార్యవర్గ సభ్యుడు అన్నారం లెనిన్ కాళ్ళ జంగయ్య ఆవుల యాదయ్య సీనియర్ నాయకులు మహమ్మద్ యూసుఫ్ ఆలీ పగడాల వెంకటేష్ నూకం రవి ముదిరాజ్ యస్ డి హఫీజ్ పాష తదితరులు పాల్గొన్నారు

రాంపల్లి డబుల్ బెడ్రూమ్ 6,240 కుటుంబ సభ్యులందరికీ లేబర్ హెల్త్ కార్డు

- మన పేద కుటుంబాల భద్రత కోసం లేబర్ హెల్త్ కార్డు
- రాంపల్లి డబుల్ బెడ్రూమ్‌లోని 41వ బ్లాక్‌లో వాణి గారి ఆధ్వర్యంలో లేబర్ హెల్త్ కార్డుల జారీ
- వెంకట్ లాయర్ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ ఫౌండేషన్ రాంపల్లి డబుల్ బెడ్రూమ్

రాంపల్లి వెలుతురు అక్టోబర్ 04:
మన రాంపల్లి డబుల్ బెడ్రూమ్‌లో చాలా మంది పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు బిల్డింగ్ పనులు, కాంట్రాక్ట్ పనులు, మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలు, ఇతర కార్మిక పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుటుంబానికి పెద్దగా ఉండే వ్యక్తి పనికి వెళ్లినప్పుడు అనుకోకుండా ప్రమాదం జరిగినా, గాయపడినా లేదా ఇతర ఇబ్బంది ఎదురైనా, కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడంలో లేబర్ కార్డు ఉపయోగపడే అవకాశం ఉంటుంది. అర్హతలు, సంబంధిత ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రమాద బీమా/ఇతర సంక్షేమ ప్రయోజనాలు, వైద్య సంబంధిత సదుపాయాలు పొందే అవకాశం ఉంటుంది. ఇలాంటి ఉపయోగకరమైన అవకాశాన్ని మన 6,240 కుటుంబ సభ్యులకు ఎందుకు అందించకూడదు? అనే ఉద్దేశంతో వాణి గారు ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం. ఈ మంచి కార్యక్రమానికి మా పూర్తి మద్దతు ఉంటుంది. అలాగే రాంపల్లి డబుల్ బెడ్రూమ్‌లోని 52 బ్లాకుల ఇన్‌చార్జీలు, కమిటీ సభ్యులు, యువత మరియు ప్రతి బ్లాక్‌లో ఆర్థికంగా స్థిరంగా ఉన్న కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి, అవసరమైన పేద కార్మిక కుటుంబాలను ప్రోత్సహించి, అర్హత ఉన్నవారికి లేబర్ హెల్త్ కార్డు చేయించేందుకు సహకరించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. ఒక కుటుంబానికి మనం చేసే చిన్న సహాయం, ఆ కుటుంబానికి భవిష్యత్తులో పెద్ద భద్రతగా మారవచ్చు.

మన లక్ష్యం ఒక్కటే ---
రాజకీయాలకు అతీతంగా, కులమతాలకు అ-తీతంగా, మన రాంపల్లి 6,240 కుటుంబాల సంక్షేమం మరియు భద్రత కోసం కలిసి పనిచేయడం.

బిఆర్ఎస్ గెలుపును ఒడిసి పట్టాలి

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 04:
ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 - గాజుల రామారం డివిజన్ యండమూడి లేఔట్ కమ్యూనిటీ హాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికను పురస్కరించుకొని నిర్వహించిన అవగాహన సదస్సుకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియ మొదట మన ఇంటి నుంచి ప్రారంభమవ్వాలి. మన ఇళ్లలోని పట్టభద్రులతోపాటు కాలనీ, డివిజన్ తో పాటు పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి ఇళ్లలో పట్టభద్రులను గుర్తించి ఓటర్ నమోదు చేపించాలి.

గతంలో ఓట్లు వేసిన పట్టభద్రులు కూడా తిరిగి ఓటర్ నమోదును చేపించుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలి. రాష్ట్రంలో కెసిఆర్ గారి నాయకత్వాన్ని తిరిగి 70 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని, గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతి ప్రధాన నడిపించడం. కానీ నేడు ప్రభుత్వ వైఫల్యాలు, పాలనలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, యువతను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయానికి కృషిచేయాలన్నారు.
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపులో మంచి మెజారిటీ కుత్బుల్లాపూర్ నుంచి సాధించేలా నాయకులు, కార్యకర్తలకు కృషి చేయాలి.
అనంతరం బిఆర్ఎస్ నాయకులు చందు గౌడ్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే శాలువా కప్పి పార్టీ అభివృద్ధికి మరింత కృషిచేయాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, సంక్షేమ సంఘాల కార్యవర్గ సభ్యులు, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, మూసా ఖాన్, మసూద్ అలీ, మూసా ఖాన్, ఇబ్రహీం బేగ్, బోయిని మహేష్, చెట్ల వెంకటేష్, లక్ష్మణ్, నాగేష్, సాయిబాబా, చిన్నా చౌదరి, ప్రవీణ్ పోతినేని, అజయ్, సాజిద్, భాస్కర్ ముదిరాజ్, తౌర్య నాయక్, చందు గౌడ్, జునైద్, సాధుల వేణు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

గుండాల అక్టోబర్ 4 (వెలుతురు):
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగా గ్రామంలో అపెక్స్ హాస్పిటల్ హైదరాబాద్ వారి సహకారంతో ఎస్ఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిపడిగా గ్రామ సర్పంచ్ గూడెపు కుమార్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అపెక్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే. అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సీజనల్ జ్వరాలు, బ్లడ్ షుగర్ తదితర ఆరోగ్య సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. అనంతరం అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కే. అశోక్ కుమార్ మాట్లాడుతూ... మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. ఎస్ఎన్ఆర్ ఫౌండేషన్ సభ్యుడు కొంపల్లి నరేష్ మాట్లాడుతూ "ఆరోగ్యమే మహాభాగ్యం" అని అన్నారు. ప్రతిరోజూ ఉదయం యోగా చేయడం, సమయానికి నిద్రపోవడం, మంచి ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చుని తెలిపారు. జీవితం ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కడియం రాంబాబు, సోమన్న, చుక్క శీను, , ఉప సర్పంచ్, వార్డు సభ్యులు రోజా తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భవించింది తెలంగాణలోనే...

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 04:
తెలంగాణ మట్టి బిడ్డల నుంచి పొందిన స్ఫూర్తితోనే జనసేన పార్టీ పవన్ కళ్యాణ్ సారథ్యంలో ఈ రాష్ట్రంలోనే ఆవిర్భవించిందని జనసేన పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు తెలిపారు. నల్గొండబి ఖమ్మం వరంగల్ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల సన్నాహాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లో ఉమ్మడి నల్గొండ జిల్లా జనసేన పార్టీ నాయకుడు ఆముదాల పరమేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. నీళ్లు నిధులు నియామకాల కోసం 1200 మంది తెలంగాణ యువత బలిదానంతో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లపాటు బారాస అధికారంలో ఉన్నదని చెప్పారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ఆ పార్టీ ఫామ్ హౌస్ కే పరిమితమైందని తెలిపారు. యువతకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ యువతకు భృతి, విద్యార్థులకు స్కూటీలు, మహిళలకు నెలకు రూ. 2500, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లయిన కనీసం 20 శాతం హామీలు కూడా అమలు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. ఇచ్చిన హామీలు కామారెడ్డి డిక్లరేషన్ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎవరిని మోసం చేసేందుకు హామీలు ఇచ్చారు ఎందుకు అమలు చేయడం లేదు అని నిలదీశారు. ప్రజల్ని గొర్రెలు అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. బారాస ప్రభుత్వం పదేళ్ల అరణ్యవాసం, కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల అజ్ఞాతవాసం పూర్తయ్యాయని అందుకే జనసేన రంగంలోకి దిగిందని, గలమెత్తి ప్రశ్నిస్తుందని తెలిపారు. జనసేన పార్టీ అధికారంలోకి వస్తేనే తెలంగాణలో సామాజిక న్యాయం లభిస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జనసేన పార్టీకి సెమీఫైనల్స్ లాంటివని చెప్పారు ఈ ఎన్నికల్లో జనసేన ను ఎమ్మెల్సీగా గెలిపించాలని పట్టభద్రులను కోరారు. పవన్ కళ్యాణ్ వస్తున్నారని, ఆయన వస్తే ప్రళయం వస్తుందని తెలిపారు. ఉద్యమాల పురిటి గడ్డైన నల్గొండ జిల్లా నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల యుద్ధం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. జ్యోతిని వెలిగించి సమావేశాన్ని ప్రారంభించారు. జనసేన పార్టీ సభ్యత్వాన్ని అత్యధిక సంఖ్యలో చేర్పించిన వివిధ నియోజకవర్గాల నాయకులకు ఈ సమావేశ వేదికపై ఘనంగా సన్మానించారు.

జనసేన పార్టీకి రూ. లక్ష విరాళం ఇచ్చిన ఆముదాల పరమేశ్
జనసేన పార్టీ ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకుడు ఆముదాల పరమేశ్, అభ్యర్థి గడల శ్రీనివాస్ గారి ఎన్నికల ప్రచార నిమిత్తం కొరకు ఒక లక్ష రూపాయల చెక్కు విరాళాన్ని ఈ సభా వేదికపై ఆయనకు అందజేశారు. ఒక ఆశయం లక్ష్యం సిద్ధాంతం కోసం జనసేన పార్టీని స్థాపించిన పవన్ కళ్యాణ్ కు పట్టభద్రులు అండగా నిలవాలని ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ మమ్మి రెడ్డి ప్రేమ్ కుమార్, రాష్ట్ర నాయకులు మచ్చ సుధాకర్,శర్మ, శిరీష, ప్రజిత్ గౌడ్, మిర్యాల రామక్రిష్ణ, శివ కార్తీక్, లక్ష్మణ్ గౌడ్, పీక ప్రవీణ్ , మామిడాల రమేశ్,శ్రీకాంత్,లింగస్వామి, బద్రి రాజు,పాండు, ప్రవీణ్ జన సైనికులు, పాల్గొన్నారు.

అన్నింటా కాంగ్రెస్ కుంభకోణాలే ..

బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్

యాదగిరిగుట్ట , అక్టోబర్ 4 వెలుతురు
గాలి, నీరు, నేల, పాతాళం.. అన్నింటా కాంగ్రెస్ కుంభకోణాల జాతర కొనసాగుతోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సీనియర్ నేత రచ్చ శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆయన యాదగిరిగుట్టలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. గత కాంగ్రెస్ (యూపీఏ) పదేళ్ల పాలన దేశ చరిత్రలోనే అత్యంత అవినీతిమయమైన చీకటి యుగమని ఆయన మండిపడ్డారు. పంచభూతాలను సైతం వదలకుండా ప్రతి రంగంలో లక్షల కోట్ల ప్రజాధనాన్ని కాంగ్రెస్ నేతలు లూటీ చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ హయాంలో జరిగిన ప్రధాన కుంభకోణాలను ఆయన ప్రస్తావించారు: వివరాలు ఆయన మాటల్లోనే...గాలిలో 2+ స్పెక్ట్రమ్ స్కామ్ (సుమారు ?1.76 లక్షల కోట్లు) టెలికాం తరంగాల కేటాయింపుల్లో నిబంధనలను తుంగలో తొక్కి తమ అనుకూల కార్పొరేట్లకు దోచిపెట్టారు. దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని టెలికాం కుంభకోణానికి పాల్పడ్డారు. భూగర్భంలో బొగ్గు కుంభకోణం (కోల్‌గేట్ – సుమారు ?1.86 లక్షల కోట్లు): భూగర్భంలో ఉన్న సహజ వనరులైన బొగ్గు బ్లాకులను ఎలాంటి వేలం పాటలు లేకుండా, పారదర్శకత లేకుండా కాంగ్రెస్ పెద్దలు అడ్డగోలుగా పంచిపెట్టారు. ఆకాశంలో అగస్టా వెస్ట్‌ల్యాండ్ ఛాపర్ స్కామ్ (?3,600 కోట్లు): వీఐపీల ప్రయాణం కోసం కొనుగోలు చేయాల్సిన హెలికాప్టర్ల ఒప్పందంలో భారీగా ముడుపులు తిని రక్షణ రంగాన్ని కూడా భ్రష్టు పట్టించారు. నీటిలో సబ్‌మెరైన్ కుంభకోణం (స్కార్పియన్ స్కామ్): దేశ సముద్ర రక్షణకు సంబంధించిన జలాంతర్గాముల కొనుగోళ్లలో సైతం దళారులను పెట్టి కమీషన్లు దండుకున్నారు. క్రీడల్లో కామన్వెల్త్ గేమ్స్ స్కామ్ (సుమారు ?70,000 కోట్లు): ప్రపంచం ముందు భారతదేశ పరువు తీసేలా స్టేడియాల నిర్మాణం నుంచి టాయిలెట్ పేపర్ రోల్స్ కొనుగోళ్ల వరకు ప్రతి దాంట్లో అవినీతికి తెగబడ్డారు. రక్షణ రంగంలో టట్రా ట్రక్కుల కుంభకోణం: సైనికులకు అవసరమైన ట్రక్కుల సరఫరాలో కూడా నాసిరకం పరికరాలను ఎక్కువ ధరకు కొని సైనిక సంక్షేమాన్ని పణంగా పెట్టారు. ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ స్కామ్: కార్గిల్ అమరవీరుల కుటుంబాలు, సైనికుల కోసం కేటాయించిన భూములను కబ్జా చేసి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, మంత్రులు, బంధువులు ఫ్లాట్లు పంచుకున్నారు అని ఆయన కాంగ్రెస్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.
మోదీ పాలనలో పారదర్శకత – సంక్షేమం:
2014 తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గడిచిన కాలంలో ఒక్క పైసా అవినీతికి తావులేకుండా పాలన సాగుతోందని రచ్చ శ్రీనివాస్ పేర్కొన్నారు. జన్ ధన్, ఆధార్, లక్షల కోట్ల రూపాయల సంక్షేమ నిధులు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి వెళ్తున్నాయి. గతంలో ఉన్న దళారీ వ్యవస్థను మోదీ సర్కారు పూర్తిగా సమాధి చేసింది. పీఎం కిసాన్, ఉచిత రేషన్, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల గ్యాస్, పక్కా గృహాల నిర్మాణం వంటి పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజాధనం సద్వినియోగం అవుతుండ టాన్ని చూసి జీర్ణించుకోలేకనే కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మోదీపై విషం చిమ్ముతున్నాయని ఆయన ఆరోపించారు. విపక్షాల అసత్య ప్రచారాలను ప్రజలు ఏనాడో తిరస్కరించారని, ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మానుకోకపోతే ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని రచ్చ శ్రీనివాస్ హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో కూడా కేంద్రంలో బిజెపి తిరిగి అధికారంలోకి రావడమే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో కూడా బిజెపి జెండా ఎగురవేయడం ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నిర్మాణాలు లేకుండా ఇంటి నెంబర్లు ఎలా కేటాయిస్తారు?

బిజెపి పట్టణ అధ్యక్షుడు కర్రే ప్రవీణ్

యాదగిరిగుట్ట , అక్టోబర్ 4 వెలుతురు
యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని యాదగిరిపల్లి లోని మూడో వార్డులో ఎలాంటి నిర్మాణం లేని 4 ఎకరాల వ్యవసాయ భూమిలో 3 ఇంటి నెంబర్లు అక్రమంగా కేటాయించారని యాదగిరిగుట్ట బిజెపి పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్ ఆరోపించారు. ఈ అంశంపై ఆయన వాస్తవాలు తెలుసుకునేందుకు బిజెపి నాయకులు కార్యకర్తలతో కలిసి పట్టణ పరిధిలోని యాదగిరి పల్లి లో గల మూడో వార్డులో ఖాళీ స్థలంలో నిర్మాణాలు లేకుండా ఇంటి నెంబర్లు కేటాయించిన ప్రదేశాన్ని ఆదివారం సందర్శించారు. అక్కడ వాస్తవాలు ఏమిటి అనే విషయాలను స్థానికులను, పలువురిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ లో మొన్న మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ మాది ఆదర్శ మున్సిపాలిటీ ఎక్కడ కూడా అవినీతికి తావులేదు అని అన్నారని మరి ఈ విషయానికి వారు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పది రోజుల్లో దమ్ముంటే బిజెపి పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్ మా అవినీతిని నిరూపించాలని చైర్ పర్సన్ చాలెంజ్ చేశారని గుర్తు చేశారు. ఈ ఛాలెంజ్ ను తాను స్వీకరిస్తున్నానని అన్నారు. అందుకే ఈరోజు మేము యాదగిరి పల్లి లోని ఎలాంటి నిర్మాణాలు లేని 4 ఎకరాల భూమిలో ఖాళీ ప్రదేశానికి మూడు ఇంటి నెంబర్ లు ఆగస్ట్ నెల 7 వ తేదీన ఇప్పుడు ఉన్న కమిషనర్ బర్ల శ్రీనివాస్ కేటాయించడం జరిగింది అని మీడియాకు వివరించారు. ఎలాంటి అనుమతులు లేని అలాగే ఖాళీ ప్రదేశానికి ఏ విధంగా ఇంటి నెంబర్ కేటాయిస్తారో

చైర్పర్సన్ కమిషనర్ తక్షణమే పట్టణ ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎవరి ప్రోద్బలం తో కమిషనర్ ఈ యొక్క ఇంటి నెంబర్లను కేటాయించాలని అన్నారు. పెద్ద ఎత్తున డబ్బులు తీసుకొని ఇంటి నెంబర్ లు ఇచ్చినట్టు స్థానికంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. అన్ని వివరాలు సరిగ్గా ఉన్నా కూడా అనేక కారణాలు చెబుతూ ఇబ్బంది పెట్టే మున్సిపల్ అధికారులు ఈ ఖాళీ ప్రదేశానికి ఏ విధంగా ఇంటి నంబర్ లు కేటాయించారని ప్రశ్నించారు. కావున తక్షణం ఇంటి నెంబర్లను రద్దు చేయాలని, అక్రమంగా నిర్మాణాలు లేని స్థలానికి ఇంటి నెంబర్లు కేటాయించిన కమిషనర్ పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే రకంగా వచ్చే పది రోజుల్లో ప్రతిరోజు యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో జరుగుతున్న అవకతవకలు అవినీతిపై ఆధారాలతో ప్రజల ముందుకు వస్తామని కర్రె ప్రవీణ్ ప్రకటించారు. ఈ కార్యక్రమం లో బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు చిత్తర్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి పలుగుల సురేష్, వంశీ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి భారీ అల్మారా బహుకరణ

దాత పద్మనాభం శివకుమార్, స్వర్ణలత దంపతులను అభినందించిన అధికారులు

యాదగిరిగుట్ట అక్టోబర్ 4 వెలుతురు
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి స్థానిక భక్తుడు , విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు పద్మనాభం మారుతి చారి ఆయన కుమారుడు పద్మనాభం శివకుమార్ చారి స్వర్ణలత దంపతులు భారీ అల్మారాను బహూకరించారు. గత కొన్ని రోజులుగా ప్రత్యేకంగా తయారు చేయించిన ఈ అల్మారాను ఆదివారం యాదగిరిగుట్ట దేవస్థానం అధికారులకు కొండపైన పద్మనాభం శివకుమార్ చారి దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారిని ప్రత్యేకంగా అభినందించి పద్మనాభం శివకుమార్ చారి స్వర్ణలత దంపతులను ప్రత్యేకంగా సత్కరించారు.

స్వామివారి తీర్థప్రసాదాలు అందించి అర్చకులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అల్మారా దాత స్థానిక భక్తుడు పద్మనాభం శివకుమార్ చారి మాట్లాడుతూ తన తల్లి గారైన కీర్తిశేషులు పద్మనాభం చంద్రకళ గారి జ్ఞాపకార్థం ఈ అల్మారాను దేవస్థానానికి అందించానని తెలిపారు. స్వామివారి సేవలో తన వంతు పాత్రను పోషించడం తనకు ఆనందంగా ఉందని దాత పద్మనాభం శివకుమార్ చారి అన్నారు. ఇదే రకంగా మునుముందు కూడా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి సేవలో ముందుకు కొనసాగుతానని తెలిపారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు తమ ఇంటి ఇలవేల్పు అని కోరిన కోరికలు తీర్చే స్వామివారి సేవలో నిరంతరం కొనసాగడం ఎంతో ఆనందకరమని అన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు మాట్లాడుతూ కోరిన వెంటనే అల్మారా ను మంచి నాణ్యతతో తయారు చేయించి దేవస్థానానికి అందించిన పద్మనాభం శివకుమార్ చారి స్వర్ణలత దంపతులను అభినందిస్తున్నామని తెలిపారు. పద్మనాభం శివ కుమార్ చారి స్వర్ణలత దంపతులను ఆదర్శంగా తీసుకొని స్వామివారి సేవలో దాతలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని అధికారులు కోరారు.

పట్టభద్రులు ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు
రాచకొండ బాలరాజు గౌడ్ మోత్కూర్

మోత్కూర్, అక్టోబర్ 4,వెలుతురు న్యూస్ :
నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో అర్హత కలిగిన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మోత్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్ తెలిపారు . అర్హులైన పట్టభద్రులు సంబంధిత ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నమోదు ప్రక్రియపై అవగాహన కలిగి, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గంలో అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం--18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి. నమోదుకు చివరి తేదీ అక్టోబర్ 6 వ తారీఖు అని గతంలో పట్టభద్రుల ఓటర్‌గా ఉన్నవారు కూడా కొత్తగా నమోదు చేసుకోవాలి అన్నారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 06 నవంబర్ 2026లోపు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.

మున్సిపాలిటీ 11వ వార్డ్‌లో కరెంట్ స్తంభాలు వేయించిన కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న గౌడ్

మోత్కూర్, అక్టోబర్ 4,వెలుతురు న్యూస్ :
మోత్కూర్ మున్సిపాలిటీ పోతాయిగడ్డ 11 వ వార్డ్ ఏరియాలో మున్సిపల్ కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న గౌడ్ పలు కాలనీలలో 10 కరెంటు స్తంభాలను వేయించి వాటికి వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో లైన్మెన్ మచ్చ గిరి,సిబ్బంది నయీమ్,సురేందర్ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

చిట్టీల పేరుతో కోట్ల దందా

- బాధితుల నుండి మొత్తం రూ.6.24 కోట్లు..
- ప్రభుత్వ టీచర్, అతడి భార్య అరెస్ట్
- సూర్యాపేట డిఎస్పి ప్రసన్న కుమార్

సూర్యాపేట, వెలుతురుఅక్టోబర్ 04
చిట్టీలు, డెయిలీ కలెక్షన్లు, అధిక రాబడి పేరుతో ప్రజల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడిన కేసులో ఇద్దరిని చివ్వెంల పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట డివిజన్ డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రసన్న కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ జి. రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ వి. మహేష్ పాల్గొన్నారు. చివ్వెంల మండలం యెనగండి తండాకు చెందిన బానోత్ రాజు (44), ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తన భార్య బానోతు అనూష (33) సహకారంతో 2015 నుంచి చిట్టీల వ్యాపారం, డెయిలీ కలెక్షన్లు నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని డీఎస్పీ తెలిపారు. అధిక రాబడులు, నెలవారీ చెల్లింపులు ఇస్తామని నమ్మించి ప్రజలు, తోటి ఉద్యోగులు, పరిచయస్తుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించారని, భూములు కొనుగోలు చేస్తున్నట్లు నమ్మించి కూడా నగదు తీసుకున్నారని, చిట్టీల గడువు పూర్తైనా డబ్బులు తిరిగి చెల్లించకుండా మోసం చేశారని పేర్కొన్నారు. సేకరించిన మొత్తంలో

కొంత భాగాన్ని వ్యక్తిగత అవసరాలు, ఆస్తుల కొనుగోలుకు వినియోగించగా, మిగిలిన మొత్తాన్ని సుమారు 500-600 మందికి రూ. 10వేల నుంచి రూ. 2 లక్షల వరకు నెలకు 10 శాతం వరకు అధిక వడ్డీకి అప్పుగా ఇచ్చినట్లు గుర్తించామన్నారు. ఆర్థిక వివరాలు : - బాధితుల నుంచి సేకరించిన మొత్తం : రూ. 6,24,50,000/- తిరిగి చెల్లించిన మొత్తం: రూ. 3,18,54,000/- ఇంకా చెల్లించాల్సిన బకాయి : రూ. 3,05,96,000/- నిందితుల నుంచి స్వీకరించిన మొత్తాలు, తిరిగి చెల్లింపులు, ప్రామిసరీ నోట్లు, చెక్కులు, బాండ్లు, భూముల లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. అరెస్ట్ అయిన నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దంపతుల చేతిలో మోసపోయిన ఇతర బాధితులు ఎవరైనా ఉంటే ఆధారాలతో చివ్వెంల పోలీసులను సంప్రదించాలని కోరారు. అధిక రాబడుల పేరుతో ప్రజలను మోసగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మున్సిపాలిటీ అంగన్వాడీ కేంద్రం -8లో పోషణ మాస వారోత్సవాలు

మోత్కూర్, అక్టోబర్ 4, వెలుతురు న్యూస్ :
పోషణ మాస వారోత్సవాలు శనివారం నాడు మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన అంగన్వాడీ కేంద్రం -8 లో జరిగాయి. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుమలత మాట్లాడుతూ విటమిన్లు,పోషక విలువలు కలిగిన బాలామృతంను,పాలు, గుడ్లను పిల్లలకు అందించాలని అన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఇందిరా, ఆశ వర్కర్ భాగ్య, తల్లులు, గర్భిణీ స్త్రీలు,పిల్లలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడతాయి

బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి అక్టోబర్ 04: ఆదివారం సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ విజయదుర్గా కాలనీ (జీపీఆర్) లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ....సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా కాలనీలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయవచ్చని, కాలనీలోకి వచ్చి వెళ్లే రహదారులను గుర్తించి సీసీ కెమెరా ఏర్పాటు ద్వారా సేఫ్ అండ్ స్మార్ట్ కాలనీగా విజయదుర్గ కాలనీ నిలుస్తుంది అన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పోలీసులతో కలిసి స్ట్రాటజిక్ పాయింట్లను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా కాలనీ రక్షణ మరింత బలపడుతుందన్నారు. అదే విధంగా రోజురోజుకు పెరుగుతున్న జనాభా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో త్రాగునీటి, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా విజయ దుర్గా కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం. ఈ కార్యక్రమంలో పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, రాము రాథోడ్, డీఈ పాపమ్మ, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ అధికారులు, మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, విజయ దుర్గ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. రమణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్యాంసింగ్, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, సభ్యులు ఎస్. రాకేష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, సుమన్, వైయస్, బి. సందీప్, విశ్వనాథ రెడ్డి, వినోద్, శివ నాగరాజు, యుగంధర్, దుర్గాప్రసాద్, మాజీ కార్పొరేటర్లు రవి కిరణ్, బాలాజీ నాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, నాయకులు సాంబశివరెడ్డి, శ్రీకర్ గుప్తా, మధుసూదన్ రెడ్డి, చంద్రయ్య, బొబ్బ శ్రీను, పోతినేని ప్రవీణ్, యశ్వంత్, మహమ్మద్ సలీం, మహిళా నాయకురాలు లతా రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యాత్మ తీర్థ స్వామి శిష్య బృందం ఆరోగ్యం కోసం ప్రత్యేక జపం

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 04: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రామలింగేశ్వర మందిరంలో గాయత్రీ భజన మండలి, అఖండ హరినామ సంకీర్తన సభ్యులు ప్రత్యేక జప కార్యక్రమం నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ సత్యాత్మ తీర్థ స్వామి వారి శిష్య బృందానికి త్వరగా ఆరోగ్యం చేకూరాలని, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షిస్తూ "అచ్యుతాయ నమః, అనంతాయ నమః, గోవిందాయ నమః" మంత్రాలను జపించారు. అదేవిధంగా ఇటీవల 180 మంది ప్రాణాలను కాపాడిన పైలట్ స్మిత్ మచ్చార్ ఆరోగ్యం మెరుగుపడి, తిరిగి విధుల్లో చేరాలని కోరుతూ "ఓం నమశ్శివాయ" మంత్రాన్ని జపించి పరమేశ్వరుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ జ్యోషి, బాబురావు జోషి, శ్రీకాంత్ జోషి, వసంత్ జోషి, గణేష్ జోషి, దిగంబర్ రావు, వెంకటేష్ జోషి, రాఘవాచారి, ప్రభావతిబాయ్, పుష్పవతి, జయమంగళ, రాధా, సుజాత, అంబుజ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం ఎన్నిక రద్దు

జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్

తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 04: కరీంనగర్ కార్పొరేషన్ రెండో డివిజన్ తీగలగుట్టపల్లిలోని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని రద్దు చేస్తున్నట్లు తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన నూతన కమిటీ బీ ఆర్ఎస్ ప్యానెల్ గా చెప్పుకుంటూ స్థానిక పార్టీ ముఖ్య నాయకులను కలిసి, సన్మానం అందుకున్నట్లు సోషల్ మీడియాలో పలు చోట్ల పోస్ట్ చేయడం జరిగింది. కుల సంఘం ఎన్నికలకి రాజకీయ పార్టీలను జోక్యం చేయడమనేది సంఘం ఎన్నికల నిబంధనలకు విరుద్ధం. అసలు ఈ ఎన్నిక ప్రక్రియలో ఏ ప్యానెల్ లేకున్నా.. బీజేపీ ప్యానెల్ పై బీ ఆర్ఎస్ ప్యానెల్ గెలిచిందని చెప్పడం సరైన పద్ధతి కాదు. ఈ విషయంపై జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీ వెంటనే విచారణ జరిపించింది. తెలంగాణ అంబేద్కర్ కుల సంఘం ఎన్నికలకి రాజకీయ పార్టీలకు ఎలాంటి సంబంధం లేదు. ఇలా సంఘం ప్రతిష్టకు భంగం కలిగించిన నూతన కమిటీపై క్రమశిక్షణ చర్యల్ని తీసుకోవాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు నూతన కమిటీ సకాలంలో వివరణ ఇవ్వకుండా జాప్యం చేయడమే కాకుండ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినందుకు చర్యగా... ఎన్నికైన కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగిందని జిల్లాధ్యక్షుడు ప్రభాకర్ పేర్కొన్నారు.

బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు తిరుపతి నాయక్

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 04: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గుగులోతు తిరుపతి నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి నాయక్ మాట్లాడుతూ తన నియామకానికి ఎంతగానో సహకరించి, ఆశీస్సులు అందించిన కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ,బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు సూచనల మేరకు, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన బిజెపి రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు నేనావత్ రవి నాయక్ కి , సహకరించిన బిజెపి నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా, గిరిజన తండాలు గూడేలు ఎదుర్కొంటున్న సమస్యలపై , బిజెపి ఎస్టి మోర్చా బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని చెప్పారు. భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, పార్టీ అప్పగించిన బాధ్యతలను సర్ధకతతో నిర్వహిస్తానని పునరుద్ఘాటించారు

నూతన సీఐ నర్సింలుకు బీజేపీ నాయకుల సన్మానం

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 04: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండలం హద్నూర్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన నర్సింలును బీజేపీ న్యాల్కల్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సీఐ నర్సింలు ఆధ్వర్యంలో హద్నూర్ పరిధిలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడి, ప్రజలకు పోలీసు సేవలు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్, ప్రధాన కార్యదర్శి భీమన్న యాదవ్, నాయకులు శ్రీకాంత్ ముదిరాజ్, నర్సింలు, వీరారెడ్డి, వీరన్న పాటిల్, రాజిరెడ్డి, కాశీనాథ్ పాటిల్, ప్రశాంత్, బీజేవైఎం మండల అధ్యక్షుడు విష్ణుపాటిల్, ఓబీసీ మోర్చా నాయకుడు రాహుల్ పాటిల్, జిల్లా కిసాన్ మోర్చా నాయకుడు శరణయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌లను మాత్రమే బాధ్యులుగా చూపడం సరికాదు

- పంచాయతీ వ్యవస్థలో అందరి బాధ్యతలను పరిశీలించాలి
- మెమోపై కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు

ఆకుబత్తిని విజయ్ కుమార్ అభ్యంతరం

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 04: తెలంగాణ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ ఉపాధి కమిషనర్ కార్యాలయం నుండి 01-10-2026న జారీ చేసిన మెమోలో ఉపసర్పంచ్‌లు గ్రామపంచాయతీ చెక్కులపై సంతకాలు చేయడం లేదనే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ, వారిపై విచారణ మరియు చర్యలకు సంబంధించిన ఆదేశాలు ఇవ్వడం పట్ల కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. గ్రామపంచాయతీ పరిపాలన అనేది సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి మరియు సంబంధిత అధికారుల సమిష్టి బాధ్యతతో నడిచే వ్యవస్థ. అలాంటప్పుడు గ్రామపంచాయతీలో చెల్లింపులు ఆలస్యం అవుతున్న ప్రతిసారి ఉపసర్పంచ్‌లే తప్పు చేస్తున్నట్లు భావించే విధంగా మెమో ఉండటం సరికాదు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 70(4) ప్రకారం గ్రామపంచాయతీ నిధులకు సంబంధించిన చెక్కులపై సర్పంచ్ మరియు ఉపసర్పంచ్ జాయింట్‌గా సంతకం చేయాల్సిన బాధ్యత ఉంది. కాబట్టి ఉపసర్పంచ్ తన బాధ్యతను నిర్వర్తించడంతో పాటు, తనకు సమర్పించే ప్రతి చెక్కు మరియు ఖర్చుకు సంబంధించిన బిల్లులు, తీర్మానాలు, పరిపాలనా అనుమతులు, నిధుల లభ్యత, పనుల వాస్తవ పరిస్థితి, నిబంధనల అనుసరణ వంటి అంశాలను పరిశీలించే హక్కు మరియు బాధ్యత కూడా ఉండాలి. అవకతవకలు లేదా నిబంధనలకు విరుద్ధమైన ఖర్చులపై ఉపసర్పంచ్ ప్రశ్నిస్తే దానిని "చెక్కుపై సంతకం చేయడానికి నిరాకరించడం"గా పరిగణించడం సరికాదు. అదేవిధంగా, ఒక చెక్కు లేదా ఖర్చును ఉపసర్పంచ్ ఆమోదించకపోవడానికి చెల్లుబాటు అయ్యే కారణం ఉందా లేదా అన్నది పూర్తి వివరాలతో, నిష్పక్షపాతంగా విచారణ చేసిన తర్వాతే నిర్ణయించాలి. మెమోలో కూడా ఆరోపణ వచ్చినప్పుడు జిల్లా కలెక్టర్ విచారణ చేయాలని, నిరాకరణకు చెల్లుబాటు అయ్యే కారణం లేదని నిరూపితమైన తర్వాతే చర్య తీసుకోవాలని పేర్కొంది.

ఉపసర్పంచ్‌లపై మాత్రమే ఎందుకు దృష్టి?

గ్రామపంచాయతీ నిధుల ఖర్చు విషయంలో

- సర్పంచ్ బాధ్యత ఏమిటి?
- పంచాయతీ కార్యదర్శి బాధ్యత ఏమిటి?
- సంబంధిత పీఆర్/పీఆర్‌ఐ అధికారుల పర్యవేక్షణ ఏమిటి?
- తీర్మానం మరియు పరిపాలనా అనుమతులు సక్రమంగా ఉన్నాయా?
- చేసిన పనులు వాస్తవంగా జరిగాయా?
- బిల్లులు మరియు వౌచర్లు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా?
- నిధుల లభ్యత ఉందా?
- ఖర్చు చేసిన విధానం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉందా?
- అనే అంశాలన్నింటినీ కూడా సమగ్రంగా పరిశీలించాలి.

ఒకవైపు ఉపసర్పంచ్‌లు ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులుగా గ్రామ అభివృద్ధి కోసం పనిచేయాలని ప్రభుత్వం కోరుతూనే, మరోవైపు తమ చట్టబద్ధమైన బాధ్యతలో భాగంగా ప్రశ్నించినప్పుడు వారినే లక్ష్యంగా చేసుకోవడం సముచితం కాదు.

చట్టాన్ని గౌరవిస్తాం -- కానీ ఏకపక్ష చర్యలను అంగీకరించం

ఉపసర్పంచ్‌లు చట్టాన్ని గౌరవిస్తారు. గ్రామపంచాయతీ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, ప్రజా సేవలు ఎక్కడా నిలిచిపోకూడదనే విషయంలో మాకు కూడా పూర్తి బాధ్యత ఉంది. అయితే చట్టబద్ధమైన కారణాలతో ఒక ఉపసర్పంచ్ చెక్కుపై సంతకం చేయకుండా ఉంటే, దానిని విధుల నిర్లక్ష్యంగా లేదా అధికార దుర్వినియోగంగా పరిగణించకూడదు.

తెలంగాణ హైకోర్టు కూడా ఒక కేసులో కేవలం ఒకసారి చెక్కుపై సంతకం చేయకపోయిన సందర్భంలో ఆరు నెలల సస్పెన్షన్ సమర్థనీయం కాదని పేర్కొంది.

కాబట్టి ప్రభుత్వం ఉపసర్పంచ్‌లపై చర్యలకు మాత్రమే పరిమితం కాకుండా, గ్రామపంచాయతీ పరిపాలనలోని అన్ని స్థాయిల బాధ్యతలను సమానంగా పరిశీలించే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలి.

మా డిమాండ్లు

1. 01-10-2026 మెమోను ఉపసర్పంచ్‌లపై ఏకపక్షంగా అమలు చేయకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి.
2. చెక్కు సంతకం విషయంలో చెల్లుబాటు అయ్యే కారణాలను నిర్వచించాలి.
3. విచారణ సమయంలో ఉపసర్పంచ్‌కు సంపూర్ణ వివరణ ఇచ్చే అవకాశం కల్పించాలి.
4. సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి మరియు సంబంధిత అధికారుల సమిష్టి బాధ్యతను నిర్ధారించాలి.
5. నిబంధనలకు విరుద్ధమైన ఖర్చులను ఉపసర్పంచ్ ప్రశ్నించిన సందర్భంలో ఆయనపై చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలి.
6. చెక్కులు సమర్పించిన తేదీ, సంబంధిత బిల్లులు, తీర్మానాలు, అనుమతులు తదితర వివరాలతో పారదర్శకమైన ప్రక్రియను అమలు చేయాలి.
7. రాష్ట్రంలోని ఉపసర్పంచ్‌ల ప్రతినిధులతో ప్రభుత్వం వెంటనే సమావేశం నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపాలి.

"ఉపసర్పంచ్‌లు అభివృద్ధికి అడ్డంకులు కాదు -- గ్రామపంచాయతీలలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం పనిచేసే ప్రజాప్రతినిధులు."

నిరుద్యోగ యువతకు ఉచిత పోలీస్ కోచింగ్

- అక్టోబర్ 10 నుంచి తరగతులు ప్రారంభం..
- 3 నుంచి 7 వరకు రిజిస్ట్రేషన్...
- వివరాలు వెల్లడించిన పట్టణ ఎస్ఐ లవ కుమార్...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 04 పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ అందించేందుకు సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాల్లో ఉచిత పోలీస్ కోచింగ్ నిర్వహించనున్నట్లు జహీరాబాద్ పట్టణ ఎస్ఐ లవ కుమార్ తెలిపారు. జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో రిక్రూట్‌మెంట్ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా అభ్యర్థులకు అవసరమైన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కోచింగ్‌లో భాగంగా అభ్యర్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను పోలీస్ శాఖ సిబ్బంది, ఫెసిలిటేటర్ల సహకారంతో అందిస్తామని చెప్పారు. అలాగే రాత పరీక్షకు సంబంధించిన కోచింగ్‌తో పాటు ఫిజికల్ ట్రైనింగ్ కూడా అందించనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కోచింగ్‌లో పాల్గొనదలచిన అభ్యర్థుల కోసం అక్టోబర్ 3 నుంచి 7వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అక్టోబర్ 10వ తేదీ నుంచి రెగ్యులర్ కోచింగ్ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. అర్హత ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాల సాధనకు కృషి చేయాలని ఎస్ఐ లవ కుమార్ సూచించారు.

తెలంగాణ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ నూతన కార్యవర్గం ఎన్నిక

బషీర్బాగ్ వెలుతురు 4 అక్టోబర్ : తెలంగాణ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ -- హైదరాబాద్‌కు 2026--2029 కాలానికి నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఎన్నికల అధికారి, TGOsµ అసోసియేషన్ సిటీ బ్రాంచ్ అధ్యక్షులు మరియు ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ శ్రీ జి. వెంకటేశ్వర్లు 04-10-2026న ఎన్నికల ఫలితాలను అధికారికంగా ప్రకటించారు.

అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా శ్రీ హరికోట్ల రవి (DR) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షురాలిగా శ్రీమతి తస్లీమా మహమ్మద్ (ARC, WGL), ఉపాధ్యక్షులుగా శ్రీ ఎ. అరవింద్ బాబు, శ్రీ పి. మధుబాబు, శ్రీ ఎం. చంద్రశేఖర్ రెడ్డి, శ్రీ ఎ. రవీంద్ర బాబు, శ్రీ ఎం. హమీద్, శ్రీ బి. మాధవ్, శ్రీమతి కె. జ్యోతి రెడ్డి ఎన్నికయ్యారు.

జనరల్ సెక్రటరీగా శ్రీ జి. నరేంద్ర ఎన్నిక కాగా, జాయింట్ సెక్రటరీలుగా శ్రీ డి. సందీప్ కుమార్, శ్రీ ఎం. పురియా, శ్రీ ఎం.డి. మక్సూద్ అలీ, శ్రీ ఎన్. అప్పారావు, శ్రీ కె. అంజనేయులు, శ్రీ కె. సాయి వికాస్, శ్రీమతి డి. జ్యోతి ఎన్నికయ్యారు. కోశాధికారిగా శ్రీ వి. సీతారాం, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శ్రీ బి. శ్రీనివాస్, శ్రీ జి. రామ్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీలుగా శ్రీ బి. సమ్మయ్య, శ్రీ బి. ఆనంద్, ఆఫీస్ సెక్రటరీలుగా శ్రీ బి. సురేష్, శ్రీ టి. నరేష్, స్పోర్ట్స్ సెక్రటరీలుగా శ్రీ పి. చంద్రశేఖర్, శ్రీ బి. బాలరాం ఎన్నికయ్యారు. అలాగే ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా శ్రీ శేషగిరి చంద్, శ్రీమతి ఎ. విజయజ్యోతి, శ్రీ బి. సైదులు, శ్రీ ఎ. మల్లికార్జున్, శ్రీ ఎ. శ్రీధర్ రాజు, శ్రీ ఆర్. రాము, శ్రీ బి. సురేంద్ర నాయక్ తదితరులు ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గం 4-10-2026 నుంచి 2026--2029 కాలానికి లేదా తదుపరి ఎన్నికలు జరిగే వరకు పదవుల్లో కొనసాగుతుందని ఎన్నికల అధికారి ప్రకటించారు.

ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఏలూరి శ్రీనివాస రావు నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి అభినందనలు తెలియజేస్తూ, ప్రభుత్వ అధికారులుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులు నిర్వర్తిస్తూనే ప్రజలకు సేవ చేయడంతో పాటు ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ బి. శ్యామ్ మాట్లాడుతూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అధికారులందరూ ఐకమత్యంతో పనిచేస్తూ కేంద్ర సంఘం సూచనలు, ఆదేశాలకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణలో చురుకుగా పాల్గొనాలని కోరారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి TGOsµ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, వివిధ జిల్లా శాఖల అధ్యక్ష, కార్యదర్శులు మరియు గెజిటెడ్ అధికారుల సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, శాఖ అభివృద్ధి మరియు అధికారుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమర్థవంతంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ రెడ్డి, సహదేవ్, స్థిత ప్రజ్ఞ, ప్రణయ్ కుమార్, సందీప్, మాధవ్, వెంకటయ్య ఎంబి కృష్ణ యాదవ్, డాక్టర్ కే రామారావు, శ్రీనివాస్ మూర్తి, నిరంజన్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, నూతన కంటి వెంకట్, శ్రీరామ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

భావన నగర్‌లో నివాసుల హక్కుల పరిరక్షణ జేఏసీ ఏర్పాటు

హక్కులు, పారదర్శకతపై కాలనీవాసుల చర్చ

ఉప్పల్, అక్టోబర్ 04(వెలుతురు): కాప్రా సర్కిల్ ఏ.ఎస్ రావు నగర్ డివిజన్ శ్రీ భావన ఋషి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, భావన నగర్ నివాసుల హక్కులు, పారదర్శకత, ఐక్యత మరియు కాలనీ అభివృద్ధి లక్ష్యంగా 'శ్రీ భావన ఋషి నివాసుల హక్కుల పరిరక్షణ సంయుక్త కార్యాచరణ కమిటీ' ఆధ్వర్యంలో తొలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలనీలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను, సమస్యలను తెలియజేశారు. వ్యక్తిగత వ్యతిరేకత కాకుండా నివాసుల హక్కులను ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా పరిరక్షించడమే తమ ప్రధాన ధ్యేయమని నిర్వాహకులు స్పష్టం చేశారు.

సభ్యత్వాలు, రికార్డుల్లో స్పష్టతకు డిమాండ్

అర్హులైన నివాసులకు సొసైటీ బైలాస్ ప్రకారం పారదర్శకంగా హౌసింగ్ సొసైటీ సభ్యత్వం కల్పించాలని సమావేశం కోరింది. శ్రీ మార్కండేయ స్వామి ఆలయ సభ్యత్వం, దాతల భాగస్వామ్యం, కాలనీ అధికారిక పేరు, సొసైటీ రికార్డులు, వెల్ఫేర్ అసోసియేషన్ మరియు సీనియర్ సిటిజన్స్ కార్యాలయ స్థలాల వినియోగ హక్కులపై స్పష్టమైన పత్రాలు అందుబాటులో ఉంచాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. బెటర్మెంట్ ఛార్జీల చెల్లింపుల్లోనూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

జేఏసీఅడ్-హాక్ కన్వీనర్‌గా వీరా రెడ్డి ఎంపిక

కాలనీలోని ప్రతి కుటుంబానికి సమాన గౌరవం, భాగస్వామ్యం ఉండాలని, పరస్పర మర్యాదతో కూడిన వాతావరణాన్ని పెంపొందించుకోవాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా జేఏసీ అడ్-హాక్ కన్వీనర్‌గా వీరా రెడ్డికి సభ్యులు పూర్తి మద్దతు తెలిపారు. నవీన్ గౌడ్, సుధాకర్, కిషోర్ రెడ్డి, వేణుగోపాల్, సదానంద గౌడ్, మురారి, రవీంద్ర రెడ్డి, వీరా రెడ్డి, డాక్టర్ సూర్యప్రకాశ్, సాయి చరణ్ రెడ్డి, శివారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, భూపేశ్ నాయుడు, శామ్ సింగ్, దీపికా కమలాకర్, శ్రీనివాస్ గుప్తా, శ్రీనివాస్ గౌడ్, శ్రీహరి తదితర కాలనీ ప్రముఖులు ఈ సమావేశంలో పాల్గొని తమ సూచనలు అందించారు. అందరికీ సమాన హక్కులు, పారదర్శకతే ధ్యేయంగా ముందుకుసాగుతామని సభ్యులు వెల్లడించారు.

రంగా ప్రసాద్‌కు ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డు

హైదరాబాద్ : అక్టోబర్ (వెలుతురు) హైదరాబాద్‌కు చెందిన వర్షపు నీటి సంరక్షణ నిపుణుడు రంగా ప్రసాద్కు సస్టైనబిలిటీ విభాగంలో ప్రతిష్టాత్మకమైన ప్రైడ్ ఆఫ్ తెలంగాణ అవార్డు లభించింది. ఎ×జుజ సిటీలోని ఎ×జజ కన్వెన్షన్ సెంటర్, నోవోటెల్ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డా. రెడ్డీస్ ల్యాబొరేటరీస్ జజుూ ఎం.వి. రమణ ఈ అవార్డును అందజేశారు. రంగా ప్రసాద్ 2009 నుంచి పర్యావరణ అంశాలపై పనిచేస్తున్నారు. 2016 నుంచి హైదరాబాద్‌లో వర్షపు నీటి సంరక్షణను చురుకుగా ప్రోత్సహిస్తున్నారు. **HydRain Harv**వర్ సంస్థ ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాల్లో వందలాది వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్ నిర్మాణాలపై పనిచేశారు. పాతబడిపోయిన, నిర్లక్ష్యానికి గురైన వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను పునరుద్ధరించి, వాటి నిర్వహణపై కూడా ఆయన ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. భవిష్యత్తులో కాలనీ వారీగా భూగర్భ జలాల రీచార్జ్ ప్రాజెక్టులు, శుద్ధి చేసిన గ్రే వాటర్‌ను భూగర్భ జలాల రీచార్జ్‌కు ఉపయోగించేలా ఫిల్ట్రేషన్‌పై పరిశోధన, అలాగే వర్షపు నీటి సంరక్షణ రంగంలో మరింత మంది నిపుణులకు శిక్షణ ఇవ్వాలని రంగా ప్రసాద్ లక్ష్యంగా పెట్టుకున్నారు. హైదరాబాద్‌లో నీటి వనరుల సుస్థిర భవిష్యత్తు కోసం ప్రజల భాగస్వామ్యంతో పాటు వృత్తిపరమైన నైపుణ్యం కూడా ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడుతున్నారు. వెబ్‌సైట్: **www.hydrainharvest.org**

కోర్టుల తీర్పులను, రాజ్యాంగాన్ని ప్రశ్నించడం సిగ్గుచేటు

అసదుద్దీన్ ఓవైసీపై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 04:
నిందితులకు బెయిల్ మంజూరు చేసేది న్యాయస్థానాలేననే కనీస విషయం బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి తెలియదా అని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రశ్నించారు. కోర్టు ఇచ్చిన బెయిల్ పై వ్యాఖ్యలు చేయడం కోర్టు ధిక్కారం కిందకే వస్తుందని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం రోజున ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. జైలులో ఉండే నిందితులకు బెయిల్ ఇచ్చే లేదా వారిని విడుదల చేసే అధికారం జైలు సూపరింటెండెంట్ కు ఉండదన్న విషయం అసదుద్దీన్ కు అవగాహన లేదా అని ఎద్దేవా చేశారు. గమనికలో భాగంగా... "గతంలో మీ తమ్ముడు అక్బరుద్దీన్ ఓవైసీ జైలుకు వెళ్లినప్పుడు ఆయనకు బెయిల్ కోర్టు ఇచ్చిందా? లేక జైలు సూపరింటెండెంట్ ఇచ్చిందా?" అని నిలదీశారు. ఎంఐఎం పార్టీ పతనం ప్రారంభమైందని, అందుకే అన్న ఒక మాట, తమ్ముడు మరో మాట మాట్లాడి పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని పైడి రాకేష్ రెడ్డి దుయ్యబట్టారు.

ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలి

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి
- ఎస్ఐఆర్‌తో అర్హులైన ఓటర్లను దూరం చేస్తున్నారని ఆరోపణ
- అక్టోబర్ 8న లోక్‌భవన్ ముట్టడి
- అనంతరం ఛలో ఢిల్లీ కార్యక్రమం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 04
భారత ఎన్నికల సంఘం సంస్థాగత స్వతంత్రతను కాపాడాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇండియా కూటమి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలోని ఫతే మైదాన్ క్లబ్‌లో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోతే రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్లను ఓటు హక్కుకు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాల కారణంగా దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగిపోయాయని వారు పేర్కొన్నారు. కొత్త ఓటు దరఖాస్తులో తీసుకొచ్చిన నిబంధనలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. సీఈసీ నియామక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్థానం కల్పించాలని కోరారు.

8న లోక్‌భవన్ ముట్టడి
డిమాండ్ల సాధనలో భాగంగా అక్టోబర్ 8న లోక్‌భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. అనంతరం ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడతామని వెల్లడించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఐఆర్‌పై తమ పోరాటం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసమేనని, ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే సీఈసీ పనిచేస్తున్నారని నాయకులు ఆరోపించారు. కాగా, ఎస్ఐఆర్‌పై ఇండియా కూటమి నేతలు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోతే రోహిత్ ముదిరాజ్, ఎం. వెంకటేష్, ఎం. మహేందర్ (సీపీఐ(ఎం)), ఉస్మాన్ హలీం హజ్రీ (కాంగ్రెస్ కార్వాన్ ఇన్‌చార్జ్), సయ్యద్ ముజాహిద్ (టీజేఎస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ), మాసంపల్లి అరుణ్ కుమార్ (టీజేఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు), స్టాలిన్ (సీపీఐ హైదరాబాద్ కార్యదర్శి), తెలంగాణ శ్యామ్ (వీసీకే పార్టీ అధికార ప్రతినిధి), సలీం పాషా (టీజేఎస్ పార్టీ నాయకుడు), రషీద్ ఖాన్ (టీపీసీసీ కార్యదర్శి), సంతోష్ గుప్తా (కాంగ్రెస్ నాయకుడు), కె. హరిధర్ (యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు) పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

20 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 04:
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఈ రోజు కేంద్ర ప్రభుత్వం బీసీ కులగణన చేయాలని కాంగ్రెస్ పార్టీ బీసీ గర్జన సభ పెట్టడం అభినందనీయమే కానీ ఇక్కడ కాంగ్రెస్ పార్టీ కూడా బీసీలకు జనాభా దామాషా ప్రకారం నామినేటెడ్ పదవుల్లో బీసీల జనాభా దామాషా ప్రకారం అవకాశం ఇవ్వాలని అన్నారు. గవర్నర్ కోటాలో భర్తీ అయ్యే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఇద్దరికి అవకాశం కల్పించాలనీ లింగంగౌడ్ కోరారు.

డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్‌కు 'కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్ గ్లోబల్ లీడర్షిప్ అవార్డు'

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 4
హైదరాబాద్లోని రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సుల్, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ కు అరుదైన గౌరవం దక్కింది. లండన్లోని చారిత్రాత్మక మార్ల్బరో హౌస్లో జరిగిన గ్లోబల్ సమ్మిట్ ఆన్ లాంగెవిటీ అండ్ హెల్తీ ఏజింగ్ సదస్సులో కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్ ఆయనను ప్రతిష్టాత్మక 'కామన్వెల్త్ మెడికల్ అసోసియేషన్ గ్లోబల్ లీడర్షిప్ అవార్డు'తో సత్కరించింది. దౌత్య రంగం, పర్యావరణహిత జీవనం, అంతర్జాతీయ సహకారానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ మాట్లాడుతూ ప్రత్యేకంగా ఆహ్వానించి ఈ అవార్డు ప్రదానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు తనకు దక్కిన గొప్ప గౌరవమని, దౌత్యపరమైన, అంతర్జాతీయ ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అన్నారు. ప్రపంచ ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడంలో, ప్రజల దీర్ఘాయువు, సంక్షేమం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో అంతర్జాతీయ చర్చలు, విజ్ఞాన మార్పిడి, దేశాల మధ్య సహకారం ఎంతో కీలకమన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ ప్రత్యేక అతిథిగా, వక్తగా హాజరయ్యారు. దీర్ఘాయువు, ఆరోగ్యకరమైన వృద్ధాప్యం, ఆరోగ్య రంగంలో నూతన ఆవిష్కరణలు, మానవాళి శ్రేయస్సు భవిష్యత్తుపై ఈ సదస్సు ప్రధానంగా దృష్టి సారించింది. కామన్వెల్త్ వేదికపై కజకిస్తాన్కు ప్రాతినిధ్యం వహించే గౌరవాన్ని పొందారు.

ఓటరు హక్కులకు భంగం కలిగించేలా ఎన్నికల కమిషన్ విధానాలు

- గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం
- అర్హులైన గ్రాడ్యుయేట్లు తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు కావాలని పిలుపు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 4
ఓటర్ల హక్కులకు భంగం కలిగించే విధంగా ఎన్నికల కమిషన్ విధానాలు ఉన్నాయని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పద్మారావునగర్‌లో బెల్వర్డి గార్డెన్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఓటరు నమోదు ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించారు. నూతనంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారిని మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకునే విధానాన్ని అమలు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా, ఆ విధంగా జరగడం లేదని అన్నారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో సైతం సాంకేతికత, కార్యక్రమంపై అవగాహన లేని వారిని బూత్ స్థాయి అధికారులుగా నియమించడం వల్ల గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. దీని వల్ల లక్షలాది మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడ్డాయని తెలిపారు. తిరిగి పేర్లు తొలగించబడిన ఓటర్లకు ఎన్నికల కమిషన్ నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై లేదా అని ప్రశ్నించారు. పెద్ద వ్యవస్థ కలిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారాన్ని ఎన్నికల కమిషన్ ఎందుకు తీసుకోవడం లేదని అన్నారు. త్వరలో గ్రాడ్యుయేట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తమ ప్రాంతంలోని, తమకు పరిచయం ఉన్న గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకునేలా చూడాలని కోరారు. ఓటు ఎవరికి వేయాలనేది వారి నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని, అయితే ముందుగా ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి వాటిని పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారని తలసాని విమర్శించారు. ప్రధానంగా విద్యుత్, తాగునీటి సమస్యలు నెలకొన్నాయని అన్నారు. పురపాలక, హోం, విద్యాశాఖలను మూడు కూడా ముఖ్యమంత్రి తన వద్దే ఉంచుకున్నప్పటికీ, వాటిపై ఇప్పటి వరకు పర్యవేక్షణ చేసిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి మాట్లాడే భాష అందుకు భిన్నంగా ఉందని, ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ చేసి అవసరమైన చర్యలు తీసుకునేవారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రాడ్యుయేట్లు తమ వివరాలు నమోదు చేసిన ఓటరు నమోదు పత్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అందజేశారు. కార్యక్రమంలో పద్మారావునగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, అపార్ట్‌మెంట్ వాసులు జగ్గయ్య, రాజశేఖర్, ముకుంద్, సత్యనారాయణ, ఆనంద్, ప్రసాద్, పవన్, బాల్‌రెడ్డి, డాక్టర్ ఇందిర, బీఆర్ఎస్ పార్టీ బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, వెంకటరమణ, శ్రీకాంత్‌రెడ్డి, మిట్టపల్లి బాబూరావు, కొత్తూరు వెంకట్, ఎం.ఎన్. శ్రీనివాస్, కృష్ణ ముదిరాజ్, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని ప్రోత్సహిస్తున్న కేసీఆర్, బీజేపీ!

- దళితుల పట్ల వివక్ష రాజ్యాంగంలోని 17వ అధికరణ ఉల్లంఘనే
- డప్పులు, గుతుపలతో నిరసన..

దసరా ముందు సిద్దిపేటలో వెయ్యి డప్పులతో దండోరా

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 04
దళితుల పట్ల వివక్ష చూపుతూ అంటరానితనాన్ని ప్రోత్సహించే విధంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీజేపీ వ్యవహరిస్తున్నాయని మాదిగ మాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దేవని సతీష్ మాదిగ విమర్శించారు. దళితులు తమ ఫామ్‌హౌస్ వద్దకు వచ్చి నిలబడితే నేల మైలపడిందన్న భావనతో కేసీఆర్ పసుపు నీళ్లతో శుద్ధి చేయించారని, ఉత్తరాఖండ్‌లోని రాంలీలా మైదానంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న కాంగ్రెస్ సభ వేదికను బీజేపీ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం కూడా అదే తరహా వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదేళ్లపాటు తెలంగాణ ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్‌కు రాజ్యాంగంలోని చట్టాలపై అవగాహన ఉన్నప్పటికీ, దళితుల పట్ల ఇలాంటి చర్యలకు పాల్పడటం రాజ్యాంగంలోని 17వ అధికరణను ఉల్లంఘించడమేనని అన్నారు. అటు తెలంగాణలో కేసీఆర్, ఇటు కేంద్రంలో బీజేపీ అంటరానితనాన్ని ప్రోత్సహిస్తూ రాజ్యాంగాన్ని, చట్టాలను అవమానిస్తున్నాయని విమర్శించారు. దళితులు తమ ఇళ్ల వద్దకు వస్తే పసుపు నీళ్లతో శుద్ధి చేస్తారా? రాజకీయ పార్టీలు దళితవాడలకు వచ్చినప్పుడు మైల పడవా? దళితులు మీ పార్టీ గుర్తులకు ఓట్లు వేస్తే ఆ గుర్తులు మైల పడవా? అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ పార్టీ, బీజేపీలను దళితవాడల్లోకి రానీయకుండా ప్రజలు తరిమికొట్టాలని దళిత సోదరులకు పిలుపునిచ్చారు.
తెలంగాణలోని 33 జిల్లాలు, 119 నియోజకవర్గాలు, మండలాలు, ప్రతి గ్రామంలో కేసీఆర్ పార్టీ, బీజేపీ చర్యలకు నిరసనగా దండోరా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. మాదిగలు డప్పులతో, మాలలు గుతుపలతో నిరసన తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా మాదిగ డప్పులు, మాల గుతుపలతో నిర్వహించిన నిరసన ర్యాలీతో ట్యాంక్‌బండ్ అంబేద్కర్ చౌరస్తా మార్మోగింది. వందలాది మంది మాదిగలు డప్పుల ధ్వనులతో నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు గ్రేటర్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, దళిత సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్నపాగ రాములు, థామస్ మాదిగ (హుస్నాబాద్, కరీంనగర్ జిల్లా), మంకాళి రాంచంద్రం (సిద్దిపేట జిల్లా), బొల్లె సైదులు (సూర్యాపేట జిల్లా), మిద్దె మల్లేష్ (నాగర్‌కర్నూల్ జిల్లా), బాల్‌రాజ్ (గాగిల్లాపూర్, మేడ్చల్ జిల్లా), సత్యనారాయణ (అగ్రహారం), పొట్లపల్లి (మహబూబ్‌నగర్ జిల్లా), విరస్వామి (వనపర్తి జిల్లా), మారేపాక గిరి (నల్లగొండ జిల్లా), దైద శ్యామ్‌సుందర్ (అడ్డగుట్ట), మోజెస్ (జగద్గిరిగుట్ట) తదితరులు పాల్గొన్నారు. దసరా పండుగకు ముందు సిద్దిపేటలో వెయ్యి డప్పులతో భారీ నిరసన దండోరా నిర్వహిస్తామని మాదిగ మాల జేఏసీ చైర్మన్ దేవని సతీష్ మాదిగ ప్రకటించారు.

సుప్రసిద్ధ శాస్త్రవేత్త పల్లె రామారావు కన్నుమూత

పలు సంస్థల నివాళులు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 04
భారత దేశ అత్యుత్తమ శాస్త్రవేత్తల్లో ఒకరు, మెటలర్జీ విభాగం, అణు భౌతిక శాస్త్రం లోను విశేష కృషి చేసి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన విఖ్యాత శాస్త్రవేత్త, పద్మ విభూషణ్ ప్రొఫెసర్ పల్లె రామారావు (89) కన్నుమూసారు. 1937, జూన్ 30 న కర్నూలులో జన్మించిన రామారావు ప్రాథమిక విద్య మునిసిపల్ హైస్కూలులో తెలుగు మాధ్యమంలో ముగించి ఉన్నత చదువులు బెంగళూరు, మద్రాసు, ఆంధ్ర, బెనారస్ విశ్వవిద్యాలయాల్లో కొనసాగించి పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో మెటీరియల్ సైన్స్ లో పోస్ట్ డాక్టరల్ రీసెర్చ్ నిర్వహించారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగళూరు), బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలలో ఆచార్యునిగా బోధించిన పిమ్మట హైదరాబాదు లోని డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లాబొరేటరీ (డిఎంఆర్ఎల్) డైరెక్టర్ గా, కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ కార్యదర్శిగా, ఓషన్ డెవలప్మెంట్ కార్యదర్శిగా, అటామిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు (ఏఈఆర్ బీ) చైర్మన్ గా, హెచ్ సీయూ వైస్ ఛాన్సలర్ గా, ఏఆర్ సీఐ చైర్మన్ గా, డిఆర్ డిఓ, ఇస్రో డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్, ప్రొఫెసర్ మొదలైన అనేక హోదాల్లో పనిచేశారు. భారత దేశపు అత్యంత విశిష్ట శాస్త్రవేత్త, సైన్స్ పాలసీ సలహాదారు, అకాడమిక్ అడ్మినిస్ట్రేటర్లలో ఒకరైన డాక్టర్ రామారావు మృతికి సీసీజీజీఓఓ జాతీయ చైర్మన్ వి. కృష్ణ మోహన్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రామారావు స్వదేశీ సాంకేతిక నైపుణ్యంతో ఆర్డినెన్సు కర్మాగారం హెవీ అల్లోయ్ పెనిట్రేటర్ ప్లాంట్, తిరుచునాపల్లి ప్రారంభంలోనూ, ఇంటర్నేషనల్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్ సిఐ), హైదరాబాద్, నాన్ – ఫెర్రస్ మెటీరియల్ టెక్నాలజీ డెవలప్మెంట్ సెంటర్ (ఎన్ఎఫ్ టీడీసీ), హైదరాబాద్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ, చెన్నై, సేఫ్టీ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్, కల్పక్కం, టెక్నాలజీ డెవలప్మెంట్ బోర్డు (టిడిబి), ఢిల్లీ మొదలైన సంస్థలను నెలకొల్పి వాటి అభివృద్ధికి పాటుబడ్డారని వి. కృష్ణ మోహన్ కొనియాడారు. ప్రముఖ శాస్త్రవేత్త, విద్యావేత్త, పరిపాలనాదక్షుడైన రామారావు మరణంతో జన విజ్ఞాన వేదిక మార్గదర్శకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. సుప్రసిద్ధ శాస్త్రవేత్త రామారావు మరణం విద్యా, శాస్త్ర, సాంకేతిక రంగాలకు తీరని లోటని ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ (ఏఐపీఎస్ఎన్) శ్రద్ధాంజలి ఘటించింది. హైదరాబాద్ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతికి నివాళులర్పిస్తూ అసాధారణ శాస్త్రవేత్త, దూరదృష్టి కలిగిన నాయకుడు, ఆప్తుడైన గురువు యొక్క మార్గదర్శక వెలుగును కోల్పోయామని, విజ్ఞాన శాస్త్రం, పరిశోధన, దేశ సేవ రంగాలకు రామారావు అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచి పోతాయని పొగిడారు.

చింతలమెట్ హస్తాల ఈరన్న ఆలయంలో ఘనంగా శ్రమదానం, వంట వార్పు

నేడే (సోమవారం) ఉదయం ప్రత్యేక అభిషేకం, పూజలు

చింతలమెట్ వెలుతురు అక్టోబర్ 04:
చింతలమెట్‌లోని శ్రీ హస్తాల ఈరన్న స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రోజున భక్తులు, స్థానిక యువకులు, నాయకులు కలిసి శ్రమదానం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.
ఈ సందర్భంగా శ్రమదానంలో పాల్గొన్న సభ్యులందరూ కలిసి ఆలయ ప్రాంగణంలోనే వంట వార్పు (సహపంతి భోజనాలు) నిర్వహించి ఆత్మీయంగా గడిపారు.

నేడే ఉదయం ప్రత్యేక పూజలు:
ఈ శ్రమదాన కార్యక్రమాన్ని పురస్కరించుకుని, నేడే (సోమవారం) ఉదయం 8:00 గంటల నుండి 10:00 గంటల వరకు శ్రీ హస్తాల ఈరన్న స్వామికి ప్రత్యేక అభిషేకం మరియు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానిక భక్తులందరూ ఈ పూజా కార్యక్రమంలో విశేషంగా పాల్గొని, స్వామివారి కృపాకటాక్షాలు పొందగలరని నిర్వాహకులు కోరారు.

శ్రమదానంలో పాల్గొన్నవారు:
ఈరోజు జరిగిన శ్రమదాన కార్యక్రమంలో వై. శ్రీధర్, బొక్కాబాల్ రెడ్డి, బాబురావు, వెంకటేష్, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సందీప్ మహేష్ శీను కృష్ణ గౌడ్, అమర్, వేణు, పవన్, నరేందర్, ఉపేందర్, మనోజ్, ప్రవీణ్, సాయి, శ్రీకాంత్ తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు మరియు యువకులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు గ్రామసభల ప్రతిజ్ఞ

- కేంద్రప్రభుత్వ చొరవను స్వాగతించిన స్కోప్ సంస్థ
- బాల్యవివాహ రహిత గ్రామాల నిర్మాణానికి దేశవ్యాప్తంగా గ్రామసభల తీర్మానాలు చారిత్రాత్మకం: డాక్టర్ బండి సాయన్న

వెలుతురు హైదరాబాద్, తెలంగాణ అక్టోబర్ 04: జనగామ, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో క్షేత్రస్థాయిలో బాల్యవివాహాల నిర్మూలనకు కృషిచేస్తున్న స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్), దేశవ్యాప్తంగా బాల్యవివాహాల నిర్మూలన లక్ష్యంగా కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ (డబ్ల్యుసిడి), పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ చేపట్టిన చారిత్రాత్మక కార్యక్రమాన్ని స్వాగతించింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2వ తేదీన దేశంలోని అన్ని గ్రామసభలు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, తమ గ్రామాలను బాల్యవివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తీర్మానాలు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమని స్కోప్ సంస్థ పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసి, గాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి, బాల్యవివాహాల నిర్మూలనకు సమష్టిగా ప్రతిజ్ఞ చేయాలని సూచించింది. స్కోప్ అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న మాట్లాడుతూ, బాల్యవివాహాల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రయత్నాలకు మరింత ఊతమిస్తుందని తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం ప్రభుత్వంతో పాటు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ స్కోప్ సంస్థ తన కృషిని కొనసాగిస్తుందని వెల్లడించారు. స్కోప్ సంస్థ దేశంలోనే అతిపెద్ద బాలల హక్కుల పరిరక్షణ నెట్వర్క్గా గుర్తింపు పొందిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) భాగస్వామ్య సంస్థగా పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా 300కు పైగా భాగస్వామ్య స్వచ్ఛంద సంస్థలతో కలిసి జె ఆర్ సి, భారతదేశంలోని 782 జిల్లాల్లో ప్రభుత్వాలు, అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా 2.42 లక్షలకు పైగా ప్రత్యేక గ్రామసభలు నిర్వహించబడ్డాయి. ఈ సమావేశాల్లో గ్రామాలను బాల్యవివాహ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు పాల్గొని బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు సమష్టిగా ప్రతిజ్ఞ చేశారు. బాల్యవివాహ రహిత గ్రామాల నిర్మాణంలో వేగవంతమైన పురోగతి సాధించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బండి సాయన్న మాట్లాడుతూ, "దేశంలోని ప్రతి గ్రామం నుంచి బాల్యవివాహాలను నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక గ్రామసభల ద్వారా చేపట్టిన ఈ ప్రచారాన్ని స్కోప్ సంస్థ హృదయపూర్వకంగా స్వాగతిస్తోంది. ఈ దిశగా జిల్లా కలెక్టర్లు, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు కూడా అభినందనీయం" అని అన్నారు. "2030 నాటికి భారతదేశాన్ని బాల్యవివాహ రహిత దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్య సాధనకు ఈ కార్యక్రమం నూతన ఉత్తేజాన్ని అందిస్తుంది. బాల్యవివాహాల వంటి సామాజిక దురాచారాలను నిర్మూలించేందుకు గ్రామమంతా, సమాజమంతా ఏకమై ముందుకు వస్తే మార్పు మరింత వేగంగా సాధ్యమవుతుంది. ప్రతి బాలిక తన బాల్యాన్ని ఆనందంగా గడుపుతూ, తన

కలలను సాకారం చేసుకునే అవకాశాన్ని పొందాలి. ఇవి భారత చట్టాలు బాలికలకు కల్పించిన హక్కులు" అని ఆయన పేర్కొన్నారు. జె ఆర్ సి తన భాగస్వామ్య స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ఒక తరం కాలంలోనే బాల్యవివాహాల ఆచారాన్ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయి ఉద్యమాన్ని ప్రారంభించింది. 2024లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'బాల్యవివాహ రహిత భారత్' (చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ ఇండియా) ప్రచారంతో ఈ ఉద్యమం మరింత వేగం పుంజుకుంది. సమష్టి కృషి ఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయని, నిర్ణయించిన గడువు కంటే ముందుగానే బాల్యవివాహ రహిత భారతదేశం అనే లక్ష్యం సాకారమవుతుందనే ఆశాభావాన్ని స్కోప్ వ్యక్తం చేసింది.

సిద్దిపేట జిల్లా ఖ్యాతి ఎల్లలు దాటేలా

పదేళ్ల పండుగ

- పదేండ్ల సిద్దిపేట జిల్లా ఉత్సవాలను పండుగలా చేద్దాం
- జిల్లా సంస్కృతి, సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా వేడుకగ నిర్వహిద్దాం
- ఎమ్మెల్యే హరీష్‌రావు

సిద్దిపేట, వెలుతురు అక్టోబర్ 04: సిద్దిపేట జిల్లా పదేళ్ల పండుగ సందర్భంగా సిద్దిపేట జిల్లా ఖ్యాతి కీర్తి ఎల్లలు దాటేల ఘనంగా వేడుకగా నిర్వహించాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కవులు, కళాకారులు, జర్నలిస్టులు, వైద్యులు, లాయర్లు, ప్రజాసంఘాలు, వ్యాపారులు, విద్యావేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు తదితర సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు స్వీకరించారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ అసోసియేషన్ లు, అడ్వకెట్స్, డాక్టర్స్, సిద్దిపేట ప్రముఖ లతో పదేళ్ల పండుగ పై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ..సిద్దిపేట జిల్లా 1983 నుండి నినాదం గానే మిగిలిందని కానీ.. నాడు సిద్దిపేట జిల్లా కావాలని అర్జీ పెట్టిన నాయకుడు కెసిఆర్ తెలంగాణ వచ్చాక తొలి ముఖ్యమంత్రి గా తానే ఆరంభం చేసారని, 2016 అక్టోబర్ 11 న సిద్దిపేట జిల్లాను ప్రారంబించి చరిత్ర లో సువర్ణధ్యాయాన్ని లిఖించారన్నారు. సిద్దిపేట జిల్లా, గోదావరి జలాలు, రైలు రాక జిల్లా కేంద్రం ప్రజల ముంగిట్లో కి వచ్చింది, నినాదాలను నిజాలు గా చేసిన ఘనత కెసిఆర్ దే అని అన్నారు. సిద్దిపేట జిల్లా రాకముందు ఎన్నో ప్రయాసలు పడ్డామని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, జర్నలిస్ట్ లు వాణిజ్య వ్యాపార ఇలా అన్నీ వర్గాల వారు ఇబ్బంది పడ్డారని, అలాంటి సిద్దిపేటను జిల్లా చేసుకోని అద్భుతమైన ప్రగతి సాధించుకున్నామని చెప్పారు. అలాంటి సిద్దిపేట జిల్లా ఈ అక్టోబర్ 11 2026 కి పదేళ్లు అవుతున్న సందర్భంగా సిద్దిపేట ఖ్యాతి ని ఎల్లలు దాటేల నిర్వహించుకుందామని చెప్పారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాల ను అడిగి తెల్సు కున్నారు. సిద్దిపేట చరిత్ర, సంస్కృతి, అభివృద్ధి ఇలా అన్ని విషయాల పై పుస్తకాన్ని సావనీరు ను రూపొందించాలని చెప్పారు. నాటి సిద్దిపేట నేటి సిద్దిపేట పై అద్భుతమైన డాక్యుమెంటరీ రూపొందిచాలని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని వైభవంగా వేడుకగా ఒక పండగ చేద్దామని పిలుపునిచ్చారు. ఇవేగాకుండా జిల్లా ఏర్పాటుతో సాధించిన అభివృద్ధి, సిద్ధించిన సత్ఫలితాలపై జర్నలిస్టులు, కవులు, రచయితలు, డాక్టర్లు, అడ్వకేట్లు, వ్యాపారుల ఆధ్వర్యంలో చర్చావేధి కలు నిర్వహించాలని చెప్పారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, రాష్ట్రపార్టీ కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, పాల్గొన్నారు.

ఏఐతో ఉద్యోగాల 'రిస్క్' బెల్!

- తెలంగాణలో ఐటీ నుంచి వివిధ రంగాల వరకు మారుతున్న ఉద్యోగ స్వరూపం
- ఫ్రెషర్లకు పెరుగుతున్న సవాళ్లు హైదరాబాద్ ఐటీ నుంచి బ్యాంకింగ్, మీడియా వరకు ప్రభావం..
- ఎంట్రీ లెవల్ ఉద్యోగాలపై అధికప్రభావం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 4: కృత్రిమ మేధస్సు (ఏఐ) ఇప్పుడు కేవలం సాంకేతిక రంగానికే పరిమితమైన మార్పు కాదు.. ఉద్యోగ ప్రపంచం మొత్తాన్నీ పునర్నిర్మిస్తున్న శక్తిగా మారుతోంది. ముఖ్యంగా తెలంగాణలో హైదరాబాద్ ఐటీ, బీపీఓ, ఫైనాన్స్, మీడియా, కస్టమర్ సర్వీసులు, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ వంటి రంగాల్లో రోజువారీ పనుల్లో ఏఐ వినియోగం పెరుగుతోంది. దీంతో కొన్ని పాత తరహా ఉద్యోగాల అవసరం తగ్గుతుండగా.. ఏఐను వినియోగించగల నైపుణ్యాలు ఉన్న వారికి కొత్త అవకాశాలు పెరుగుతున్నాయి.

ఫ్రెషర్లకు గట్టి పోటీ

హైదరాబాద్ దేశంలోని ప్రధాన ఐటీ కేంద్రాల్లో ఒకటిగా కొనసాగుతున్నప్పటికీ.. సంప్రదాయ 'ప్యూర్ కోడింగ్' ఉద్యోగాల్లో ఫ్రెషర్లకు అవకాశాలు తగ్గుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. రొటీన్ కోడింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, టెక్నికల్ సపోర్ట్ వంటి పనుల్లో జనరేటివ్ ఏఐ వినియోగం పెరగడంతో కంపెనీలు కేవలం కోడింగ్ తెలిసిన వారికంటే.. ఏఐ సాధనాలతో పనిచేయగల ఉద్యోగులను కోరుతున్నాయి. దేశవ్యాప్తంగా 651 ఐటీ సంస్థలపై 2025 నవంబర్ నుంచి 2026 జనవరి వం-కు నిర్వహించిన అధ్యయనం కూడా భారీ స్థాయిలో ఉద్యోగాలు అంతరించిపోతున్నాయనే అంచనాలకు ఆధారం లేదని పేర్కొంది. అయితే నియామకాల వృద్ధి కొంత మందగించిందని, ముఖ్యంగా ఎంట్రీ లెవల్ ఉద్యోగాలపై ప్రభావం ఎక్కువగా ఉందని వెల్లడించింది. అదే సమయంలో ఏఐ ఆధారిత సాంకేతిక, విశ్లేషణాత్మక నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతున్నట్లు తెలిపింది.

ఐటీ దాటి అన్ని రంగాల్లోకి..

బ్యాంకింగ్‌లో డేటా విశ్లేషణ, కస్టమర్ సపోర్ట్, పత్రాల పరిశీలన.. మీడియాలో కంటెంట్ తయారీ, అనువాదం, డిజైన్.. మార్కెటింగ్‌లో డేటా ఆధారిత ప్రచారాలు.. ఆరోగ్య రంగంలో నివేదికల విశ్లేషణ.. వ్యవసాయంలో పంటలు, వాతావరణం, మార్కెట్ అంచనాలు.. తయారీ రంగంలో ఆటోమేషన్.. ఇలా అనేక రంగాల్లో ఏఐ ప్రవేశిస్తోంది. అంటే ఉద్యోగాలు పూర్తిగా మాయమవుతున్నాయనే కంటే.. ఉద్యోగాల్లో మనుషులు చేసే పనుల స్వరూపం మారుతోంది. ఒకప్పుడు ఒక విభాగంలో ఐదుగురు చేసే రొటీన్ పనిని ఏఐ సాధనాలతో ఇద్దరు లేదా ముగ్గురు వేగంగా పూర్తి చేసే పరిస్థితి రావచ్చు. అదే సమయంలో ఏఐను పర్యవేక్షించడం, ఫలితాలను ధ్రువీకరించడం, సృజనాత్మక నిర్ణయాలు తీసుకోవడం వంటి కొత్త బాధ్యతలు ఏర్పడుతున్నాయి.

తెలంగాణపై ప్రత్యేక ప్రభావం

హైదరాబాద్‌లో భారీ సంఖ్యలో ఐటీ, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు (జీసీసీలు), స్టార్టప్‌లు ఉండటంతో రాష్ట్రంపై ఈ మార్పు ప్రభావం సహజంగానే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. అయితే మరోవైపు ఏఐ, డేటా, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్, రోబోటిక్స్, డీప్‌టెక్ రంగాల్లో కొత్త ఉద్యోగాలకు అవకాశాలు కూడా పెరుగుతున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో డోర్‌డ్యాష్ కొత్త గ్లోబల్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, వచ్చే రెండేళ్లలో 3,000 ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రకటించింది. ఈ మార్పుపై తెలంగాణ ప్రభుత్వం కూడా దృష్టి సారించింది. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితులను ఎదుర్కొనేందుకు రీ-స్కిల్లింగ్ వ్యూహాలు అవసరమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏఐ కంపెనీల నుంచి పన్ను రూపంలో వసూలు చేసి ఉద్యోగ నష్టాలను ఎదుర్కొనే చర్యలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

మూఢనమ్మకాల ముసుగులో

మానవ హక్కులపై దాడి

- మంత్రాలు, చేతబడి పేరుతో వేధింపులు.. కుల, ఊరి బహిష్కరణలు
- అనుమానం కాదు.. ఆధారమే ప్రామాణికం
- శాస్త్రీయ అవగాహనతోనే పరిష్కారం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 04 : మంత్రాలు, చేతబడి, దెయ్యాలు, భూతాలు అంటూ సమాజంలో ఇప్పటికీ కొన్ని మూఢనమ్మకాలు కొనసాగుతూనే ఉన్నాయి. అనారోగ్యం, కుటుంబ సమస్యలు, పంట నష్టం, వరుస మరణాలు, ఆర్థిక ఇబ్బందులు వంటి వాటికి శాస్త్రీయ కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా.. ఎవరో ఒకరిని అనుమానించి వారిపై దాడులకు పాల్పడటం, అవమానించడం, చివరకు కులం లేదా ఊరి నుంచి బహిష్కరించడం వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల తెలంగాణలోని పలు జిల్లాల్లో ఇలాంటి ఆరోపణలతో జరిగిన ఘటనలు ఈ సమస్య తీవ్రతను మరోసారి చాటుతున్నాయి.

తెలియనిదాన్ని భయపడటం.. కారణాన్ని వెతకకపోవడం

మనిషికి అర్థం కాని సంఘటన ఎదురైనప్పుడు దానికి అతీంద్రియ కారణాన్ని ఆపాదించడం కొత్త విషయం కాదు. కానీ ఒక సంఘటనకు శాస్త్రీయ ఆధారం లేకుండానే దాన్ని 'చేతబడి', 'మంత్రం'గా నిర్ధారించడం ప్రమాదకరం. ఒకే కుటుంబంలో వరుసగా అనారోగ్యాలు రావడం, పంటలు దెబ్బతినడం, పశువులు మృతి చెందడం వంటి వాటికి వాతావరణ పరిస్థితులు, అంటువ్యాధులు, కలుషిత నీరు, పురుగుమందులు, పోషకాహార లోపం, పశు వైద్య సమస్యలు తదితర అనేక కారణాలు ఉండవచ్చు. కారణం తెలియకపోవడం.. కారణం లేదని అర్థం కాదు. అలాగే శాస్త్రీయంగా నిరూపించలేని విషయాన్ని నిజమని భావించడం సరైన పద్ధతి కాదు.

అనుమానమే తీర్పుగా మారితే..

మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో ఎవరినైనా కొట్టడం, బెదిరించడం, ఇంటి నుంచి వెళ్లగొట్టడం లేదా సామాజికంగా వెలివేయడం తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, ఒంటరిగా జీవించే వ్యక్తులు, సామాజికంగా బలహీన వర్గాలు ఇలాంటి ఆరోపణలకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎవరి మీదైనా నేరారోపణ ఉంటే దానిని చట్టబద్ధమైన మార్గంలోనే పరిష్కరించాలి. అనుమానం ఆధారంగా సామాజిక శిక్ష విధించడం న్యాయవ్యవస్థకు ప్రత్యామ్నాయం కాదు. కుల, ఊరి బహిష్కరణ పేరుతో ఒక కుటుంబాన్ని సామాజికంగా ఒంటరి చేయడం వారి గౌరవం, స్వేచ్ఛ, జీవన హక్కులపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

అనారోగ్యానికి వైద్యం.. సమస్యకు పరిష్కారం

ఎవరైనా అనారోగ్యానికి గురైతే ముందుగా వైద్యుడిని సంప్రదించాలి. మానసిక ఆరోగ్య సమస్యల విషయంలో కూడా నిపుణుల సలహా తీసుకోవాలి. పంట సమస్యలకు వ్యవసాయ నిపుణులు, పశువుల అనారోగ్యానికి పశువైద్యులు, నీటి సమస్యలకు సంబంధిత నిపుణుల సహాయం తీసుకోవాలి. గ్రామాల్లో ఏదైనా అసాధారణ సంఘటన జరిగినప్పుడు భయాందోళనలకు గురికాకుండా అసలు కారణాన్ని గుర్తించే ప్రయత్నం చేయాలి. వ్యాధులు, వాతావరణ మార్పులు, పర్యావరణ పరిస్థితులు, విషపదార్థాలు, నీటి కాలుష్యం వంటి అంశాలను పరిశీలించడం ద్వారా సమస్యకు వాస్తవ కారణాన్ని గుర్తించవచ్చు.

ప్రశ్నించే తత్వమే ప్రగతికి పునాది

మూఢనమ్మకాలను ఎదుర్కోవడానికి కేవలం విమర్శలు సరిపోవు. చిన్నప్పటి నుంచే పిల్లల్లో ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించాలి. 'ఎందుకు?', 'ఎలా?', 'దీనికి ఆధారం ఏమిటి?' అనే ప్రశ్నలు వేయడం నేర్పాలి. పాఠశాలలు, కళాశాలలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు శాస్త్రీయ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి. ఏదైనా వాదనను నమ్మే ముందు దానికి ఆధారం ఉందా? నిపుణులు ఏమంటున్నారు? దానిని పరీక్షించగలమా? అనే విషయాలను పరిశీలించడం అవసరం.

భయాన్ని కాదు.. అవగాహనను పెంచాలి

మూఢనమ్మకాలు కేవలం ఒక వ్యక్తి నమ్మకంతో ముగిసిపోయే విషయం కాదు. అవి హింసకు, సామాజిక వెలివేతకు, ఆర్థిక దోపిడీకి, కుటుంబ కలహాలకు దారితీసినప్పుడు అది సామాజిక సమస్యగా మారుతుంది. అందుకే గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, బాధితులకు అండగా నిలవడం, అనుమానాస్పద ఘటనలపై అధికారులకు సమాచారం ఇవ్వడం అవసరం.

ముగిసిన రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలు

- మొత్తం ఓట్లు 9823. పోలైన ఓట్లు 1552
- షురువైన కౌంటింగ్

నిజామాబాద్, వెలుతురు అక్టోబర్ 04 : నిజామాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటి ఎన్నికలు ముగిసాయి. ఆదివారం జిల్లా కేంద్రంలోని హరి చరణ్ మార్వాడి స్కూల్ లో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 3 గంటల వరకు సాగింది. చాలామంది ఆలస్యంగా వచ్చిన నిర్ణీత సమయానికి ముందు పోలింగ్ కేంద్రానికి రావడంతో వారికి ఓటు హక్కును వినియోగించుకొని నే హక్కులు కల్పించారు. 9823 మంది సభ్యులు ఉన్న నిజామాబాద్ రెడ్ క్రాస్ సొసైటిలో కేవలం 1552 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ ఎన్నిక కు పెద్ద ఎత్తున ప్రచారం జరిగిన ఓటు వేసేందుకు మాత్రం సభ్యులు ఆసక్తి చూపలేదు. హోరా హోరిగా జరిగిన ఎన్నికల్లో రెండు ప్యానల్ నుంచి 29 మంది బరిలో ఉండగా జోరుగా ప్రచారం జరిగిన ఓటర్లను పోలింగ్ కేంద్రానికి రప్పించడంలో పోటీ దారులు విఫలమయ్యారు. కొత్తగా నమోదు చేసుకున్న వారు కూడా ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపలేదు అని తెలిసింది. రాష్ట్రంలో 19 జిల్లాలలో కార్యవర్గాలు ఎకగ్రీవం కాగా కేవలం 8 జిల్లాల్లో మాత్రమే బ్యాలెట్ పద్ధతిన కార్యవర్గం ఎన్నుకుంటున్నారు. అందులో నిజామాబాద్ జిల్లా ఉండటంతో ఆసక్తి కరంగా మారింది. ఎప్పుడు రెడ్ క్రాస్ సొసైటీ అంటే కేవలం పదవులు పంచుకుని ఏకగ్రీవాలు చేయడం అనే సాంప్రదాయానికి జెన్ జి యువత దెబ్బకొట్టింది. యూనానిమస్ కు ససేమీరా అని బరిలో నిలిచారు. ఉదయం నుంచి జరిగిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింద ని ఎన్నికల అధికారి, డి సి ఓ శ్రీనివాస్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం కౌంటింగ్ ప్రారంభించామని రాత్రి వరకు ఫలితాలు ప్రకటిస్తామని అన్నారు.

ప్రజల మధ్య సామాన్యుడిలా ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి, వెలుతురు అక్టోబర్ 04 : ప్రజాప్రతినిధిగా ఉన్నప్పటికీ సామాన్యుడిలా ప్రజల మధ్య కలిసిమెలిసి తిరుగుతూ వారి కష్టసుఖాలను తెలుసుకోవడం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేకతగా నిలుస్తోంది. ఆదివారం వనపర్తి పట్టణం లోని 27వ వార్డులో బొట్టు రాజేష్ ఆకస్మికంగా మృ తి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్య లను పరామర్శించారు. అనంతరం మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి కాలనీలో నడుచుకుంటూ వెళ్తూ స్థానిక ప్రజలను పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామాలయం ఆర్చ్ సమీపంలోని సాధారణ టీ స్టాల్‌లో స్థానికులతో కలిసి టీ తాగుతూ వారితో ఆత్మీయంగా ముచ్చటించారు. తర్వాత బస్టాండ్ సమీపంలోని సాధారణ హెయిర్ కటింగ్ షాప్‌కు వెళ్లి అక్కడే కటింగ్ చేయించుకున్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఎలాంటి దర్పం ప్రదర్శించకుండా సామాన్యుడిలా ప్రజలతో కలిసిపోయిన ఆయన తీరు స్థానికులను ఆకట్టుకుంది. ప్రజాప్రతినిధి అంటే ప్రజలకు దూరంగా ఉండటం కాదని, ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల ను తెలుసుకుని, వారి సుఖ దుఃఖాల్లో భాగస్వామి కావడమే నిజమైన ప్రజాసేవకు నిదర్శనమని స్థానికులు పేర్కొన్నారు.

సైబరాబాద్‌లో వీకెండ్ స్పెషల్

డ్రంక్ అండ్ డ్రైవ్..119 మందిపై కేసులు

సైబరాబాద్ వెలుతురు అక్టోబర్ 04: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్‌ాణబ్రూ అడ్మి న్, జి నర్టటందరఈ డ్రైవ్‌లో భాగంగా 119 మందినిఅదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 101 ద్విచక్ర వాహనదారులు, 04 ఆటోలు, 14 కార్లు, 00 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే ---88 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, -22 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య, -09 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు

పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత --2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (28.09.2026 శీ 03.10.2026) లో 115 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. 06 మందికి జరిమానా, జైలు శిక్ష, 00 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 109 మందికి జరిమానా విధించ బడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

ముగిసిన ఆసియా క్రీడలు

- భారత్ ఖాతాలో 21 బంగారు పతకాలు
- 85 పతకాలతో నాలుగో స్థానంలో భారత్

నగొయా, వెలుతురు అక్టోబర్ 04 : జపాన్ ఆతిథ్యమిచ్చిన 2026 ఆసియా క్రీడలు ముగిశాయి. భారత్ అథ్లెట్ల ఈవెంట్లు కూడా కంప్లీట్ అయ్యాయి. రెండు వారాలపాటు సాగిన క్రీడల్లో మన క్రీడాకారులు అద్భుతంగా పోరాడి మొత్తం 85 పతకాలు సాధించారు. ఇందులో 21 గోల్డ్ మెడల్స్ ఉన్నాయి. వ్యక్తిగత విభాగాల్లో కంటే భారత్కు టీమ్ ఈవెంట్లలోనే పసిడి పతకాలు ఎక్కువగా వచ్చాయి.

నాలుగో స్థానంలో భారత్

గతసారితో పోలిస్తే ఈసారి మన క్రీడాకారులు సాధించిన పతకాల సంఖ్య తగ్గింది. 2022- 23 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో భారత్ 107 పతకాలు సాధించింది. దీంతో ఆసియా క్రీడల్లో 100 పతకాల మార్క్ తొలిసారి దాటింది. ఇందులో 28 పసిడి పతకాలు ఉండడం విశేషం. దీంతో ఓవరాల్గా పట్టికలో నాలుగో స్థానంతో ముగించింది. ఇక అప్పటితో పోలిస్తే ఈ సీజన్లో భారత్ పతకాలు దాదాపు 22 తగ్గాయి. ఈసారి కూడా సెంచరీ టార్గెట్తో బరిలోకి దిగగా, 85 వద్దే ఆగిపోయింది. అయినప్పటికీ ఓవరాల్గా పట్టికలో భారత్ నాలుగో స్థానంతోనే ముగించింది.

చివరి మూడు రోజుల్లో పతకాల పంట

పోటీల ప్రారంభంలో భారత్ పతకాలు అంతంత మాత్రంగానే వచ్చాయి. కొనసాగుతున్నా కొద్దీ మెడల్స్ సంఖ్య పెరుగుతూ వచ్చింది. మరీ ముఖ్యంగా చివరి రోజుల్లో మన క్రీడాకారుల అద్భుతమైన ప్రదర్శన వల్ల పతకాల పంట పండింది. గురువారం దాకా భారత్ ఖాతాలో కేవలం 10 స్వర్ణ పతకాలే ఉండగా, చివరి రెండు రోజుల్లో ఏకంగా 11 గోల్డ్ మెడల్స్ రావడం విశేషం. దీంతో నాలుగు రోజుల కిందట పతకాల పట్టికలో టాప్ 10లో కూడా లేని భారత్, ఇప్పుడు ఏకంగా నాలుగో స్థానంతో క్రీడలను ముగించింది.

అయోధ్య విరాళాల చోరీ కేసును ముగించేందుకు
మోదీ సర్కార్ తొందరపడుతోంది

- రామమందిర విరాళాల చోరీ కేసు దర్యాప్తుపై కాంగ్రెస్ ఫైర్
- దర్యాప్తు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఉదాసీనం
- విపక్షనాయకులపై దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి వెనుకాడదని ఎద్దేవా

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 04 : అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసు దర్యాప్తును ముగించడా నికి బీజేపీ ప్రభుత్వం తొందరపడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ కేసు దర్యాప్తులో జాప్యం జరుగుతోం దని మండిపడింది. దర్యాప్తు విషయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శిం చింది. రామయ్య విరాళాల చోరీ కేసులో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వంటి వారిని కాపాడుతోందని పేర్కొం ది. జూన్ 4న దొంగిలించిన సొమ్ముకు సంబంధించిన వీడియో చంపత్ రాయ్ చేరిన తర్వాత, ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో 21 రోజుల జాప్యం ఎందుకు జరిగిందని ప్రశ్నించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్లో పోస్ట్ పెట్టారు.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి : జైరాం రమేశ్

రామమందిర విరాళాల చోరీ కేసును సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర, నిష్పక్షపాత, విశ్వసనీయమైన విచారణ జరపాలని కాంగ్రెస్ మొదటి నుంచీ డిమాండ్ చేస్తోందని జైరాం రమేశ్ అన్నారు. "జూన్ 4న దొంగిలించిన సొమ్ముకు సంబంధించిన వీడియో చంపత్ రాయ్ దృష్టికి చేరింది. జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ 21 రోజుల జాప్యం వెనుక ఉన్న పూర్తి నిజాన్ని దేశం ముందు ఎందుకు బయటపెట్టలేదు?. 105సార్లు చోరీలు జరిగితే కేవలం 8 మంది నిందితులు మాత్రమే ఎలా ఉన్నారు? ఈ విచారణ అసలు లక్ష్యం కేవలం చిల్లర దొంగలను పట్టుకోవడమేనా?. కానుకల చోరీకి ఎవరు బాధ్యులో ఎప్పుడు నిర్ధరిస్తారు? కోట్లాది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంపై చిక్కుముడి వీడేది ఎప్పుడు?" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది జూన్ నెలలో రామాలయంలో కానుకల చోరీ ఘటన బయటపడింది. అయితే, ఈ చోరీకి సంబంధించి సిట్ జరిపిన దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఒకట్రెండు సార్లు కాదు, ఏకంగా 105 సార్లు విరాళాల చోరీ జరిగినట్లు సిట్ తేల్చింది. అందుకు సంబంధించిన చోరీ దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డైనట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో అయోధ్య రామమందిర విరాళాల చోరీ దర్యాప్తుపై మోదీ సర్కార్పై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

పర్యావరణ అనుమతుల అంశంపై ఫైర్

ప్రాజెక్టులకు రెట్రోస్పెక్టివ్ (పాత తేదీల ఆధారంగా)

పర్యావరణ అనుమతుల అంశంపై మోదీ ప్రభుత్వంపై జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. ఇది పర్యావరణాన్ని దెబ్బతీసే చర్య అని తెలిపారు. చట్టానికి అనుగుణంగా పెండింగ్లో ఉన్న, తిరస్కరించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనలను తార్కిక ముగింపునకు తీసుకువెళ్లడానికి సుప్రీంకోర్టు అనుమతించిన రెండు నెలల తర్వాత జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, పర్యావరణ పరిరక్షణకు ఉద్దేశించిన నిబంధనలను పాలనా ఉత్తర్వులతో మార్చలేరని ఇటీవలే సుప్రీంకోర్టు తెలిపింది. పర్యావరణ అనుమతులు లేకుండానే ప్రారంభించి, భారీ మొత్తాలను వెచ్చించిన ప్రాజెక్టులకు వెనుకటి తేదీలతో ఆ అనుమతులిచ్చేలా 2021లో కేంద్రం జారీ చేసిన కార్యాలయ ఉత్తర్వు(ఆఫీస్ మెమోరాండం)ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ తీర్పు భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులు, నిర్మాణాలకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో జైరాం రమేశ్ స్పందించారు.

అమెరికా కావాలనే ఒంటరి శక్తిగా మారింది

- చైనా ఎదుగుదలతో ప్రపంచంలో కొత్త పోటీ
- జైశంకర్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 04 : ప్రస్తుత ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో వేగంగా మారుతున్న సమీకరణాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమెరికా మారుతున్న తీరు, చైనా ఎదుగుదలే అంతర్జాతీయ స్థితిగతులను ప్రభావితం చేస్తున్న రెండు ప్రధాన అంశాలు అని స్పష్టం చేశారు. ఈ మేరకు జర్మనీలో జరిగిన మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్లో విదేశాంగ మంత్రి విశ్లేషించారు. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థలో స్పష్టంగా కనిపిస్తున్న మొదటి మార్పు అమెరికా తన స్థానాన్ని, వ్యూహాన్ని మార్చుకోవడమే. ఆ దేశం ఇటీవల తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అది స్వచ్ఛందంగా, కావాలనే ఒక ఒంటరి శక్తిగా మారుతోందని వ్యాఖ్యానించారు. ఇక్కడ అమెరికా విషయంలో రాడికల్ రీపొజిషనింగ్ అనే పదం ఉపయోగించారు. రాడికల్ రీపొజిషనింగ్ అంటే ఏదైనా సంస్థ లేదా దేశం తన పాత ఇమేజ్, వ్యూహాలను పూర్తిగా మార్చేసి కొత్త విధానాన్ని ఎంచుకోవడం. ఇక్కడ అమెరికా విషయంలో తన పాత విదేశాంగ విధానాలను, వ్యూహాల్ని పూర్తిగా మార్చుకుంటోందని జైశంకర్ స్పష్టం చేశారు. ఇది పరిస్థితుల వల్లే వచ్చిన మార్పు కాదని, విధానపరంగా తీసుకున్న నిర్ణయం అని చెప్పుకొచ్చారు. ప్రతి విషయంలోనూ తానే ప్రపంచానికి పెద్దన్నలా ఉంటూ అందరికీ సాయం చేసే పాత పద్ధతిని పక్కనబెట్టి తన ప్రయోజనాలే ముఖ్యమనే ధోరణివైపు అమెరికా మారిందనే అర్థం వచ్చేలా జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇక రెండో అంశం చైనా గురించి. చైనా తనను తాను అంతర్జాతీయంగా ఒక ప్రత్యేకమైన, విశిష్టమైన శక్తిగా భావిస్తోందని జైశంకర్ వ్యాఖ్యానించారు. చైనా ఎదుగుదల అంతర్జాతీయ వ్యవస్థను మరింత ప్రభావితం చేస్తోందన్నారు. చైనా ఆర్థిక, రాజకీయ సామర్థ్యాలు కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఈ క్రమంలోనే అమెరికా- చైనా మధ్య ప్రస్తుతం తీవ్రమైన పోటీ నెలకొందని జైశంకర్ పేర్కొన్నారు. అయితే ప్రపంచంలో పోటీ కేవలం రెండు అగ్రదేశాలకే పరిమితం కాలేదని, ఈ కారణంగానే ప్రతి దేశం తమ వద్ద ఉన్న శక్తులు లేదా అవకాశాల్ని ఆయుధంగా మలుచుకునే ప్రమాదకర పరిస్థితులకు దారితీసిందని హెచ్చరించారు. ఇలా దీనిని ఇతరులపై ఒత్తిడి తెచ్చేందుకు ఉపయోగించుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు దేశాల మధ్య పరస్పర ప్రయోజనాల కోసం సంబంధాలు కొనసాగుతున్నా, మరోవైపు అవసరమైన చోట తమ బలాలనే అస్త్రాలు ప్రయోగిస్తున్నాయని జైశంకర్ తెలిపారు.

కేంద్రరాష్ట్రాల సమన్వయంతోనే వేగవంతమైన అభివృద్ధి

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగానే రహదారుల నిర్మాణం
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సహకారం అభినందనీయం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి

ఎక్తానగర్,గుజరాత్ , వెలుతురు అక్టోబర్ 04 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి రాష్ట్రాల సమగ్ర అభివృద్ధిని సాధించవచ్చని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి అన్నారు. గుజరాత్లోని ఎక్తానగర్లో నిర్వహిస్తున్న చింతన్ శివిర్--2026కు హాజరయ్యేందుకు వచ్చిన ఆయనకు గుజరాత్ రాష్ట్ర సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రహదారుల అభివృద్ధిలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ప్రాజెక్టులు కీలకంగా మారుతున్నాయని చెప్పారు. గడ్కరీ నాయకత్వంలో పర్వతమాల, రోప్వేలు వంటి వినూత్న మౌలిక వసతుల కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని, వీటి ద్వారా దేశ రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతోందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాల అభివృద్ధికి నితిన్ గడ్కరీ సహకరిస్తున్నారని కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ప్రశంసించారు. కాంగ్రెస్, బీజేపీ లేదా ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను సమానంగా పరిగణిస్తూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కోరిన పలు రహదారి ప్రాజెక్టులను కూడా కేంద్ర మంత్రి సానుకూలంగా పరిశీలించి మంజూరు చేస్తున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం పెంపొందించడమే చింతన్ శివిర్ ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. రాష్ట్రాల అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన విధానాలు, పథకాలను రాష్ట్రాల్లో సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని తెలిపారు. తెలంగాణ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రహదారి మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ రాష్ట్రానికి అవసరమైన కీలక రహదారి ప్రాజెక్టులను సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కోమటిరెడ్డి వెంకట్రెడ్డి తెలిపారు.

భారీ అగ్ని ప్రమాదంతో షాప్ దగ్ధం

హనుమకొండ, వెలుతురు అక్టోబర్ 04 : హనుమకొండలోని ఓ షాప్లో అగ్ని ప్రమాదం సంభవించి భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ఈ ఘటనలో సుమారు రూ.2,85,00,000/- విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. బాధితుడి వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 24న రాత్రి షాప్ను మూసివేసి ఇంటికి వెళ్లగా, సెప్టెంబర్ 25వ తేదీ తెల్లవారుజామున సుమారు 2:40 గంటల సమయంలో షాప్లో అగ్ని ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా షాప్లో ఉన్న ఎలక్ట్రికల్ సామాను, ప్లంబింగ్ సామాను, టైల్స్, హార్డ్వేర్, పెయింట్, లైట్స్, ట్యూబ్స్, పీవీసీ సామాను, మెషిన్లు, ఫర్నిచర్ తదితర సామగ్రి పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. ఈ ఘటనలో భారీగా నష్టం వాటిల్లడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. అగ్ని ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో విచారించి, నష్టానికి సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలించాలని కోరారు. ప్రభుత్వం ఆదుకోవాలిఅగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని బాధితులు కోరారు. సంబంధిత అధికారులు వెంటనే షాప్ను పరిశీలించి, జరిగిన నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వ పరంగా అందే సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అగ్ని ప్రమాదానికి గల అసలు కారణాలను గుర్తించి, బాధ్యులు ఎవరైనా ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించిన విషయాలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పరిశీలించి భరోసా కల్పించారు

బాలికపై అత్యాచారయత్నం

- అశ్వాపురంలో కలకలం!
- ఇంటికి దింపుతానంటూ బైక్పై ఎక్కించుకుని దారిలో లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు
- బీఆర్ఎస్కు చెందిన రాయల కోటేశ్వరరావు నిందితుడిగా పోక్సో కేసు
- ఆగ్రహంతో నిందితుడిపై దాడి చేసిన 14 మంది బంధువులపైనా కేసు

కొత్తగూడెం, వెలుతురు అక్టోబర్ 04 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బుడుగు బజార్లో మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్కు చెందిన రాయల కోటేశ్వరరావుపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆడపిల్లల భద్రతపై మరోసారి ఆందోళన కలిగించేలా ఈ ఘటన చోటుచేసుకుందని స్థానికులు పేర్కొంటున్నారు. పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. భద్రాచలంలో ఇంటర్ చదువుతున్న మైనర్ బాలిక రామచంద్రాపురం బస్స్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉంది. అదే సమయంలో బైక్పై అక్కడికి వచ్చిన నిందితుడు రాయల కోటేశ్వరరావు.. బాలికను ఇంటి వద్ద దింపుతానని చెప్పి బైక్పై ఎక్కించుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతదూరం వెళ్లిన అనంతరం బైక్ను ఆపి బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే బాలిక నిందితుడి నుంచి తప్పించుకుని అక్కడి నుంచి బయటపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విషయం తెలుసుకున్న బంధువుల ఆగ్రహం

ఘటన విషయం తెలుసుకున్న బాలిక బంధువులు తీవ్ర ఆగ్రహానికి గురై నిందితుడు రాయల కోటేశ్వరరావుపై దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ దాడి ఘటనపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిపై దాడికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 14 మంది బాలిక బంధువులపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఒకవైపు మైనర్ బాలికపై లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రాయల కోటేశ్వరరావుపై పోక్సో కేసు నమోదు కాగా.. మరోవైపు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని నిందితుడిపై దాడి చేసిన వారిపైనా పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

'ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి'

మైనర్ బాలికలపై లైంగిక వేధింపులు, అత్యాచార యత్నాలకు పాల్పడే వారిపై చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఆడపిల్లల భద్రతకు భంగం కలిగించే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై దర్యాప్తు వేగవంతం చేసి, ఆరోపణలు రుజువైతే చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

విమానం గాల్లో ఉండగా ఢీకొట్టిన పక్షి

- -ఇండిగో ఫ్లైట్కు త్రుటిలో తప్పిన ప్రమాదం..!

పుణె, వెలుతురు అక్టోబర్ 04 : మహారాష్ట్రలోని పుణె సిటీ నుంచి హైదరాబాద్ కు వస్తున్న ఇండిగో విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. విమానం గాల్లో ఉండగా ఓ పక్షి బలంగా ఢీకొట్టింది. వెంటనే అప్రమత్తమైన పైలట్ అత్యంత చాకచక్యంగా ఆ విమానాన్ని హైదరాబాద్లోని శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశాడు. దాంతో ప్రయాణికులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఇండిగోకు చెందిన '6ఈ352' విమానం పుణె నుంచి హైదరాబాద్కు బయలుదేరింది. మార్గమధ్యలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. దాంతో పైలట్ వెంటనే పరిస్థితిని అదుపులోకి తీసుకుని, ఎలాంటి ఇబ్బంది లేకుండా శంషాబాద్ విమానాశ్రయంలో విమానాన్ని దించారు. ల్యాండింగ్ అనంతరం నిపుణులు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో విమానం ముందు భాగంలో సొట్ట పడినట్లు గుర్తించారు. పక్షి ఢీకొనడంవల్లే ఇలా జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. పైలట్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంవల్లే పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. మరోవైపు విమానంలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా చండీగఢ్ వెళ్లాల్సిన సర్వీసును రద్దు చేస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు ప్రకటించారు.

జీఎస్టీ కౌన్సిల్లో కీలక మార్పులు

అధికారులకు అరెస్టు చేసే హక్కు తొలగింపు

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 04 : జీఎస్టీ కౌన్సిల్లో కీలక మార్పులు రాబోతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ 7న న్యూఢిల్లీలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో జీఎస్టీ అమలులో కీలక మార్పులు చేపట్టడంతోపాటు, కొత్త నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ప్రధానంగా జీఎస్టీ విషయంలో అవకతవకలకు పాల్పడిన వారిని అరెస్టు చేసే అధికారాన్ని రద్దు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. కొత్త తరం జీఎస్టీ సంస్కరణలపై కేంద్ర ఆర్థిక శాఖ దృష్టిపెట్టింది. పన్నులు వసూలు చేసే వ్యవస్థలు మరింతగా పౌరులకు అనుకూలంగా, అలాగే, పన్నును త్వరగా రికవరీ చేసేలా ఈ వ్యవస్థల్ని తీర్చిదిద్దాలని కేంద్రం భావిస్తోంది. అధికారికంగా ప్రభుత్వం నుంచి ప్రకటన రానప్పటికీ.. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జీఎస్టీ అధికారులకు నిందితుల్ని అరెస్టు చేసేందుకు ఉన్న హక్కును తొలగించబోతున్నారు. ఇకపై జీఎస్టీ అధికారులు ఎవరినీ అరెస్టు చేయడానికి వీల్లేదు. అలాగే, ఎవరినైనా అరెస్టు చేయాలంటే ముందుగా చట్టపరమైన అనుమతి తీసుకోవాలి. ఇప్పటికే అమలులో ఉన్న సెక్షన్ 69 ప్రకారం నిందితుల్ని జీఎస్టీ అధికారులు అరెస్టు చేయరాదు. ఇందుకోసం కోర్టు నుంచి అనుమతి పొందాలి. పన్ను ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించబోతున్నారు. పన్ను ఎగవేతలో విచారణ జరిపేందుకు ఉన్న కనిష్ఠ పరిమితిని రూ.కోటి నుంచి రూ.5 కోట్ల వరకు పెంచబోతున్నారు. అంటే, తక్కువ పన్ను ఎగవేతదారులపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోరు. అధికారులకు అరెస్టు చేసే హక్కును తొలగిస్తున్నప్పటికీ.. పన్ను వసూలు చేసే అధికారాన్ని మాత్రం అలాగే ఉంచుతారు. పన్నులపై జరిమానా విధించే హక్కు కూడా అధికారులకు ఉంటుంది. డాటా ఆధారంగానే చర్యలు తీసుకునేలా కొత్త నిబంధనలు ఉండనున్నాయి.

హనీట్రాప్లో నేవీ అధికారి

- పాకిస్థాన్కు సీక్రెట్లు చేరవేస్తున్న నావికుడి అరెస్ట్
- తమిళనాడులోని కోయంబత్తూర్లో అరెస్ట్ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పోలీస్ కౌంటర్
- ఇంటెలిజెన్స్(సిఐ) విభాగం వెల్లడి

కోయంబత్తూర్, వెలుతురు అక్టోబర్ 04 : భారత రహస్య సమాచారాన్ని పాకిస్థాన్ నిఘా సంస్థలకు చేరవేస్తున్నాడనే ఆరోపణలపై ఇండియన్ నేవీ చెందిన ఒక నావికుడు అరెస్టయ్యారు. ఇతడిని తమిళనాడులోని కోయంబత్తూర్లో అరెస్ట్ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ పోలీస్ కౌంటర్ ఇంటెలిజెన్స్ (సిఐ) విభాగం వెల్లడించింది. ఈ గూఢచర్య ఆపరేషన్లో సోషల్ మీడియా 'హనీ ట్రాప్'ను ఉపయోగించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. బంగాల్కు చెందిన 31 ఏళ్ల ప్రదీప్ ముఖర్జీ 2014లో నౌకాదళంలో చేరారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే, కోయంబత్తూరులోని నౌకాదళ లీడర్షిప్ ట్రైనింగ్ సెంటర్ 'ఐఎన్ఎస్ అగ్రణి'లో ఒక వారం రోజులుగా మేనేజ్మెంట్ డెవలప్మెంట్ కోర్సులో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ క్రమంలోనే రహస్య సమాచారం చేరవేసిన ఆరోపణలతో ముఖర్జీని అక్టోబర్ 3న ఆంధ్రప్రదేశ్ సిఐ సెల్ అధికారులు అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు.

మెట్రోకు 1% వడ్డీతో రుణాలివ్వాలి

- హైదరాబాద్ మెట్రోను లాభదాయకంగా మార్చేందుకు కేంద్రం సహకరించాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వివేక్ వెంకటస్వామి విజ్ఞప్తి
- తూప్రాన్‌లో సాబర్ డెయిరీ (అమూల్) ప్లాంట్ భూమిపూజ
- హాజరైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు వివేక్ వెంకటస్వామి, శ్రీధర్ బాబు, ఎంపీ రఘునందన్ రావు
- రాష్ట్రంలోని 20 లక్షల మంది విద్యార్థులకు ఏటా 4 కోట్ల లీటర్ల పాలు అవసరం: వివేక్
- చెన్నూరులోనూ అమూల్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి

తూప్రాన్, వెలుతురు:

హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును లాభదాయకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కోరారు. రైల్వే కార్పొరేషన్ ద్వారా 1శాతం నామమాత్రపు వడ్డీతో రుణాలు అందించాలని వివేక్ వెంకటస్వామి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. మెట్రోలో రోజువారీ ప్రయాణికుల సంఖ్యను 10 లక్షలకు పెంచేలా కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకురావాలని కోరారు.

మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఊర్జా ఇండస్ట్రియల్ పార్క్‌లో సాబర్ డెయిరీ ప్లాంట్ (సావీఖా) నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు వివేక్ వెంకటస్వామి, శ్రీధర్ బాబు, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మెదక్ కలెక్టర్, అమూల్ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఇటీవల కామన్ పాస్‌ను ప్రారంభించామని, గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే ప్రయాణికులకు మెట్రో మరింత అందుబాటులోకి వస్తే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. రోజువారీ ప్రయాణికుల సంఖ్య 10 లక్షలకు చేరితే మెట్రో ప్రాజెక్టు మరింత విజయవం తంగా, ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందేలా కిషన్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల పోషకాహార భద్రతకు అమూల్ ప్లాంట్ ఎంతో దోహదపడుతుందని వివేక్ వెంకటస్వామి అన్నారు. స్థానికంగా ఇలాంటి పరిశ్రమను తీసుకురావడం ద్వారా రైతులు, ప్రజలకు ప్రయోజనం కలిగేలా కృషి చేసిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావును అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉదయం అల్పాహార పథకంలో భాగంగా విద్యార్థులకు పాలు అందిస్తున్నామని తెలిపారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 100ml, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 150ml చొప్పున పాలు అందిస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు ఏటా సుమారు 4 కోట్ల లీటర్ల పాలు అవసరమవుతున్నాయని అన్నారు. ప్రస్తుతం అవసరమైన పాలలో దాదాపు 50 శాతం ఇతర ప్రాంతాల నుంచి సేకరించాల్సి వస్తోందని, రాష్ట్రంలోనే అమూల్ వంటి ప్లాంట్ అందుబాటులోకి రావడం వల్ల పాల సేకరణ, సరఫరా మరింత సులభతరం అవుతుందని అన్నారు.

చిన్ననాటి నుంచే అమూల్ పాలు, వెన్నపై ప్రజల్లో ఎంతో విశ్వాసం ఉందని వివేక్ వెంకటస్వామి గుర్తుచేశారు. వ్యాపార రంగంలో ఉన్న సమయంలో ముంబయికి వెళ్లినప్పుడు అమూల్ సంస్థ రూపొందించే వినూత్న ప్రచార హోర్డింగులు తనను ఎంతగానో ఆకట్టుకునేవని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నాణ్యత, నిబద్ధతతో పనిచేయడం వల్లే అమూల్ దేశంలో విశ్వసనీయమైన బ్రాండ్‌గా ఎదిగిందన్నారు.

చెన్నూరు నియోజకవర్గంలోనూ అమూల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని అమూల్ యాజమాన్యానికి వివేక్ వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు. చెన్నూరు ప్రాంతంలో పాల ఉత్పత్తికి, మార్కెట్‌కు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. చెన్నూరుకు సమీపంలోనే మహారాష్ట్ర మార్కెట్ ఉండటంతో పాల ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని వివరించారు. చెన్నూరులో అమూల్ యూనిట్ ఏర్పాటు చేస్తే స్థానిక రైతులకు స్థిరమైన మార్కెట్ లభించడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సాబర్ డైరీ చైర్మన్ శ్యామ్ లాల్ జి పటేల్, కోపరేటివ్ కమిషనర్ రాహుల్ రాజ్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో రూ.400 కోట్లతో అమూల్ డెయిరీ ప్లాంట్

భూమిపూజ కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

తూప్రాన్, వెలుతురు అక్టోబర్ 04: తెలంగాణ నడిబొడ్డున తూప్రాన్‌లో రూ.400 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్ భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పాడి రైతుల ఆర్థిక భవిష్యత్తు, సహకార వ్యవస్థ ప్రాముఖ్యత 'శ్వేత విప్లవం 2.0' గురించి మాట్లాడారు. దాదాపు రూ.400 కోట్ల వ్యయంతో అమూల్ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రాబోయే 18 నెలల్లో నిర్మాణం పూర్తి కానుంది.స్థానిక రైతుల నుంచి పాలను సేకరించి విదేశాలకు ఎగుమతి చేయకుండా, ఇక్కడే పాలు, పెరుగు,మజ్జిగ,లస్సీ,పన్నీర్,ఐస్‌క్రీమ్, నెయ్యి వంటి ఉత్పత్తులను తయారు చేయనున్నారు. దీనివల్ల మహిళలు, యువతకు పెద్దఎత్తున ఉపాధి లభిస్తుంది. దేశంలో ప్రతి గ్రామానికి శ్వేత విప్లవాన్ని తీసుకెళ్లేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొలిసారిగా ప్రత్యేక సహకార శాఖను ఏర్పాటు చేసి, అమిత్ షాను తొలి మంత్రిగా నియమించారు. 2029 నాటికి దేశవ్యాప్తంగా 75,000 కొత్త పాడి సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

ఓటమి భయంతోనే కాంగ్రెస్ డ్రామాలు

- ఖైరతాబాద్‌లో ఓటమి భయంతోనే కోర్టు పిటిషన్లు
- పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకే నాణేనికి రెండు వైపులు
- రెండు పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్న డీకే అరుణ

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 04: ఖైరతాబాద్ నియోజకవర్గంలో జరగబోయే ఎన్నికల్లో ఓడిపోతామనే ముందస్తు భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోర్టు ద్వారా పిటిషన్లు వేయించారని బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహిస్తే, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా అదే అప్రజాస్వామిక విధానాలను కొనసాగిస్తోందని మండిపడ్డారు. ఖైరతాబాద్‌లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడం ఖాయమని స్పష్టం కావడంతోనే కాంగ్రెస్ నాయకత్వంలో వణుకు మొదలైందని వ్యాఖ్యానించారు.

దమ్ముంటే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు వెళ్లాలి

కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా తమ పాలనపై, పది నెలల్లో సాధించిన అభివృద్ధిపై విశ్వాసం ఉంటే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని డీకే అరుణ సవాల్ విసిరారు. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలకు కనీస నైతికత ఉంటే తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి ప్రజా తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా నిష్పక్షపాతంగా కేంద్ర నిధులను కేటాయిస్తుంటే, ఇక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రం రాష్ట్రాన్ని దారుణంగా అప్పుల పాలు చేశాయని ఆరోపించారు.

అభివృద్ధి శూన్యం.. ప్రజలు గుణపాఠం చెప్పాలి

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే నాణేనికి బొమ్మ, బొరుసు లాంటివని, ఈ రెండు పార్టీల పాలనలోనూ తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని డీకే అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు నిధులు లేవంటూ చేతులు దులుపుకోవడం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. ఈ రెండు పార్టీల వైఫల్యాలను, మోసపూరిత వైఖరిని గమనిస్తున్న ప్రజలు రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఖైరతాబాద్‌లో భారతీయ జనతా పార్టీని భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని ఆమె కోరారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- స్కూళ్ల ఆధునికీకరణ, బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
- మెప్మా ద్వారా మధిర పట్టణంలో 10 వేల మంది మహిళలకు నైపుణ్య శిక్షణ
- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన డిప్యూటీ సీఎం

ఎర్రుపాలెం, వెలుతురు అక్టోబర్ 04: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను హెచ్చరించారు. ఆదివారం ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, అధికారులు బాధ్యతగా, జవాబుదారీ తనంతో ప్రజలకు సేవ చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. త్రాగునీటి సమస్య వస్తే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మధిర నియోజకవర్గంలో 9 స్కూళ్లను ఆధునికీకరించి అన్ని సదుపాయాలతో మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దాలని 57 కోట్ల 69లక్షల రూపాయలను మంజూరు చేశామని, ఆధునికీకరణ, సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేసి, విద్యార్థులకు త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బ్రిడ్జిల నిర్మాణ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా పూర్తి చేసి రవాణా సౌకర్యాన్ని సులభతరం చేయాలన్నారు. బ్రిడ్జిల నిర్మాణం ఆలస్యమైతే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నా యని, చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో మధిర పట్టణంలోని 10,000 మంది మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి,స్వయం ఉపాధి కల్పించేలా నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న పనుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తే, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. రహదారుల విస్తరణ, వివిధ అభివృద్ధి పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు పనులు వేగంగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్తంభాల తొలగింపు పనులతో అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు.

భూ రీ-సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకం

భూ రీ-సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రజా ఫిర్యాదులకు తావులేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం అన్నారు. రిసర్వే ప్రక్రియ తర్వాత రికార్డుల నమోదు జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు గడువులోగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు టీ. మధుసూదన్, వీ. మోహన్ రావు, సి ఈ గౌతం రెడ్డి, ఎస్ ఈ శ్రీనివాసా చారి, పీఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, తహశీల్దార్ సునీత ఎలిజబెత్, వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్‌తో భేటీ అయిన మంత్రి కోమటి రెడ్డి

ఏక్తానగర్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో NHAI చైర్మన్ సంతోష్ యాదవ్ తో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ సమావేశంలో మంత్రితో పాటు ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ కూడా ఉన్నారు. - గుజరాత్, వెలుతురు

60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం

- మునగాలలో రూ. 9.60 కోట్లతో కమ్యూనిటీ కిచెన్
- అక్టోబర్ 6న శంకుస్థాపన చేయనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట, వెలుతురు అక్టోబర్ 4:

సూర్యాపేట జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించేందుకు మునగాల మండలంలో రూ. 9.60 కోట్లతో అత్యాధునిక కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అక్టోబర్ 6న మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

మునగాల మండలంలో జాతీయ రహదారి పక్కన, మునగాల-మాధారం మధ్య ఎంపిక చేసిన స్థలంలో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారం తయారు చేసి, ప్యాకింగ్, రవాణా, పంపిణీ చేసే విధంగా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. దేశంలోనే అత్యాధునిక సదుపాయాలతో ఈ వంటశాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

సింగరేణి విరాళంతో ప్రాజెక్టు

కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి కంపెనీ రూ. 9.60 కోట్ల విరాళం అందించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి ఈ నిధులను సమకూర్చినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ఈ కార్యక్రమానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి కంపెనీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.

1,029 విద్యాసంస్థలకు ఆహార సరఫరా

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. జిల్లాలోని సుమారు 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం అల్పాహారం తయారు చేసి సరఫరా చేయడం కమ్యూనిటీ కిచెన్ ప్రధాన ఉద్దేశం. అవసరాన్ని బట్టి ఎంపిక చేసిన కొన్ని జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించే అంశాన్ని కూడా ప్రణాళికలో చేర్చారు.

నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యం

వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవాణా, పంపిణీ కోసం సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఆహార నాణ్యత, పోషక విలువలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విద్యార్థులకు పాఠశాల వేళల్లో పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం,సంక్షేమానికి తోడ్పడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.

మా వాటా తీసుకుంటాం.. అవసరమైతే లాక్కుంటాం

- బీసీల హక్కుల కోసం పోరాడుతాం : మహేష్‌కుమార్ గౌడ్
- శంషాబాద్‌లో టీపీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ
- దేశవ్యాప్తంగా ఓబీసీ కులగణన చేపట్టాలని డిమాండ్
- కులగణన సామాజిక న్యాయానికి పునాది : పొన్నం ప్రభాకర్

శంషాబాద్, వెలుతురు అక్టోబర్ 04: సామాజిక న్యాయం బీసీల రాజ్యాంగ హక్కు అని, జాతీయ జనగణనలో ఓబీసీ కులాల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ శంషాబాద్ గొల్లపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద టీపీసీసీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే శంకరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభకు పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ అనిల్ జైహింద్, మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

బీసీల హక్కుల కోసం మాట్లాడే ధైర్యాన్ని రాహుల్‌గాంధీ ఇచ్చారని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. రాహుల్‌గాంధీ, ఖర్గే ఇచ్చిన ధైర్యంతో తెలంగాణకు బీసీ ముఖ్యమంత్రి అవుతారని ఘంటాపథంగా చెబుతున్నానన్నారు. రాహుల్ భారత్ జోడో యాత్రతో 'ఎవరు ఎంతో వారికి అంత' అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. బీసీలకు రావాల్సిన వాటా తీసుకుంటామని, అవసరమైతే లాక్కుంటామని అన్నారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు దద్దమ్మలని, మోదీ, అమిత్‌షా వద్దకు వెళ్లి బీసీల హక్కుల గురించి చెప్పే దమ్ము, ధైర్యం వారికి లేదని విమర్శించారు. కుల సర్వే సాకారం అయి ఉంటే యావద్దేశానికి తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలిచేదన్నారు. కేంద్ర సర్వేలో పదో కాలంలో ఎస్సీ, ఎస్టీలను ఇచ్చి ఓబీసీ కాలాన్ని ఎత్తేశారని, మోదీ బీసీలను వంచిస్తున్నారని ఆరోపించారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి: పొన్నం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచేలా కులగణన నిర్వహించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వామ్యం చేసి సమగ్రంగా కులగణన నిర్వహించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. బీహార్‌తో పాటు తెలంగాణ కూడా కులగణన నిర్వహించిన రాష్ట్రంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. కులగణన కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం కాదని, దేశంలోని బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల హక్కులకు సంబంధించిన అంశమని అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన జరగాలన్నదే ప్రధాన డిమాండ్ అని, గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు కులగణన కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు.

గ్రామీణ ఆడబిడ్డల చేతి ఉత్పత్తులకు నగర మార్కెట్

అక్టోబర్ 7 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో సారస్ మేళా

సారస్‌ను సందర్శించి మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి : సీతక్క

ఒకవైపు పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతల అందం.. మరోవైపు గ్రామీణ మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న హస్తకళలు, పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఉత్పత్తులు.. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రత్యేకతలు ఒకే వేదికపై కనిపించనున్నాయి. గ్రామీణ మహిళలు, కళాకారులు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు పట్టణ మార్కెట్‌ను కల్పించే సారస్ మేళా అక్టోబర్ 7 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనుంది. - హైదరాబాద్, వెలుతురు

హైదరాబాద్‌లోని ఐమాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించే ఈ మేళాలో తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాలు, కళాకారులు వందల స్టాళ్లు ఏర్పాటు చేసి తమ ఉత్పత్తులను ప్రదర్శించి నేరుగా వినియోగదారులకు విక్రయించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తయారయ్యే ఉత్పత్తులకు మార్కెట్‌ను కల్పించడం సారస్ మేళా ప్రత్యేకత. తయారీదారులు నేరుగా వినియోగదారులను కలుసుకోవడం ద్వారా తమ ఉత్పత్తులకు ఆదరణను అంచనా వేసుకోవడంతో పాటు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యత, ప్యాకేజింగ్, ఉత్పత్తుల్లో మార్పులు చేసుకునే అవకాశం పొందుతారు.

గ్రామీణ ఉత్పత్తులకు తెలంగాణ ప్రభుత్వం మార్కెట్ అనుసంధానం

గ్రామీణ జీవనోపాధులను బలోపేతం చేయడం, మహిళా పారిశ్రామికతను ప్రోత్సహించడం, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడంలో సారస్ మేళా కీలకంగా నిలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెర్ప్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మహిళలు ఉత్పత్తిదారులుగా మాత్రమే కాకుండా మార్కెట్ అవసరాలను అర్థం చేసుకుని వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునే పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఈ వేదిక తోడ్పడుతుంది. "ఆడబిడ్డల చేతిలో ఉన్న నైపుణ్యానికి మార్కెట్‌ను జోడిస్తే అదే వారి ఆర్థిక స్వావలంబనకు బలమైన పునాది అవుతుంది.

ప్రభుత్వం వారికి ఆ అవకాశాలను కల్పించే దిశగా పనిచేస్తోంది" అని సీతక్క పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రతిభకు వేదిక

వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొనే మహిళా పారిశ్రామిక వేత్తలు, కళాకారుల ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులోకి రావడం సారస్ మరో ప్రత్యేకత. దీంతో కొత్త ఉత్పత్తులను తెలుసుకోవ డంతో పాటు, ఇతర ప్రాంతాల మార్కెటింగ్ పద్ధతులు, నైపుణ్యాలను పరస్పరం పంచుకునే అవకాశం ఏర్పడుతుంది. భవిష్యత్తులో మార్కెట్ లింకేజీలు, బల్క్ ఆర్డర్లు, వ్యాపార భాగస్వామ్యాలకు కూడా ఇది దోహదపడుతుంది. తెలంగాణ నుంచి పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతలు, కలంకారి, ఎంబ్రాయిడరీ చీరలతో పాటు చెక్క బొమ్మలు, జూట్ బ్యాగులు, లెదర్ బ్యాగులు, మట్టి పాత్రలు, బంజారా కళాకృతులు, హెర్బల్ ఉత్పత్తులు, వివిధ ఆర్ట్ వర్క్స్ ప్రదర్శనలో ఉంటాయి. తెలంగాణ పిండి వంటలు, పచ్చళ్లు, వివిధ రకాల పొడులు, మిల్లెట్స్ తదితర ఆహార ఉత్పత్తులు కూడా వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి.

సారస్‌ను సందర్శించాలని సీతక్క పిలుపు

సారస్ మేళా ద్వారా గ్రామీణ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు నేరుగా వినియోగదారుల ఆదరణ లభిస్తుందని, అది వారి వ్యాపార ప్రోత్సాహానికి దోహదపడుతుందని మంత్రి సీతక్క అన్నారు. "హైదరాబాద్ ప్రజలు కుటుంబ సమేతంగా సారస్ మేళాను సందర్శించాలి. మన ఆడబిడ్డలు ఎంతో శ్రమించి తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలి.

మనం చేసే ప్రతి కొనుగోలు వారి శ్రమకు ఇచ్చే ప్రోత్సాహం మాత్రమే కాదు.. వారి ఆర్థిక స్వావలంబనకు అందించే అండ" అని సీతక్క పిలుపునిచ్చారు. అక్టోబర్ 7 నుంచి 18 వరకు జరిగే సారస్ మేళా గ్రామీణ మహిళల ఉత్పత్తులను హైదరాబాద్ నగర వినియోగదారులకు చేరువ చేయడంతో పాటు, వారికి కొత్త మార్కెట్ అవకాశాలను పరిచయం చేసే వేదికగా నిలవనుంది.

36 గంటలపాటు నీళ్లు బంద్

- సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు..
- ప్రకటించిన జలమండలి అధికారులు

హైదరాబాద్, వెలుతురు:

వాటర్ పైపులైన్ల మరమ్మతుల నిమిత్తం హైదరాబాద్ సిటీలోని వివిధ ప్రాంతాల్లో 36 గంటలపాటు నీళ్లకు అంతరాయం ఏర్పడనుంది. ఈ క్రమంలో నీటిని పొదుపు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. హైదరాబాద్ సిటీలో సోమవారం నుంచి కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని జలమండలి అధికారులు స్వయంగా ప్రకటించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు అంతరాయం ఏర్పడింది. అందుకు కారణాలు లేకపోలేదు. నాసర్లపల్లి నుంచి గొడకొండ్ల వరకు దయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌లో దెబ్బతిన్న ఎంఎస్ ఎయిర్ టీలు, వాల్వ్?లను మార్చే పనులు చేస్తోంది వాటర్ బోర్డు. ఈ క్రమంలో ప్రజలను అలర్ట్ చేశారు. ముఖ్యంగా ఆదిబట్ల, కమ్మగూడ, గుర్రంగూడ, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, ఆటోనగర్, అల్మాపురి, బీరప్పగడ్డ, హబ్సిగూడ, రామంతాపూర్, వెంకట్‌రెడ్డి నగర్, ఉప్పల్, నాచారం, హెచ్ ఎంటీ నగర్, తార్నాక, బౌద్ధనగర్, లాలాపేట్ అంతరాయం ఏర్పడవచ్చని తెలిపింది. దీనికి తోడు హస్మత్‌పేట్, ప్రకాశ్‌నగర్, మేకలమండి, భోలక్‌పూర్, పద్మారావునగర్, బేగంపేట్, సౌత్ సెంట్రల్ రైల్వే, ఎంఈఎస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, లాలాగూడ వంటి ప్రాంతాలు ఉన్నాయి. అలాగే అడ్డగుట్ట, పట్టిగడ్డ, నల్లగుట్ట, గౌతమ్‌నగర్, ఫిరోజ్‌గూడ, బన్సీలా ల్‌పేట్, రాంగోపాల్‌పేట్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, వైశాలీనగర్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, ఏఆర్‌సీఐ, బాలాపూర్, మైసారం, బార్కాస్, ఎన్‌పీఏ, శంషాబాద్, మధుబన్, ప్రశాసన్‌నగర్ వంటి ప్రాంతాలు ఉన్నాయి.

గురుకులాల్లో విద్యా ప్రమాణాలతో పాటు మౌలిక వసతుల బలోపేతం

- యూనిఫార్ములు, షూస్, పుస్తకాలు సకాలంలో అందాలి
- శానిటేషన్, భద్రత, తాగునీరు, వంటశాలలపై ప్రత్యేక దృష్టి
- క్వాలిటీ, క్వాంటిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి
- ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ

హైదరాబాద్, వెలుతురు:

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫార్ములు, షూస్, పుస్తకాలు తదితర వస్తువులు ఆలస్యం లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం గురుకులాలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్య సాచి ఘోష్, శాఖ కార్యదర్శి శ్రీమతి విజయేంద్ర బోయి ఉన్నతాధికారులతో ఈ సమీక్ష నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు చేరిన యూనిఫార్ములు, షూస్, పుస్తకాలు తదితర సామగ్రిని విద్యార్థులకు వెంటనే అందించాలని మంత్రి సూచించారు. సరఫరా ఎక్కడ నిలిచిపోయింది.. ప్రొక్యూర్‌మెంట్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అనే అంశాలను గుర్తించి జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అంశానికి నిర్దిష్ట గడువు నిర్ణయించి, పురోగతిపై నివేదికలు తీసుకోవాలని సూచించారు.

వందలాది మంది విద్యార్థులు ఉండే పెద్ద క్యాంపస్‌లలో ప్రస్తుత పారిశుద్ధ్య సిబ్బంది సరిపోతున్నారా అనే అంశాన్ని పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట్ల పారిశుద్ధ్య, స్కావెంజింగ్ సేవలను సమర్థంగా నిర్వహించేందుకు తగిన విధానం రూపొందించాలన్నారు. స్థానిక అవసరాలను బట్టి కాంటింజెన్సీ సిబ్బందిని వినియోగించడంతో పాటు, అవసరమైతే పారదర్శక ఆన్‌లైన్ టెండర్ విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతము సిబ్బందికి అందిస్తున్న వేతనాలు చాలా తక్కువ ఉన్నాయి అని వాటిని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులు ఆదేశించారు.

గురుకులాలను పూర్తి స్థాయిలో మరింత తీర్చిదిద్దేందుకు విద్యార్థుల సంఖ్య, స్థానిక అవసరాలకు అనుగుణంగా సమగ్ర మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. తరగతి గదులు, వంటశాలలు, తాగునీరు, ఆర్‌ఓ ప్లాంట్లు, వాషింగ్ సదుపాయాలు, శానిటేషన్, అవసరమైన పరికరాలను ఒకే ప్రణాళికలో చేర్చాలన్నారు. ఇప్పటికే అమలులో ఉన్న మంచి ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ నమూనాలను పరిశీలించి, అనువైన వాటిని ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.

విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట్ల భద్రతా సిబ్బంది, పోలీసు సమన్వయం, సీసీ కెమెరాల ఏర్పాటుపై సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. ముఖ్యంగా బాలికల గురుకుల విద్యాలయాల సంస్థలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేయాలని మంత్రి ఆదేశించారు. గురుకులాల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. బోధనా విధానంలో ఏకరూపత తీసుకురావడంతో పాటు గతంలో ఎదురైన బోధనా సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో సబ్జెక్టు నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఆన్‌లైన్ తరగతులు, రిమోట్ అకడమిక్ సపోర్ట్, ఫౌండేషన్ కోర్సులను విస్తరించాలని సూచించారు. ఈ సమీక్షలో ఎస్సీ గురుకులాల కార్యదర్శి రవి గుగులోతు, ఎస్టీ గురుకులాల కార్యదర్శి శ్రీమతి సీతాలక్ష్మి, ఆశ్రమ పాఠశాలల డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు నిర్మల్ జిల్లాలో మంత్రుల పర్యటన

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ అంశాలపై సమీక్ష
- నిర్మల్ జిల్లాలో రూ.23.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్న మంత్రి జూపల్లి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 04: పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని జిల్లాల కలెక్టర్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి, రెవిన్యూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అంతకుముందు నిర్మల్ జిల్లాలో రూ.23.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఐడీఓసీలో ప్రజా సమస్యలపై ఫిర్యాదులను స్వీకరిస్తారు.

మంత్రి జూపల్లి ఆదిలాబాద్ పర్యటన వివరాలు (06-10-2026):

ఉట్నూర్ మండలం మత్తడిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. వివిధ అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. ఉట్నూర్‌లోని గోండ్ రాజుల కోటను సందర్శించి, పర్యాటక అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. తర్వాత ఇంద్రవెల్లికి చేరుకుని మిస్ ఎర్త్ వాటర్ ఇండియా అవార్డు-2026 విజేత ప్రీతి ముండేను సన్మానిస్తారు. అనంతరం ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రిని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించనున్నారు.

ప్రజా సేవా భవన్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన సంక్షిప్త సమావేశంలో పాల్గొంటారు.

హైదరాబాద్‌లో 70 ఏళ్ల పాలనా వ్యవస్థ రద్దు

- అక్టోబర్ 2 నుంచి క్యూర్-2026 అమలు చట్టం అమలులోకి..
- 70 ఏళ్ల జీహెచ్ఎంసీ చట్టానికి ముగింపు
- ఒక్క ఐడీ పన్ను, నీటి బిల్లులకు ఒకే బిల్లు ఉండేలా చర్యలు

హైదరాబాద్, వెలుతురు:

హైదరాబాద్ పాలనలో కొత్త చట్టం అక్టోబర్ 2 నుంచి క్యూర్-2026 అమలు చట్టం అమలులోకి వచ్చింది. దీంతో 70 ఏళ్ల జీహెచ్ఎంసీ చట్టానికి ముగింపు పడింది. దీంతో కొత్త పాలనా విధానానికి శ్రీకారం చుట్టారు. ఒక్క ఆస్తికి ఒక్క ఐడీ పన్ను, నీటి బిల్లులకు ఒకే బిల్లు ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు..

ఇల్లు రిజిస్ట్రేషన్ కాగానే మ్యూటేషన్ ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా ఈ కొత్త చట్టం పనిచేయనుంది. ఆస్తిపన్ను పెంపుపై పరిమితి ఏడాదికి గరిష్ఠంగా 10 శాతమే ఉండనుంది. ఇక భవన అనుమతులన్నీ ఆన్‌లైన్‌లో నమోదుచేసుకునేలా చర్యలు చేపట్టారు. ఒక వేళ ఆలస్యం అయితే అప్పీల్‌కు అవకాశం కల్పించనున్నారు. రోడ్లు తవ్వే ముందు శాఖల సమన్వయం అనవసర తవ్వకాలకు చెక్ పెట్టనున్నారు.

స్కూల్ జోన్లపై ఫోకస్..

ఈ కొత్త చట్టంతో ట్రాఫిక్, రోడ్డు భద్రతకు ప్రత్యేక వ్యవస్థను స్కూల్ జోన్లపై ఫోకస్ పెట్టనున్నారు. చెరువులు, నాలాలు, పార్కుల రక్షణకు హైడ్రాకు మరిన్ని అధికారాలు చట్టబద్ధతతో ఇవ్వనున్నారు. వరదలు, అగ్నిప్రమాదాలపై ప్రత్యేక ప్రణాళికలతో పాటు భవనాల భద్రతకు ఫైర్ ఆడిట్ మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, గిగ్ కార్మికులకు ప్రత్యేక సదుపాయాలను ఈ కొత్త చట్టంతో కల్పించనున్నారు.

కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని పాదయాత్ర

- మంథని నుండి ఐదు రోజుల పాదయాత్ర
- ఎర్రవెల్లికి చేరుకున్న కేసీఆర్ యువ అభిమానులు

హైదరాబాద్, వెలుతురు:



తెలంగాణ సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తమ అభిమాన నేత, బిఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావు గారు తిరిగి ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష రోజు రోజుకూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో బలపడుతున్నది. ఈ మేరకు ఇప్పటికే పలు సందర్భాల్లో పాదయాత్రలు, తదితర దీక్షల ద్వారా కేసీఆర్ పట్ల తమ అభిమానాన్ని చాటుకుంటున్న విషయం తెలిసిందే. ఇదే కోవలో మరో ముగ్గురు యువకులు మంథని నుండి పాదయాత్ర చేస్తూ ఆదివారం నాడు ఎర్రవెల్లి కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. తెలంగాణ ప్రగతి సాధకుడు కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి గాడిలో పడుతుందని, ఉద్యోగ ఉపాధి రంగాల్లో తెలంగాణ యువతకు అవకాశాలు మెరుగవుతాయని పాదయాత్ర చేసిన ముగ్గురు యువకులు మంథని బెన్నిపాల్, బూర్ల వెంకటేశ్, కొండ వెంకటేశ్ తెలిపారు. మంథని నుండి పాదయాత్ర చేస్తూ వచ్చిన బిఆర్ఎస్ యువ కార్యకర్తలను సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ వారితో కాసేపు ముచ్చటించారు. తనపట్ల వారు చూయించిన అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. కాగా.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవ్వడమే గాక, పూర్తి విరుద్ధంగా పనిచేస్తున్నదనే విషయాన్ని ప్రజలు గ్రహించారని, తమ పాదయాత్ర సందర్భంగా ప్రజలతో వారి అనుభవాలను కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. కేసీఆర్ పాలనలో తాము అనుభవించిన పాలనా ఫలితాలను రాష్ట్ర ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని, కాంగ్రేస్ హామీలను నమ్మి మోసపోయి తాము ఏమి కోల్పోయామో అర్థం చేసుకున్నారని వారు తెలిపారు. మంథనితో పాటు, రాష్ట్ర ప్రజలందరూ రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ గారినే తిరిగి ముఖ్యమంత్రిగా నిలబెట్టుకోవడం ఖాయమని పాదయాత్ర చేసిన యువకులు స్పష్టం చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, MdI.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com